
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 26-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 25 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50

మువ్వన్నెల కాంతులు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా చార్మినార్‌కు వెలుగులు

సర్కారు బడుల్లో జోష్

కరోనా తర్వాత ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలు

- దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇవే పరిస్థితులు
- 2022లో నమోదు 72.9 శాతానికి పెరుగుదల : నివేదిక





కరోనా తర్వాత పేద,మధ్యతరగతి బతుకులు చెల్లాచెదురయ్యాయి. ఉపాధికి దూరమై..పనికోసం తంటాలు పడేస్థితికి చేరుకున్నాయి. తమ బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించి...అప్పో సొప్పో చేసి ప్రయివేటు బడులకు పంపేవారు. కానీ ఇపుడు వారి చదువు కోసం పైసల్లేక ..ప్రభుత్వ బడులకు పంపక తప్పటంలేదు. ఇదే ప్రథమ్ సర్వేలో వెల్లడైంది.

న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి రాక తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ అనేక మంది చిన్నారులు ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు మారారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు కనిపించాయి. 17వ దేశవ్యాప్త వార్షిక విద్యాస్థితి (ఏఎస్ఈఆర్) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 616 జిల్లాల్లోని దాదాపు ఏడు లక్షల మంది చిన్నారులను కవర్ చేస్తూ ఈ నివేదికను రూపొందించారు. ఈ సర్వేను ప్రథమ్ ఎన్జీవో నిర్వహించింది.

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. 2018-2022 మధ్యలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల నమోదు పెరిగింది. కోవిడ్ మహమ్మారి అనంతరం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను తీసుకున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2018లో ప్రభుత్వ స్కూళ్లలో చేరిన పిల్లల సంఖ్య 65.6 శాతంగా ఉండగా.. 2022లో అది 72.9 శాతానికి పెరిగింది. ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయసున్న చిన్నారుల్లో 98.4 శాతం మంది ప్రస్తుతం ఒక రకమైన సరైన విద్యలో నమోదు చేయబడ్డారు.

మరోపక్క, అన్ని తరగతుల స్కూల్ చిన్నారుల పఠనాశక్తి 2012కు ముందు స్థాయి వరకు పడిపోయాయి. అలాగే కనీస గణిత నైపుణ్యాలు 2018 స్థాయిలకు పడిపోవటం గమనార్హం. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాల,బాలికల గైర్హాజరు కనిపించింది. రెండో తరగతి స్థాయి పాఠాలను చదవగలిగే మూడో తరగతి పిల్లల శాతం ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో 2018లో 27.3 శాతం నుంచి 2022లో 20.5 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల ప్రతి రాష్ట్రంలోనూ కనిపించింది. 2018లో పఠనా స్థాయి అధికంగా ఉన్న రాష్ట్రాలలో అదే ఏడాది నుంచి పది శాతం కంటే ఎక్కువ పాయింట్లు పడిపోయిన రాష్ట్రాల జాబితాలో హిమాచల్ ప్రదేశ్ (47.7 శాతం నుంచి 28.4 శాతం), హర్యానా (46.4 శాతం నుంచి 31.5 శాతం) లు ఉన్నాయి.

జేఎన్‌యూలో రణరంగం

విద్యార్థులపై రాళ్లు..గాజు ముక్కలతో హిందూత్వ శక్తుల దాడి

- బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన అడ్డుకునేందుకు రాత్రంతా కరెంట్ కట్..
- జామియా మిలియాలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అరెస్టు





న్యూఢిల్లీ : గుజరాత్ 2002నాటి అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించకుండా మోడీ సర్కార్ అణచివేత చర్యలకు దిగుతోంది. వివిధ వర్సిటీల్లో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనలను జీర్ణించుకోలేకపోతోంది. మంగళవారం రాత్రి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో డాక్యుమెంటరీ చూస్తున్న వందలాది మంది విద్యార్థులపైకి రాళ్లు, గాజు ముక్కలతో దాడి జరిగింది. ఏబీవీపీ కార్యకర్తలు ఈదాడికి తెగబడ్డారని ఆరోపణలు వెలువడ్డాయి. బుధవారం ఢిల్లీ జామియా మిలియా వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ ప్రదర్శన చేపట్టగా, డాక్యుమెంటరీ ప్రసారమవుతుండగా....మధ్యలో పోలీసులు రంగంలోకి దిగి కార్యక్రమాన్ని నిలిపివేశారు

మంగళవారం రాత్రి డాక్యుమెంటరీ ప్రదర్శనకు జేఎన్‌యూ విద్యార్థి సంఘం పిలుపునివ్వగా, ఈ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాలని వర్సిటీ యాజమాన్యం, పోలీసులు బెదిరింపులకు దిగారు. ప్రదర్శన ముగిసిన తర్వాత రాత్రి 10.40 గంటల సమయంలో కమ్యూనిటీ సెంటర్ వద్ద గుమికూడిన విద్యార్థులపై రాళ్లదాడి జరిగింది. హాజరైనవారి పైకి పగిలిన అద్దాల్ని విసిరేశారని మీడియాలో వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. వర్సిటీ యాజమాన్యం మంగళవారం రాత్రంతా విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. ప్రధాన గేట్లతో సహా అనేక చోట్ల దారుల్ని పోలీసులు మూసేశారు. అయినప్పటికీ వర్సిటీలో క్యాంపస్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన డాక్యుమెంటరీ ప్రదర్శనకు వందలాది మంది విద్యార్థులు హాజరుకావటం విశేషం.

తమ మొబైల్ ఫోన్లలో, ల్యాప్‌ట్యాప్స్‌లో డాక్యుమెంటరీని విద్యార్థులంతా చూశారు. డాక్యుమెంటరీ ప్రదర్శనకు ముందు జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఆయిషీ ఘోష్ ప్రసంగించారు. "డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైఫై, విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. అయినా మన కార్యక్రమం ఆగిపోదు" అని చెప్పారు. "కార్యక్రమం జరగకుండా వర్సిటీ యాజమాన్యం అడ్డంకులు సృష్టించింది. విద్యుత్ సరఫరా నిలిపివేయటం పిరికిచర్య. అన్ని రకాల భావాలపై చర్చించే వేదికగా ఈ వర్సిటీకి పేరుంది. అయితే ఇప్పుడు వర్సిటీ యాజమాన్యం వ్యవహరించిన తీరు విద్యాసంస్థ ప్రతిష్టను దెబ్బతీసింది"అని ఒక విద్యార్థి అన్నారు.

చూడొద్దు..అంటూ నోటీసు

డాక్యుమెంటరీ చూడొద్దు, ప్రదర్శనలో పాల్గొనద్దు..అంటూ సోమవారం నాడు జేఎన్‌యూ యాజమాన్యం విద్యార్థులను బెదిరించింది. జేఎన్‌యూఎస్‌యూ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అనుమతులు లేవని పేర్కొంది. ఇదిలా ఉండగా, మంగళవారం రాత్రి కమ్యూనిటీ సెంటర్ వద్ద జరిగిన రాళ్లదాడి, గాజుపెంకల దాడి..ఏబీవీపీ కార్యకర్తల పనేనని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆరోపించింది. దాడి ఘటనను తీవ్రంగా ఖండించింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా గళమెత్తుతారని, ప్రజాస్వామిక గొంతు ...5లో

పీఎంపై బీబీసీ డాక్యుమెంటరీని దాయడానికే

- ఎమర్జెన్సీ అధికారాలు...వివాదాస్పద ఐటీ నిబంధనల ప్రయోగం
- ట్విట్టర్, యూట్యూబ్ లకు ఎంఐబీ ఆదేశాలు వివరాలు 12లో..

సేఫ్టీ ఆడిట్ నిర్వహించండి

అవసరమైతే చట్టాలు మారుద్దాం

- స్కూళ్లు, ఆస్పత్రులు సహా భవనాలన్నీ తనిఖీ చేయండి
- అగ్నిప్రమాద మృతులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో భారీ, ఎత్తయిన భవనాలు, వ్యాపార, వాణిజ్య భవనాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అపార్టుమెంట్లలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రులు నిర్ణయించారు. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందచేయాలని ఆదేశించారు. సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదం నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ అనుమతులు లేని భవనాలపై చేపట్టాల్సిన చర్యలపై బీఆర్కే భవన్‌లో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కే తారకరామారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీకుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటి మేయర్ మోతే శ్రీలత రెడ్డి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఇంధన, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లోకేష్‌కుమార్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ పోలీస్ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్, హైదరాబాద్ ...5లో

పద్మపురస్కారాల ప్రకటన



- బి. రామకృష్ణారెడ్డి, చినజీయర్, కీరవాణి తో పాటు మరో 9 మందికి అవార్డులు
- మొత్తం 106 పురస్కారాలు..

91 మందికి పద్మశ్రీ పురస్కారాలు వివరాలు 2లో..

- ఆరు పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్ 25 పద్మశ్రీ అవార్డుల గ్రహీతల జాబితా విడుదల

రిపబ్లిక్ డేను నిర్వహించాలి

కేంద్రం మార్గదర్శకాల ప్రకారం పరేడ్‌ను కూడా ఏర్పాటు చేయాలి : హైకోర్టు ఆదేశం



వివరాలు 2లో..

పౌష్టికాహారంలో కామారెడ్డి వెనుకబాటు

అర్థగణాంకశాఖ నివేదికలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న కార్యక్రమాలు, పథకాలను బలోపేతం చేస్తూ కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నది. ఈ కార్యక్రమాలు, పథకాలు ఇస్తున్న ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వాటిని మెరుగుపరుస్తున్నది.

ఈ నేపథ్యంలో గతేడాది జిల్లాల వారీగా ఆయా కార్యక్రమాల అమలు, పథకాల నుంచి లబ్ధిపొందిన వారికి సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో 19,79,139 మంది పిల్లలుండగా అందులో 1,20,447 మంది (6.09 శాతం) పౌష్టికాహార ..5లో

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

ఎమ్మెల్యే వేధిస్తున్నారంటూ విలేకర్ల ముందు కన్నీరు



- ఈనెల 23న చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్ల సంతకాలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేశారు. కౌన్సిలర్లను అడ్డుపెట్టుకుని తనను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వేధిస్తున్నారంటూ ...5లో

వేతన జీవులకు ఊరట లభించేనా?

మోడీ హయాంలో మారని ఆదాయ పన్ను శ్లాబులు

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌పై ఉద్యోగుల్లో ఆశలు
- రూ.5 లక్షల వరకు పన్ను మినహాయింపునివ్వాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఒకటిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే 2023-24 వార్షిక బడ్జెట్‌పై వేతన జీవులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఏడాదిలో పార్లమెంటుకు ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకూ అనుకూలమైన బడ్జెట్‌ను ఈసారి ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు. అందులో భాగంగా ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచే దిశగా ఆలోచిస్తున్నట్టు సమాచారం. రూ.ఐదు లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలంటూ 2015 నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయినా మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రస్తుతం ఉన్న ఆదాయ పన్ను శ్లాబులే అమలవుతున్నాయి. అయితే ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచలేదు కానీ శ్లాబుల్లో మార్పు చేసింది. అంటే రూ.2.5 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 2014 నుంచి ఇదే పద్ధతి కొనసాగుతున్నది. ఏటా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిలో మార్పు ఉంటుందని వేతన జీవులు ఆశించి భంగపాటుకు గురికావడం పరిపాటిగా మారింది. ఆ పరిమితిని ...5లో

నవతెలంగాణ

రిపబ్లిక్ డేను నిర్వహించాలి

పరేడ్‌ను కూడా ఏర్పాటు చేయాలి: హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గణతంత్ర వేడుకల్ని ఘనంగా, అధికారికంగా, వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇదొక జాతీయ జెండా పండుగనీ, దేశభక్తిని చాటేదని స్పష్టం చేసింది. కరోనా కారణంగా బహిరంగంగా కాకుండా రాజ్‌భవన్‌లో నిర్వహిస్తున్నామన్న ప్రభుత్వ వాదనను తిరస్కరించింది. గతంలో మాదిరిగానే నిర్వహించాలని ఆదేశించింది. పరేడ్ కూడా నిర్వహించాలంది. అయితే, ఎక్కడ నిర్వహించాలనే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. రిపబ్లిక్ డే వేడుకలకు ప్రజలను కూడా అనుమతించాలని సూచించింది. వేడుకలకు ఒక్కరోజే సమయం ఉన్నందున కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని ఏజీని ఆదేశించింది. కేంద్రం ఈ నెల 19న విడుదల చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) గైడ్‌లైన్స్‌ను విధిగా అమలు చేయాలని సూచించింది. ఈ నెల 18న కేంద్రం ఇచ్చిన గైడ్‌లైన్స్ ఢిల్లీలో నిర్వహించే వేడుకలకు చెందినదని గుర్తు చేసింది. ఈ మేరకు జస్టిస్ మాధవీదేవి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండేండ్ల మాదిరిగా (కరోనా సమయంలో) ఈసారి కూడా రాజ్‌భవన్‌లో రిపబ్లిక్‌డే నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నెల 19న ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను భోజన విరామ సమయం తర్వాత న్యాయమూర్తి విచారించి ఉత్తర్వులు జారీ చేశారు. రిపబ్లిక్ డే నిర్వహించేందుకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదనే విషయాన్ని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సూర్యకిరణ్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ నెల 19న కేంద్రం (నెం22/2023) జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం రిపబ్లిక్‌డే నిర్వహించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలని కోరారు. దేశంలో రిపబ్లిక్‌డే నిర్వహించకుండా ఏ రాష్ట్ర ప్రభుత్వమూ లేదన్నారు. దేశంలోనే తొలిసారి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్ఫూర్తిని పెంపొందింప చేయడమే రిపబ్లిక్‌డే లక్ష్యమనీ, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చడం అన్యాయమన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున రిపబ్లిక్ డే ను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం సమరయోధులు సాధించిన విజయాల్లో భాగమే రిపబ్లిక్ డే అని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పోలీసులకు, ప్రభుత్వ ఉద్యోగుల సేవల్ని గుర్తించి గవర్నర్ ద్వారా అవార్డులు ఇవ్వడం కూడా జరుగుతూ వచ్చిందన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏటా జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంతోమంది కుటుంబాలతో హాజరవుతారని, ఇదొక వేడుకగా చేస్తారనీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏవిధమైన ఏర్పాట్లు చేయకపోవడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. రిపబ్లిక్‌డే అంటే హాలిడే కాదనీ, ఇంట్లో కూర్చునే రోజు కాదనీ, జాతీయతను చాటి చెప్పే రోజంటూ సూర్య ముత్తు వర్సెస్ కేరళ కేసులో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. మన పూర్వీకులు దేశం కోసం పాటుపడిన తీరుతెన్నులు, ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల రక్షణకు రాసుకున్న గొప్ప రాజ్యాంగం గురించి నెమరవేసుకోవడం ద్వారా నేటి తరానికి ఆనాటి త్యాగాలను చాటి చెప్పడమే రిపబ్లిక్‌డే ఉద్దేశమని చెప్పారు. పెద్ద సంఖ్యలో స్కూల్ పిల్లలు హాజరయ్యేలా చేసి వారిలో జాతీయ స్ఫూర్తిని పెంపుదలకు కృషి జరిగేదన్నారు. రిపబ్లిక్‌డేకు హాజరయ్యే వారికి మంచినీళ్లు, ఆహారం వంటికి కూడా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని వివరించారు. ఈ ఏర్పాట్లన్నీ చేసేలా కూడా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన రిపబ్లిక్‌డే వేడుకల్ని రాజ్‌భవన్‌లో నిర్వహించుకోవాలంటూ గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయడం దారుణమన్నారు. రాష్ట్ర తొలి పౌరురాలికి ఆ విధమైన సమాచారం ఇవ్వడం శోచనీయమన్నారు. ఈ మేరకు పత్రికల్లో వార్తలు చూసి పిటిషనర్ విస్తుపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరేడ్‌గ్రౌండ్‌లో రిహార్సల్స్ జరిగేవనీ, ఈ ఏడాది మాత్రమే జరగలేదన్నారు. దేశ స్వాతంత్ర్య/గణతంత్ర వేడుకల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం ద్వారా జాతీయత ఇనుమడింపజేయడమనే ప్రధాన ఆశయాన్ని నీరుగార్చేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. ప్రభుత్వ చర్య రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరారు. తుది తీర్పు వెలువరించేలోగా గురువారం రిపబ్లిక్‌డే నిర్వహించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. లక్షల మందితో సభలు నిర్వహించేప్పుడు కరోనా అడ్డురాలే దన్నారు. రిపబ్లిక్‌డే జరిపేందుకు మాత్రం కరోనాను సాకు చూపడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, కోవిడ్ కారణంగా ఏర్పాట్లు చేయలేదన్నారు. ఇప్పటికిప్పుడు ఏర్పాట్లు చేయాలని ఆదేశిస్తే అందుకు అనుగుణంగా చేసేందుకు సమయం సరిపోదన్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం తెలియజేసిందని వివరించారు. రాష్ట్రంలో కరోనా ప్రభావం ఉన్నందున ఈ నెల 13న రాజ్‌భవన్‌కు లేఖ రాశామని.. రాజ్‌భవన్‌లోనే వేడుకలను జరుపుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వెబ్ కాస్టింగ్ విధానంలో జనం చూసేలా ఏర్పాట్లు కూడా చేశామన్నారు.

డీజీపీ కార్యాలయంలో కంటి వెలుగు

- ప్రారంభించిన అంజనీ కుమార్

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

డీజీపీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. దీనిని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ప్రారంభించారు. 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అని అలాంటి కీలకమైన నేత్రాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేయించడం సంతోషదాయకమని ఆయన అన్నారు. డీజీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని 5 రోజుల పాటు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందులో అధికారులు మొదలుకొని సిబ్బంది వరకు ప్రతి రోజు వంద మందికి పరీక్షలు జరిపించనున్నామని ఆయన చెప్పారు.

భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు

- 60 మంది అధికారులకు స్థాన చలనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకేసారి 60 మంది వరకు ఐపీఎస్ అధికారులను బదిలీ చేయటం ఇదే మొదటి సారి. బదిలీ అయినవారిలో ఎస్పీ స్థాయి నుంచి ఐజీ స్థాయి అధికారుల వరకు ఉన్నారు. ఇందులో కొందరు నాన్‌కేడర్ వ్యక్తులతో పాటు మరికొందరు ర్యాంకు ప్రమోటీ ఐపీఎస్ అధికారులున్నారు.

పద్మ పురస్కారాల ప్రకటన

న్యూఢిల్లీ : తెలంగాణకు చెందిన బి. రామకృష్ణారెడ్డి (80)కి పద్మశ్రీ అవార్డు వరించింది. సాహిత్యం, విద్య (భాషాశాస్త్రం) విభాగంలో ఆయనకు ఈ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను బుధవారం రాత్రి విడుదల చేసింది. ఆరు పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్, 25 పద్మశ్రీ అవార్డుల గ్రహీతల జాబితాను విడుదల చేసింది. పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను ఈ అత్యున్నత పురస్కారాలకు ఎంపిక చేసింది.

ఈ అవార్డులకు గాను కేంద్ర ప్రభుత్వం గతేడాది మే 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు నామినేషన్లు స్వీకరించింది. కళలు, సాహిత్యం, విద్య, వైద్యం, క్రీడా, సామాజిక, విజ్ఞాన, ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పారిశ్రామిక, తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి వారి పురస్కారాలు ప్రకటించింది. ఓఆర్‌ఎస్‌తో ముందుకు వచ్చిన దిలీప్ మహలనాబిస్‌కు మరణానంతరం మెడిసిన్ (పీడియాట్రిక్స్) విభాగంలో పద్మవిభూషణ్‌ను ప్రకటించారు. గిరిజన, దక్షిణాది భాషలకు అనేక సేవలందించిన తెలంగాణకు చెందిన బి. రామకృష్ణారెడ్డి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్. తన దశాబ్దాల పట్టుదలతో, అతను కువి, మందా, కుయ్ వంటి గిరిజన, దక్షిణాది భాషల పరిరక్షణకు అపారమైన కృషి చేశారు. గిరిజన భాషలను ఇతర భాషలతో కలుపుతూ సాంస్కృతిక వారధిని నిర్మించడం చేశారు. మాండా-ఇంగ్లీష్ డిక్షనరీ, కువి- ఒరియా-ఇంగ్లీష్ డిక్షనరీని రూపొందించారు. అదే సమయంలో ఈ ఉద్దేశంతో ఐదు పుస్తకాలను కూడా రచించారు.

ఈ నేపథ్యంలో సాహిత్యం, విద్య (భాషాశాస్త్రం) విభాగంలో ఆయనకు పద్మశ్రీ అవార్డు వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన సామాజిక సేవకుడు సంకురాత్రి చంద్రశేఖర్ (79) పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్య సేవలను అందించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ఎయిర్ ఇండియా కనిష్క బాంబు దాడిలో ఆయన భార్య ఇద్దరు పిల్లలను కోల్పోయిన తరువాత, అతని దు:ఖాన్ని సమాజాభివృద్ధికి జీవితకాల నిబద్ధతగా మార్చారు. మూడు లక్షల మందికి పైగా కంటి రోగుల చికిత్సలో సేవలు, 90 శాతం శస్త్రచికిత్సలు ఉచితంగా అందించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన 3,500 మంది కి పైగా పిల్లలకు ఉచిత విద్యను అందించారు.

బీసీ ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ముహూర్తం ఖరారు

మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ముహూర్తాలు ఖరారు చేసినట్టు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఫిబ్రవరి 5న కొకాపేట్‌లో, 6న ఉప్పల్ భగా యత్‌లో సామూహిక భూమి పూజలు నిర్వహించనున్నట్టు వివ రించారు. 16 భవన నిర్మాణాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో, 18 బీసీ ఏక సంఘాల సారథ్యంలో నిర్మాణాలు చేపడుతున్నామని బుధవారం 32 బీసీ కుల సంఘాల నేతలతో జరిగిన సమీక్షా సమావేశంలో తెలిపారు. 41 బీసీ ఆత్మగౌరవ భవనాల కోసం ప్రభుత్వం 87.3 ఎకరాల భూమిని కేటాయించింద న్నారు. మార్చి 31వ తేదీ లోగా ఆయా భవనాల శ్లాబుల నిర్మాణం పూర్తి కావాలనీ, లేని పక్షంలో ప్రభుత్వమే వాటిని తీసు కొని నిర్మిస్తుందని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కోసం అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సంఘా లు నిర్మించుకునే ఆత్మగౌరవ భవనాలకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించి సహకారాన్ని అందిస్తా మన్నారు. సమావేశ మందిరాలు, కళ్యాణ వేదికలు, హాస్టళ్లు, రిక్రియేషన్ తదితర సకల సదుపా యాలతో నిర్మాణాలు చేపడుతు న్నామనీ, దసరా లోపు ఆత్మగౌరవ భవనాలు ప్రారంభమవ్వాలని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ బండాప్రకాశ్, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎస్ తిరుపతిరావు, మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు

గ్రూప్-1 మెయిన్స్‌కు సెలెక్ట్ అయిన 123 మంది ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్‌భవన్‌లో గ్రూప్-1 మెయిన్స్‌కు సెలెక్ట్ అయిన 123 మంది ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ విద్యార్థులను రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజేంద్రనగర్ స్టడీ సర్కిల్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ఎస్టీ స్టడీ సెంటర్లలో కోంచింగ్ తీసుకుని మెయిన్స్‌కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు మాత్రమే ట్యాబ్‌లు, ప్రతినెల రూ.5 వేలు స్టైఫండ్‌ను ప్రభుత్వం అందచేస్తుందని తెలిపారు. ప్రయివేటుకు ధీటుగా విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ నుంచి అన్ని రకాల సౌకర్యాలను అందజేస్తామనీ, వారు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీసీసీ జీఎమ్ సీతారాంనాయక్, జేడీ సబుజ్వల, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీప్రసాద్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు మార్చుకో.. లేకుంటే గద్దె దించుతాం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

- చాప కింద నీరులా రైతు వ్యతిరేక విధానాలు
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- మోడీ పాలనలో అన్నదాతల ఆకలి చావులు
- ప్రముఖ సినీ డాన్సర్ రాకేష్ మాస్టర్
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్ల ర్యాలీ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు మార్చుకోకుంటే మోడీని గద్దె దించుతామని తెలంగాణ రైతు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.సాగర్, పశ్య పద్మ హెచ్చరించారు. మోడీ పాలనలో అన్నదాతలకు ఆకలి చావులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి బొంగ్లూర్ మీదుగా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సాగర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పంట ఉత్పత్తికి 50 శాతం అదనపు మద్దతు ధర అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా రుణ విముక్తి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్తు సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదానికి పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. 500 రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగా విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకున్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా అమలు చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. గృహ వినియోగదారులకు సైతం నెలకు రూ.800 మినిమం బిల్లు చెల్లించే పరిస్థితి తీసుకురానున్నదన్నారు. కౌలు రైతులకు, రైతాంగానికి నెలకు రూ.5000 పింఛన్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడా పారిశ్రామిక నేతలకు చెందిన రూ.11 లక్షల కోట్ల రుణాలు మోడీ ప్రభుత్వం ఎలా మాఫీ చేసిందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతు న్నాయన్నారు. మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పశ్య పద్మ మాట్లాడుతూ.. 500 సంఘాలతో సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడిందని తెలిపారు. తమ పోరాటాలతోనే మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. కానీ గడిచిన 11 నెలలుగా మోడీ ఇచ్చిన హామీని సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ డాన్సర్ రాకేష్ మాస్టర్ మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగం అన్నమో రామచంద్ర అని చస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

కార్మికులు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతుల ఆత్మఘోష మోడీకి వినిపించే విధంగా బలమైన ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు జంగయ్య, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ, అగ్నిప్రమాదాల నివారణకే ప్రాధాన్యత



- వచ్చే హరితహారంలో స్థానిక జాతుల మొక్కలు నాటుతాం
- అర్బన్ పార్కుల నిర్వహణ, ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి : పీసీసీఎఫ్ ఆర్ఎం. డోబ్రియాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణ, వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. వేగంగా పెరిగే స్థానిక జాతుల మొక్కలను రాబోయే హరితహారంలో నాటేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ పార్కుల నిర్వహణ, ఎకో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నొక్కిచెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా, డివిజనల్ ఫారెస్టు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వేసవిలో అగ్ని ప్రమాదాల రూపంలో అడవులకు ముప్పు పొంచి ఉంటుందనీ, వాటి నివారణ కోసం బీట్ల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రమాదాలపై అటవీ సమీప గ్రామాల ప్రజల్లో, అడవుల గుండా వెళ్లే ప్రయాణికుల్లో అవగాహన పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా వీలైనంత వరకు నివారించాలన్నారు. వేసవిలో వన్యప్రాణుల తాగునీటి కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న వర్షాకాలంతో ప్రారంభించే హరితహారం సీజన్‌కు నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. అర్బన్‌పార్కుల్లో ఔషధ మొక్కలు, హెర్బల్ గార్డెన్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇండ్లలో పెంచుకునేందుకు వీలుగా పంపిణీకి కూడా మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. హరితవనాల్లో వందశాతం పచ్చదనం పెంపుపై సమీక్షించారు. అడవుల్లో నీటి నిల్వల సామర్థ్యం, నేలల్లో తేమ పరిరక్షణ చర్యలు తీసుకోవటం వల్ల వాటి సహజ పునరుద్ధరణ వేగాన్ని పెంచొచ్చని సూచించారు. సమావేశంలో కంపా నిధులు, పనులు, పురోగతి, అటవీ అనుమతుల ప్రక్రియ వేగవంతం, గిరిజన గూడేలలో మౌలిక సదుపాయాల కల్పన, అటవీ నేరాల కేసుల సత్వర పరిష్కారం, తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో పీసీసీఎఫ్ (కంపా) లోకేశ్ జైస్వాల్, పీసీసీఎఫ్ (ఎఫ్‌సీఏ) ఎం.సీ.పర్గెయిన్, పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ నియామకాల్లో తప్పిదాలకు యువత బలి

- గవర్నర్ కు యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీస్ నియామకాల్లో ప్రభుత్వం చేసిన తప్పిదాలకు యువత బలయ్యారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఆయన నేతృత్వంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విషయాన్ని అనేక సార్లు పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మెన్ వి.వి.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామనీ, ఏడు మార్కులు కలపాలంటూ హైకోర్టు సూచించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికే 18 మంది విద్యార్థులు చనిపోయారనీ, రన్నింగ్‌లో క్వాలిఫై అయిన వారికి మెయిన్స్ లో అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

నవతెలంగాణ రంగారెడ్డి రీజీయన్ మేనేజర్..

మహేందర్‌రెడ్డికి పితృ వియోగం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

నవతెలంగాణ రంగారెడ్డి రీజీయన్ మేనేజర్ మహేందర్‌రెడ్డి తండ్రి దూదిపాల ఇంద్రారెడ్డి(85) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉంటున్న ఇంద్రారెడ్డి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. అతనికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నవతెలంగాణ రంగారెడ్డి రీజీయన్ మేనేజర్ మహేందర్‌రెడ్డి అందరి కంటే చిన్నవాడు. ఇంద్రారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతన్ని నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి చనిపోయారు. ఆయన మృతి పట్ల నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, సీజీఎం ప్రభాకర్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే నవతెలంగాణ జనరల్ మేనేజర్స్, మేనేజర్స్, బోర్డు మెంబర్లు, సిబ్బంది ఇంద్రారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌బిఐ ఉద్యోగుల రూ.33.78 లక్షల విరాళం



హైదరాబాద్ : ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు రూ.33,78,200 నిధులను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తం విలువ చేసే చెక్కును బుధవారం ఆ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ అమిత్ జింగ్రాన్ బృందం గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు అందజేశారు. బ్యాంక్ సిబ్బంది చొరవను గవర్నర్ ప్రశంసించారు. ఈ సంస్థకు ఇచ్చిన నిధులను సైన్యంలో పని చేసిన మాజీ సైనికులు, భర్తలను కోల్పోయిన వారి సంక్షేమానికి ఉపయోగిస్తారు.

షెడ్యూల్ పరిశ్రమల కనీసవేతన జీవోలు సవరించాలి

- విడుదల చేసిన ఐదు జీవోలను గెజిట్ చేయాలి : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీవోలను సవరించాలనీ, గతేడాది విడుదల చేసిన ఐదు రంగాల కనీస వేతనాల జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పారిశ్రామిక కార్మికుల రాష్ట్రస్థాయి వర్క్‌షాపును సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ..1948 కనీస వేతనాల చట్టం ప్రకారం ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాలన్నారు. కానీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదున్నరేండ్ల కాలంలో ఒక్కసారి కూడా పెంచలేదని విమర్శించారు.

దీంతో కార్మికులు వేల కోట్ల రూపాయలను వేతనాల రూపంలో నష్టపోతున్న తీరును వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు సవరించాలనీ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక కార్మికుల సమస్యలపై అధ్యయనం కోసం ఫిబ్రవరి నెలంతా కార్మికులు సర్వేలు చేయాలనీ, వాటి పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రాలు కూడా అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో క్లస్టర్ కమిటీ కన్వీనర్ భూపాల్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, పి.జయలక్ష్మి, టి.వీరారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, బి. మధు, పి. శ్రీకాంత్, కె. రమేష్, బి. మల్లేశం, కె. గోపాలస్వామి, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర నాయకులు చంద్రమోహన్, విష్ణు, జగదీష్, సాయిలు, ఆంజనేయులు, శ్రీను, నరసింహ, బ్రహ్మచారి, మీనా, కవిత, రాజు, అజయ్‌బాబు పాల్గొన్నారు.

సంపాదకీయం


దేవుడి పగేనా?!

దేవుడు పగపడతాడా? అసలు తన 'సృష్టి'పై తానే పగపట్టగలడా? మరి జోషీమఠ్ కుంగిపోవడం భగవత్ సంకల్పమేనని చెప్పిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని ఏ కోవలో జమెయ్యాలి? సృష్టి, స్థితి, లయ కారకులని త్రిమూర్తులకు "వర్క్ డివిజన్" ఉంది. స్థితి, లయ కారకులైన విష్ణువుకు, శివుడికి అత్యంత ప్రఖ్యాత ఆలయాలున్న బదిరీనాథ్, కేదార్‌నాథ్

> ప్రకృతి విధ్వంసాన్ని పెట్టుబడి లాభాల కోసం అనుమతించే పాలకులున్నంత కాలం దేవాలయాలు మూసెయ్యాల్సిందే! (2013లో కేదర్‌నాథ్ లాగా) భక్తుల ప్రాణాలకూ రక్షణ ఉండదు. చార్‌ధామ్ పేరుమీద మోడీ సర్కార్‌కు ఓట్లు రావచ్చేమోగాని, పర్యావరణం సర్వనాశనం అవుతుంది. గ్లాస్‌గో (కాప్-26)లో ప్రగల్భాలు మర్చిపోవద్దు మోడీ ప్రభుత్వమా!

ఆలయాలను, వాటిని దర్శించేందుకు వచ్చే భక్తకోటినీ ఆ దేవుళ్ళిద్దరూ కల్సి 'లయి'స్తారా? మానవ తప్పిదాలను, 'పాపాల'ను పాపం! ఆనోరులేని దేవుళ్ళపై నెట్టేయడం అన్యాయం కదా!

ఆంగ్లంలో "హిమాలయన్ బ్లండర్" అనే నానుడి ఉంది. ప్రస్తుతం హిమాలయ పర్వతాల్లో హిమాలయన్ బ్లండర్ జరుగుతోంది. ఇది ఉత్తరాఖండ్‌లోనే కాదు, అటు హిమాచల్ నుండి సిక్కిం వరకు జరుగుతోంది. ప్రస్తుతం ఆర్టికల్ 370 రద్దు పుణ్యమా అని రేపు కాశ్మీర్‌లోనూ జరుగుతుంది. ఎన్ఆర్ఎస్ఎతో సహా 12 శాస్త్రవేత్తల సంఘాలు జోషీమఠ్ ఉన్న ప్రాంతం 99శాతం భూపాతం (ల్యాండ్ స్లైడ్) ఉండే ప్రాంతమేనని ఏనాడో చెప్పాయి. కాని ఇటీవల ఢిల్లీలో జరిగిన శాస్త్రవేత్తల మీటింగులో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి జోషీమఠ్ వ్యవహారమంతా "భగవంతుడి లీలే"నని బల్లగుద్ది మరీ వాదించిన సంఘటన మనల్ని అవాక్కయ్యేలా చేస్తుంది. జోషీమఠ్ అంటే మన శంకరమఠం లాంటి భవనం కాదు. 27వేల మంది ప్రజలు నివశించే ఒక పట్టణం. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే బదిరీనాథ్, హేమకుండ్ సాహిబ్ వంటి పుణ్యక్షేత్రాలకు ముఖద్వారం. ప్రపంచ ప్రఖ్యాత మంచు ఆటల కేంద్రం అవులి ఉన్నదక్కడే. ప్రపంచంలోనే అత్యంత పొడవైన 'రోప్‌వే' ఈ పట్టణంపై నుండే పోతుంది. "ఇది ఒక పట్టణమే కాదు సాంస్కృతిక వారసత్వం" అని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఐ(ఎం), సిఐటియు బృందం చెప్పింది



అక్షర సత్యం. మానవ తప్పిదం వల్లా, ఆశ్రిత పెట్టుబడిదార్ల లాభాపేక్ష వల్లా నేడీ పట్టణం కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే సగం పట్టణం నివాసయోగ్యం కాకుండా పోయింది. సునీతా నారాయణ్ రాసినట్లు "అదొక మానవ విషాదం.మనిషి స్వయం కృతం."

1976లోనే ఘర్వాల్ కమిషనర్ ఎమ్.సి.మిశ్రా కమిషన్ "ఇదొక మునిగిపోయే పట్టణమని, ఇక్కడ ఏ నిర్మాణాలు చేపట్టవద్దని" నివేదిక ఇచ్చింది. ఏ ప్రభుత్వమూ దాన్ని ఖాతరు చేయలేదు. ప్రత్యేకంగా 2014 తర్వాత భారీ హెూటళ్ల నిర్మాణం సాగిపోతోంది. స్థానికులు అడ్డుపడుతున్నా తపోవన్ - విష్ణుగాడ్ 520 మె.వా. హైడల్ స్టేషన్ నిర్మాణం సాగుతోంది. ఎన్‌టిపిసి వారి ఈ ప్రాజెక్టు జోషీమఠ్ క్రిందికే తవ్వేశారు. నాలుగు పుణ్యక్షేత్రాలను కలిపే 'చార్‌ధామ్' ప్రాజెక్టును 'ఉభయ తారకం'గా ఉండేలా 2016లో మోడీ సర్కార్ ప్రారంభించింది. రూ.12వేల కోట్ల ఈ ప్రాజెక్టుని చిన్న చిన్న ముక్కలుగా చేసి పర్యావరణ అనుమతులు గోల తప్పించేసింది. ఎక్కడికక్కడ 'అస్మదీయుల' హెూటళ్ళు వెలుస్తున్నాయి. నాలుగు లైన్ల రోడ్ నిరాఘాటంగా నిర్మాణం సాగిపోతోంది. అదీ జోషీమఠ్ అంచునే పెద్ద పెద్ద బ్లాస్టింగులు జరగడంతో ఆ పట్టణానికి ప్రమాదం ముంచుకొచ్చింది.

బహుశా ఉత్తరాఖండ్ పెట్టుబడి లాభాపేక్షకి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి బ్రహ్మాండమైన ఉదాహరణ. వంద డ్యామ్‌లు, 450 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ప్లాన్ చేసినట్టు ఒక నివేదిక తెల్పుతోంది. ఈ నిర్మాణంలో వచ్చేరాళ్ళు, రప్పల్ని, అన్ని రూల్స్‌కి భిన్నంగా నదుల్లోనే వేయడంతో, దాన్ని పాలకులు పట్టించుకోకపోవడంతో ఉపద్రవాలు ముంచుకొస్తున్నాయి. భూపాతం వల్ల 1894లో భీకర వరదలు రాగా, ఇష్టాను సారం అడవుల నరికివేత వల్ల 1970లో వరదలొచ్చాయి. 2013లో కేదర్‌నాథ్ పెను ముప్పు, 2021లో తపోవన్ - రైనీ ప్రమాదంలో 200 మంది కార్మికులు జలసమాధి అయినా బుద్ధిరాని పాలకులు పెట్టుబడి లాభాపేక్ష కోసం ఈ ప్రాజెక్టులకు తెరతీశారు. పెద్ద ఎత్తున జల విద్యుదుత్పత్తి జరిగే ఉత్తరాఖాండ్ వాసులు సైతం మనలాగే అధిక విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి రావడం విరోధా భాసకు పరాకాష్ట!

ఇంత జరుగుతున్నా మీడియా ముందు నోరిప్పరాదని మొన్ననే శాస్త్రవేత్తలను, ఇస్రో వంటి సంస్థలను శాసించింది మోడీ సర్కార్. 2020, 21లో కరోనా కాలంలోనూ ఈ విధంగా శాస్త్రవేత్తల నోరు నొక్కేసరికి పుక్కిటి పురాణాలు యథేచ్ఛగా ప్రచారమైనాయి. స్థానికులు పోరాడుతూనే ఉన్నారు. అవి దేశానికి తెలియ చేయాల్సిన మీడియా కార్పొరేట్ల చేతిలో, పైగా అంబానీ, అదానీ చేతిలో బందీగా ఉంది.

సుప్రీం కోర్టు దీన్ని పరిగణనలోకి తీసుకుని ఒక కమిటీని నియమించింది. ఈ ప్రాజెక్టులు, నిర్మాణాలు తక్షణం ఆపాలంది. ఆ తర్వాత మరో కమిటీని నియమించింది. అది మొదటి కమిటీనే బలపరిచింది. ఆ తర్వాత మరో కమిటీ వేశారు. సదరు కమిటీ పైనివేదికల్ని తిరగేసింది. ప్రకృతి విధ్వంసాన్ని పెట్టుబడి లాభాల కోసం అనుమతించే పాలకులున్నంత కాలం దేవాలయాలు మూసెయ్యాల్సిందే! (2013లో కేదర్‌నాథ్ లాగా) భక్తుల ప్రాణాలకూ రక్షణ ఉండదు. చార్‌ధామ్ పేరుమీద మోడీ సర్కార్‌కు ఓట్లు రావచ్చేమోగాని, పర్యావరణం సర్వనాశనం అవుతుంది. గ్లాస్‌గో (కాప్-26)లో ప్రగల్భాలు మర్చిపోవద్దు మోడీ ప్రభుత్వమా!

రవాణా కార్మికుల సంఘర్ష యాత్ర - అనుభవాలు

రాష్ట్రంలో రవాణా కార్మికుల సంఘర్ష యాత్రకు అనూహ్యమైన స్పందన వచ్చింది. విలువైన అనుభవాలు ఇచ్చింది. సమస్యలతో సతమతమవుతున్న రవాణా కార్మికులలో విశ్వాసం నింపింది. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్న స్ఫూర్తి నింపింది. కార్మికుల సమస్యలు తెలుసుకోవటం, వారిని సంఘటితం చేయటం, పోరాట చైతన్యం నింపటం ఈ యాత్ర లక్ష్యం.




ఎస్. వీరయ్య

'ఇల్లు చూసి నన్ను చూడు' అన్నట్టున్నది రవాణా కార్మికుల బతుకు చిత్రం. యాత్ర బృందం రవాణా కార్మికులిండ్లలోనే బస చేసింది. వారి ఇండ్లలోనే భోజనాలు చేసింది. దీనివల్ల వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడే అవకాశం దొరికింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, సమస్యలు సన్నిహితంగా పరిశీలించేందుకు ఉపయోగపడింది. కుటుంబాలతో మమేకం కావడంతో కుటుంబ సభ్యులు ఎంతో ఆప్యాయత ప్రదర్శించారు. నాయకులు తమ ఇంటికి రావటం, వారు పెట్టింది తినటం, అగ్గిపెట్టెల్లాంటి తమ ఇండ్లలో, మురికి కూపాల పరిసరాలలో, వారితో పాటు బస చేయటం వారికి ఆశ్చర్యం కలిగించింది. అందుకే హృదయపూర్వకంగా ఆదరించారు. ఇరుకు గదులు... ఒకరు పడుకుంటే మరొకరు నిలబడేందుకు కూడా చోటులేని ఇండ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి ఇండ్లలో కుటుంబాలు బతుకుతున్నాయంటేనే వారి ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఇండ్లలో నాయకులు కూడా వారితో పాటు నేలపైన చాప పరుచుకుని నిద్రించటం వారిలో విశ్వాసం పెంచింది. ఈ కుటుంబాలలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వారు, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ ఉన్నారు.

హైదరాబాద్ నడిబొడ్డున, చెత్త సేకరించే వాహనాల డ్రైవర్ ఇంట్లో భోజనం చేసాం. రెండు ఇండ్ల మధ్య ఇద్దరు మనుషులు ఎదురైతే నడవటం కష్టం. ఒక ఆటో డ్రైవర్ ఇంట్లో బస చేయడానికి పోయాం. బృందం పడుకుంటే ఆ

> ఈ కార్మికులంతా అనేక కులాలూ, ప్రాంతాలూ, హిందూ, ముస్లిం, క్రైస్తవ కుటుంబాలలో జన్మించినా, వారంతా రవాణా కార్మికులన్న వాస్తవాన్నే గుర్తిస్తున్నారు. అందరూ కలిసే తమ యూనియన్లకు ఐక్యంగా నాయకత్వం వహిస్తున్నారు. కార్మికులంతా సమైక్యంగా నడుస్తున్నారు. ఈ ఐక్యతను దెబ్బకొట్టటం కోసమే మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నది. భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. ఈ కుతంత్రాలను అధిగమించి, ఐక్యంగా పోరాడినప్పుడే రవాణా కార్మికులకు, ఆర్టీసీలకూ ఉరితాడుగా మారిన మోటారు వాహన సవరణ చట్టాన్ని వెనక్కి కొట్టగలం. మోడీ ప్రభుత్వం మెడలు వంచి హక్కులు కాపాడుకోగలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పోరాడి సంక్షేమ బోర్డులు సాధించుకోగలం.

కుటుంబ సభ్యులకు స్థలం లేదని అర్థమైంది. ఒక్కరం అక్కడ ఉండి, మిగిలిన నాయకులు మరో ఇంటికి వెళ్ళారు. కారు డ్రైవర్ ఇంట్లో భోజనానికి పోయాం. చెత్త కుప్పలో విసిరేసినట్టున్న ఆ ఇంటికి నాయకులు రావటం, భోజనం చేయటం వారు ఊహించలేదు. మిధాని డిపో పక్కన, ఫుట్‌పాత్ మీద గూడు కట్టుకున్న గిరిజన ఆటో డ్రైవర్ ఇంట్లో టిఫిన్ చేయటం ఆ ఇంటి ఇల్లాలుకు ఎంతో సంతోషం కలిగించింది. చెత్త డంపింగ్ యార్డ్ కార్మికుడి ఇంట్లో భోజనం చేసి, మరో కార్మికుడి రాజీవ్ గృహకల్ప ఇంట్లో బసచేసాం. వీరూ గిరిజనులే. ఒక ఆటో డ్రైవర్ ఇంట్లో గదికీ, వంటగదికీ మధ్య తలుపులు లేవు. ఫ్రిజ్ తలుపు సరిగా పడలేదని సర్దబోయాను. తలుపు ఊడిపడింది. అది పనిచేయదండీ అని అప్పుడు చెప్పాడు ఆ డ్రైవర్. ఇద్దరు డ్రైవర్ల ఇండ్లలో నిద్రించే సమయానికి కుటుంబ సభ్యులు లేరు. స్థలం లేక, పక్కింటిలో సర్దుకున్నారు. కిరాణా దుకాణంతో నష్టపోయి కారు డ్రైవరుగా మారిన చిరు వ్యాపారి, శవాల ఫ్రీజర్ కూడా నిర్వహించటం గమనార్హం. ఒక పూట వారి ఆతిథ్యం స్వీకరించాం. మరో గూడ్స్ ఆటో డ్రైవర్ మా బసకు ఏర్పాటు చేసిన గదిలో మంచి పరుపూ,



మంచం, సోఫా, నిలువుటద్దం ఉన్నాయి. తీరా వారు నివసించే ఇల్లో చూస్తే గాలీ, వెలుతురు ప్రసరించని రేకుల కొట్టం. తమ బతుకు చిత్రం కనిపించకుండా, అతిథులకు మర్యాద చేసి పంపే ప్రయత్నమని అర్థమైంది.

యాత్రకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్. వీరయ్య, పి. శ్రీకాంత్ సారథ్యం వహించారు. కూరపాటి రమేశ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలని, 'మోటారు వాహనాల సవరణ చట్టం-2019'ని సవరించాలని కోరుతూ ఈ యాత్ర సాగింది. ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన యాత్ర 11న సాయంత్రం సంగారెడ్డిలో ముగిసింది. సంఘర్ష్ యాత్ర 24 జిల్లాలలో, 49 కేంద్రాలలో కార్మికులను కలిసింది. 2780 కి.మీ. యాత్ర సాగింది. అన్ని కేంద్రాలలో కార్మికులు యాత్ర బృందానికి ఘనమైన స్వాగతం పలికారు. హైదరాబాద్, వరంగల్ మహానగరాలలోనూ, సంగారెడ్డి, హనుమకొండ, మహబూబాబాద్, మిర్యాలగూడ వంటి పట్టణాలలోనూ వందలాదిగా కదిలిన కార్మికుల స్పందన ప్రత్యేకంగా చెప్పుకోదగింది. నిజామాబాద్, సంగారెడ్డి, మిర్యాలగూడ పట్టణాలలో ప్రత్యేకంగా రవాణా కార్మికులు విరాళాలు ఇచ్చి ఉద్యమనిధిగా యాత్ర బృందానికి అందజేసారు. దీనికి తోడు యాత్ర ఆరంభం నుంచి చివరిదాకా కార్మికులు తమకు తోచిన మేరకు విరాళాలు యాత్ర హుండీలో వేసి సహకరించారు.

కార్మికులు అడ్డాల సమస్యతో సతమతమవుతున్నారు. వీరిని పోలీసులు ఊరవతలకి, బస్‌స్టాండులూ, మార్కెట్లకూ దూరంగా తరుముతున్నారు. ఆర్టీసీ బస్సు దిగిన ప్రయాణీకులు, మార్కెట్లో సరుకులు కొనుగోలు చేసిన జనం, సినిమాహాల్స్ నుంచి బయటకు వచ్చినవారు, దేవస్థానాలు సందర్శించిన భక్తులు బయటకురాగానే ఆటోలు, కార్లూ, మాక్సీ క్యాబ్‌లూ అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అందుకే ఇలాంటి చోట్ల అడ్డాలుంటే ప్రయాణీకులకు సౌకర్యంగా ఉంటుంది. డ్రైవర్లకు ఆదాయం కూడా ఉంటుంది. అధికారులకూ, పోలీసులకూ మాత్రం ఈ సోయిలేదు. పోలీసుల వేధింపులకు అవధులు లేవు. యాదగిరిగుట్టమీదకు బస్సులు, కార్లు అనుమతించారు. ఆటోలను మాత్రం అనుమతించటం లేదు. భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించటం హర్షించదగిందే. అదే సమయంలో ఖర్చు భరించగలిగే వారికి, తమ ఇంటికి దగ్గర నుంచే కారులో కుటుంబ సమేతంగా బయలుదేరి గుట్టమీదకు వెళ్ళేందుకు అనుమతించారు. కానీ ఆ స్థోమత లేనివారు, ఆటోలలో వెళ్ళడానికి మాత్రం అనుమతించటం లేదు. ఇది పేదల పట్ల, ఆటో డ్రైవర్ల పట్ల వివక్ష. ప్రమాదాలు జరిగినప్పుడు మరణించిన, అంగవికలురైన కార్మికుల కుటుంబాలను, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆన్‌లైన్ కంపెనీల దోపిడీ కూడా చెప్పారు. ఒకే ఆన్‌లైన్ పోర్టల్‌తో పనిచేస్తున్న కార్మికులను గ్రూపులుగా విడగొట్టి అనైక్యత సృష్టిస్తున్నారు. లారీ కార్మికులను పెద్ద పెద్ద కంపెనీలు బెంగుళూరు, ముంబై, చెన్నై లాంటి సుదూర ప్రాంతాలలో పనిలేదని వదిలేస్తున్నారని గోడు వినిపించారు. స్వరాష్ట్రానికి రావడానికి ఖర్చులు కూడా ఇవ్వరు. స్థానిక కార్మికులను తొలగించి వలస కార్మికులను నియమిస్తున్నారు. వలస కార్మికులు ప్రశ్నిస్తే స్థానికులను నియమిస్తున్నారు. చెత్త రవాణా చేసే వాహనాల రిపేర్లు, డీజిల్ ఖర్చులు కూడా డ్రైవర్లే భరించవల్సి వస్తున్నదని చెప్పారు. ఫైనాన్స్ సంస్థల వేధింపులకు హద్దులు లేవు. హైర్ బస్సు కార్మికులకు పనిగంటలు లేవు. ఆర్టీసీలో యూనియన్లమీద, కార్మికుల మీద అమలు చేస్తున్న ఆంక్షల పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. రెండు విడతలు వేతన సవరణ జరుగక పోవటం, డీఏ బకాయిలు పెండింగ్ పెట్టడం లాంటి సమస్యల గురించి ఆవేదన వ్యక్తం చేసారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి సులభతరమైన పనులు ఇవ్వనందువల్ల పెట్రోల్ పంపులో పనిచేస్తున్న ఘటనలు కూడా మా దృష్టికి వచ్చాయి.

> రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలని, 'మోటారు వాహనాల సవరణ చట్టం-2019'ని సవరించాలని కోరుతూ ఈ యాత్ర సాగింది. సంఘర్ష్ యాత్ర 24 జిల్లాలలో, 49 కేంద్రాలలో కార్మికులను కలిసింది. 2780 కి.మీ. యాత్ర సాగింది. అన్ని కేంద్రాలలో కార్మికులు యాత్ర బృందానికి ఘనమైన స్వాగతం పలికారు.వందలాదిగా కదిలిన కార్మికుల స్పందన ప్రత్యేకంగా చెప్పుకోదగింది. రవాణా కార్మికులు విరాళాలు ఇచ్చి ఉద్యమనిధిగా యాత్ర బృందానికి అందజేసారు.

యాత్ర బృందానికి అడ్డాలమీద, ఆర్టీసీ డిపోలలో వివిధ యూనియన్ల నుంచి సంఘీభావం తెలిపారు. వీరిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, అనేక ఇండిపెండెంట్ యూనియన్ల నాయకులున్నారు. ఆర్టీసీ డిపోలలో ఎస్‌ఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్ల నాయకులు, కార్యకర్తలు కూడా సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్మికులంతా అనేక కులాలూ, ప్రాంతాలూ, హిందూ, ముస్లిం, క్రైస్తవ కుటుంబాలలో జన్మించినా, వారంతా రవాణా కార్మికులన్న వాస్తవాన్నే గుర్తిస్తున్నారు. మాకు స్వాగతం పలికిన ఒక యూనియన్ పేరు జై హనుమాన్ ఆటో వర్కర్స్ యూనియన్. దాని అధ్యక్షుడు మన్సూర్ పాషా. తనకు పరిచయస్తులైన హిందూ కుటుంబాలు వచ్చినప్పుడు, గుడిలో తనకున్న పలుకుబడితో గర్భగుడిదాకా తీసుకుపోయి దర్శనం కల్పిస్తాడు. మరో యూనియన్ పేరు జై శ్రీరామ్ ఆటో వర్కర్స్ యూనియన్. దాని ఉపాధ్యక్షుడు రహీంతో సహా మా బృందానికి సాదరంగా స్వాగతం పలికారు. ఆది జాంబవ యూనియన్, శ్రీలక్ష్మీ నరసింహ యూనియన్... ఇట్లా పేరు ఏదైతేనేమి? హిందూ, ముస్లిం, క్రైస్తవులన్న తేడా లేదు. దళితులూ, గిరిజనులూ, బడుగు బలహీన వర్గాలూ, అగ్రవర్ణాలన్న దృష్టిలేదు. అందరూ కలిసే తమ యూనియన్లకు ఐక్యంగా నాయకత్వం వహిస్తున్నారు. కార్మికులంతా సమైక్యంగా నడుస్తున్నారు. అతిథ్యం ఇచ్చిన షౌకత్‌అలీ, పాషాల కుటుంబాలైనా, యేసు భక్తుడు బాబు కుటుంబమైనా, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల కుటుంబాలైనా, అగ్రవర్ణ కుటుంబాలకు చెందిన కార్మికులైనా ఈ యాత్ర బృందాన్ని తమ ఆప్తులుగానే ఆదరించారు. కులాలూ, మతాలూ వారికి అడ్డురాలేదు. సహజమైన లింగభేదం కూడా వారికి అడ్డుగోడ కాలేదు. కార్మికులన్న ఒకే ఒక్క లక్షణం వారందరినీ ఒకే విధంగా స్పందించేటట్టు చేసింది. అదే వారి ఐక్యతకు మూలం. ఈ ఐక్యతను దెబ్బకొట్టటం కోసమే మోడీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నది. భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. ఈ కుతంత్రాలను అధిగమించి, ఐక్యంగా పోరాడినప్పుడే రవాణా కార్మికులకు, ఆర్టీసీలకూ ఉరితాడుగా మారిన మోటారు వాహన సవరణ చట్టాన్ని వెనక్కి కొట్టగలం. మోడీ ప్రభుత్వం మెడలు వంచి హక్కులు కాపాడుకోగలం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద పోరాడి సంక్షేమ బోర్డులు సాధించుకోగలం.



కేజీబీవీలలో బోధనేతర సిబ్బంది బాధలు తీరేదెపుడు?

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవి) పథకాన్ని భారత ప్రభుత్వం 2004 ఆగస్టులో ప్రారంభించింది. ఈ పథకం కింద దేశంలోని విద్యాపరంగా వెనుకబడిన బ్లాకులు, పట్టణాలు, మైనారిటీ కేంద్రీకృత ప్రాంతాలలో ఉన్నత ప్రాథమిక స్థాయిలో బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. దాదాపు మండలానికి ఒక కేజీబీవి ఏర్పాటు చేయబడింది. ఈ పథకం షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర వెనుకబడిన తరగతుల, మైనారిటీ వర్గాల, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల ఆడపిల్లలకు ఆరవ తరగతి నుండి ఇంటర్ మీడియట్ వరకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసారు.

గొప్ప లక్ష్యంతో ఏర్పడ్డ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో బోధనేతర సిబ్బంది తీవ్రమైన శ్రమదోపిడీకి గురైతున్నారు. అతి తక్కువ వేతనాలకు అత్యధిక గంటలు పని చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది ఏఎన్ఎం, అకౌంటెంట్, అటెండెంట్, స్వీపర్, డే/నైట్ వాచ్ ఉమన్, కుక్స్, కంప్యూటర్ ఆపరేటర్‌లుగా ఏడు రకాల పనులు చేస్తున్నారు. వీరంతా దళిత, గిరిజన, బాగా వెనుకబడిన కులాలకు చెందిన పేద మహిళలే. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడంలో వీరి తోడ్పాటు కీలకమైనది.



కాసు మాధవి

వీరు మాత్రం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక, కనీస వేతనాలు పొందక పేదరికంలో మగ్గుతూ మరొకవైపు రోజుకు పన్నెండు నుండి పద్నాలుగు గంటల అధికపని భారం మోస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థినులకు తగినట్లుగా సిబ్బందిని నియమించకపోవడం, తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులు చేయించడం, 10+2గా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో అదనపు సిబ్బందిని నియమించకపోవడం, పండుగలు, ఆదివారాలలో సెలవులు లేకపోవడం వలన అదనపు పని భారం పెరిగి ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కుక్స్ అధిక గంటలు పనిచేయడం వలన వంట చేస్తున్న క్రమంలో కండ్ల నుండి నీరుకారడం, లంగ్స్ ఇన్ఫెక్షన్‌కు గురవుతున్నారు. పెద్ద పెద్ద గిన్నెలలో వండిన వంటను కిచెన్ నుండి డైనింగ్ హాల్‌కు మోస్తున్న క్రమంలో కడుపు నొప్పి, డిస్క్ సమస్యలు, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావానికి గురవుతున్నారు. పని ఒత్తిడి, మనసిక ఆందోళన వలన అనారోగ్యం పాలవుతూ త్వరగా వృద్ధాప్యంలోకి నెట్టబడుతున్నారు.

దేశంలో ప్రజలకు విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. విద్య, వైద్యం, ఉపాధి పొందడం ప్రజల హక్కు. కాని మన దేశంలో ప్రభుత్వం హక్కుగా ప్రజలకు కల్పించాల్సిన సేవలను తాత్కాలిక చర్యలుగా ఆలోచిస్తూ, ఎప్పుడైనా మూసివేయగల అవకాశం ఉన్న పథకాలను ప్రారంభిస్తున్నది. మరోవైపు ఆ పథకాలకు కూడా తగిన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదు. విద్యకు దూరంగా ఉన్న బాలికల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య మొదలైనవి కేజీబీవి ద్వారా అందవలసి ఉంది. ఇది దేశంలో ఆడపిల్లలు, పేదరికం, వెనుకబాటుతనం ఉన్నంతకాలం కొనసాగవలసిన చర్య. ఇది శాశ్వతమైన పథకంగా ఉండాలి. ఇందులో పని చేస్తున్న వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి. కాని ప్రభుత్వం తాత్కాలికమైన పథకంగా కొనసాగిస్తూ, ఇందులో కాంట్రాక్టు కార్మికులను నియమిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నది. ఉదాహరణకు 2004లో కేజీబీవి ప్రారంభించగా గత పంథొమ్మిది సంవత్సరాలుగా పథకం కొనసాగుతుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా వేలాది మంది కార్మికులు జీవితకాలం పని చేస్తున్నారు. వీరికి ఎలాంటి రక్షణ, సౌకర్యాలు ఉండవు. క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు ఉండవు. గుర్తింపు కార్డులు, బస్ పాసులు ఉండవు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉండదు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ఉండదు. వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వకుండా, కార్మికులుగా గుర్తించకుండా ఫ్యాన్సీ పేర్లతో పిలుస్తూ ఒక రకంగా ప్రభుత్వం వీరిని మోసం చేస్తున్నది.


దేశంలో సంపద సృష్టిస్తున్నది శ్రమజీవులే. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం చెబుతున్నది. శాశ్వత ప్రాతిపదికన, కీలక(కోర్) పనులలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతి పెట్టొద్దని కోర్టులు అనేక తీర్పులిచ్చి ప్రభుత్వాలకు చీవాట్లు పెట్టినా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధిరావడం లేదు. పైగా కార్మికులు పోరాడి సాధించుకున్న కొద్ది పాటి హక్కులను కూడా కార్మిక హక్కుల సంస్కరణల పేరిట ఉన్న హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తున్నది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్ల ఓట్లతో చట్టసభలకు ఎన్నికైనవారు చట్టసభల్లో వీరి గురించి చర్చించరు. మోడీ బేటీ బచావో బేటీ పఢావో అని ఒకవైపు చెప్తూ మరోవైపు పథకాలకు నిధులలో కోత పెడతున్నారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అంటున్నారు. మరి సబ్ కా వికాస్ లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు లేరా. మన్ కీ బాత్‌లో కుక్కల గురించి మాట్లాడే ఔదార్యం ఉన్న ప్రధానికి అర్థాకలితో అలమటిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా?

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల రాజకీయంగా విమర్శ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్... తాను కార్మిక సంక్షేమం పట్ల శ్రద్ధ వహిస్తేనే తన ప్రత్యామ్నాయ మార్గంపై కార్మికులకు విశ్వాసం ఏర్పడుతుంది. అంగన్ వాడీ, ఆశావర్కర్లకు ఇస్తున్న గౌరవ వేతనం పెంచినట్లుగానే కేజీబీవి బోధనేతర సిబ్బంది వేతనాలు కూడా పెంచాలి. 2018లో తెలంగాణ రాష్ట్రంలో బాల కార్మికుల, డ్రాపౌట్ల, వీధి బాలుర కోసం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 29ఉన్నాయి. బోధనేతర సిబ్బందిగా సుమారు 200మంది పని చేస్తున్నారు. కేజీబీవి బోధనేతర సిబ్బందికి వర్తించే విధి విధానాలు, పని పద్ధతులు వీరికీ వర్తిస్తాయి. వీరు కూడా కేజీబీవి బోధనేతర సిబ్బందితో పాటుగా కనీస వేతనాలు, పని భద్రత, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి.

సెల్:9492585106

రాజ్యాంగ పతనంలో రాజకీయుల పాత్ర

రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ ముసాయిదా కమిటీ అధ్యక్షులు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణసభ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ప్రజలను హెచ్చరించారు. "పాలకులు చెడ్డవారైతే మంచి రాజ్యాంగమైనా చెడుగా మారుతుంది. మంచివారైతే రాజ్యాంగం చెడ్డదైనా మంచిగా మారుతుంది. రాజకీయ పక్షాల మీద రాజ్యాంగ వ్యవస్థల పనితీరు ఆధారపడుతుంది. దేశం మతాతీతంగా ఉండాలి. మతం రాజ్యాన్ని అతిక్రమిస్తే స్వాతంత్ర్యం దూరమవుతుంది" అని అంబేద్కర్ అంటే... "పాలకులు యోగ్యులు, సమగ్రతా నిబద్ధులు, గుణవంతులయితే లోప యుక్త రాజ్యాంగాన్ని ఉత్తమంగా మార్చగలరు" అన్నారు రాజేంద్ర ప్రసాద్. భవిష్య ప్రజాప్రతి నిధుల చిత్తశుద్ధి, పాలనా విధానాలపై వీరికి ఆరోజే అనుమానం కలిగింది.



ఎస్. హనుమంత రెడ్డి

"భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోడానికి, పౌరులందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యం చేకూర్చుటకు, వారి వ్యక్తిగౌరవం, జాతి ఐక్యత, అఖండతలను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్ఠా పూర్వకంగా తీర్మానించి 26 నవంబర్, 1949న రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాం." సుప్రీంకోర్టు ఈ పీఠికను రాజ్యాంగ మౌలిక సిద్ధాంతంగా ప్రకటించింది. చట్టాలు, రాజ్యాంగ సవరణలు పీఠికలోని అంశాలకు కట్టుబడి ఉండాలన్నది. రాజ్యాంగ ముసాయిదా, నిర్మాణ సభల్లో మితవాదులు ఆనాడే అంబేద్కర్‌కు అనేక అడ్డంకులు కల్పించారు. ఈనాడు ఏకంగా అధికారమే చేపట్టి రాజ్యాంగానికి హైందవ తత్వాన్ని పులుము తున్నారు.

గత ప్రభుత్వాల రాజ్యాంగ అపసవ్యంలో నేరస్తుల రాజకీయాకరణ, రాజకీయ నేరమయం పెరిగాయి. రాజ్యాంగ పీఠిక అశ్రద్ధ చేయబడింది. సామాజికదృక్పథం, త్యాగంతో నిండ వలసిన రాజకీయాలు లాభసాటి లూటీ వ్యాపారంగా మారాయి. రాజ్యాంగ విలువలు దిగజారాయి. ఇందిర 1975లో రాజ్యాంగ అధికరణ 352(1)తో ఎమర్జెన్సీ విధించారు. దీనితో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలహీన పడ్డాయి. నియంతృత్వ పోకడ మొదలైంది. కాని సంఘ్ అంటరానితనం పోయింది. తన భావజాలాన్ని ప్రచారంచేసింది. జనసంఘ్, సంఘ్ పరివార్ సంస్థలు బలపడ్డాయి. జనతా ప్రభుత్వంలో అధికారం దక్కింది. ఆ తర్వాత ఇందిరకు, సంఘ్‌కు క్విడ్ ప్రోకో కుదిరింది. అది ఇందిరకు సహకరించింది. ఆమె సంఘ్ గంగాజల్ యాత్ర ప్రారంభించారు. ప్రభుత్వ కమిటీల్లో, చర్చల్లో జనసంఘ్‌కు ప్రాతినిధ్యం కల్పించారు. రాజీవ్ హిందువులను దువ్వడానికి హిందుత్వ మెతక వైఖరి వహించారు. అయోధ్య ఆలయ తలుపులు తెరిపించారు. అయోధ్య నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించి మందిర్ నిర్మిస్తామన్నారు. షాబానో మనోవర్తి సుప్రీంకోర్టు తీర్పును తిరగతిప్పి ముస్లిం మగాళ్ల కోసం చట్టం చేశారు. ఆ తరువాతి ప్రధాని నరసింహారావు బాబ్రీ మసీదు కూల్చివేతకు మౌనంగా సహకరించారు. అయోధ్య మందిర్ నిర్మాణం, అలౌకిక పాలనకు పునాదివేశారు. వాజపేయి ప్రజల ఆస్తుల అమ్మకాలను చట్టబద్ధంచేశారు. ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ప్రయివేట్లకు అమ్మారు. విద్యాలయాల్లో అశాస్త్రీయాంశాలను ప్రవేశపెట్టారు. విద్యావ్యవస్థ కాషా యీకరణతో రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథానికి నీళ్ళొదిలారు. దేశాన్ని సాంస్కృతికంగా కలుషితం చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరమేధాన్ని సహించి, రాజకీయ మతోన్మాదాన్ని ప్రోత్సహించారు. మతపాలనకు నాందిపలికారు.

ఆర్.ఎస్.ఎస్. (సంఘ్) రాజ్యాంగ మూల



సిద్ధాంతాలకే వ్యతిరేకం. రాజ్యాంగం స్థానంలో 'మనుస్మృతి' అమలు చేయాలంటుంది. "రాజ్యాంగంలో మనదైన అంశమేలేదు. మనుస్మృతి ప్రపంచ సమ్మతి, ప్రశంస, యాదృచ్ఛిక విధేయత, అనుగుణ్యతలను పొందింది. రాజ్యాంగాన్ని శుభ్రపరచాలి. ఏకీకృత ప్రభుత్వం ఏర్పరచాలి." సంఘ్ రెండవ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ వ్యాఖ్యానం ఇది. "రాజకీయాలను హైందవీకరించండి. హిందుత్వాన్ని సైనికీకరించండి" అన్నారు సావర్కర్. ఇప్పుడు మోడీ సర్కార్ ప్రజా రాజ్యాంగాన్ని పాలక పక్షపాత గ్రంథంగా మారుస్తోంది. సర్వసత్తాక స్థానంలో ఏకసత్తాకం తెస్తోంది. రాజ్యాంగంలో పేర్కొన్న సామ్యవాదం అసమానతలను నిరోధిస్తుంది. లౌకికత్వం రాజ్యాన్ని, మతాన్ని వేరుచేస్తుంది. ప్రజలను సోదరులుగా, మనుషులుగా తీర్చిదిద్దుతుంది. కానీ నేటి ప్రభుత్వం ఈ పదాలను రాజ్యాంగం నుంచే తొలగించాలని ప్రయత్నిస్తోంది. సామ్యవాదం మరిచి అసమానతలను పెంచి కార్పొరేట్ల ప్రభుత్వంగా మారింది. ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలకు తిలోదకాలిచ్చింది. హేతు, భౌతిక, మానవ వాదాలను ప్రోత్సహించటం లౌకిక రాజ్య లక్షణం. గత ప్రభుత్వాల్లో లౌకిక భావం నిర్వీర్యమైంది. బీజేపీ సర్కార్ హిందూమత విశ్వాసాన్నే దేశభక్తిగా మారుస్తోంది. లౌకికత్వాన్ని హిందుత్వానికి ముడేసి హిందూత్వనే భారతీయతగా చెపుతోంది. సంస్థలన్నిటినీ సంఘ్ తాత్వికులతో నింపి, బలహీన పర్చింది. నియంతృత్వ ధోరణలతో రాజ్యాంగాన్ని ఎగతాళిచేసింది. పౌరసత్వ సవరణ చట్టంలో రాజ్యాంగ సమానత్వ అధికరణలు 14-18లను తిరస్కరిస్తుంది. సామాజిక సౌభ్రాతృత్వాన్ని మంటగలిపుతోంది. తన నిరంకుశ స్వేచ్ఛను, కార్పొరేట్ల దోపిడీ స్వేచ్ఛను పెంచుకుంటూ ప్రజల స్వేచ్ఛలను హరిస్తోంది. తమ దుశ్చర్యలను, తాత్వికతను ప్రశ్నించినవారిని తప్పుడు కేసులతో అరెస్టు చేయించి, జాతి నిర్మాతల గౌరవాన్ని కించ పరుస్తోంది. లౌకికత్వం, అంతర్జాతీయత, బహుళ సంస్కృతులతో పూర్వ కీర్తిప్రతిష్టలు నశించాయని ఫాసిజం నమ్మకం. దీనికి మతోన్మాదం తోడ్పడింది. భారతీయ సౌభ్రాతృత్వం, అంతర్జా తీయ మానవత్వం లేకుండా దేశ సమగ్రత, సమైక్యతలకు సంపూర్ణత లేదు. రాజ్యాంగ మనుగడ లేదు.

బీజేపీ సర్కార్ లక్షల్లో సంఘ్ కార్యకర్తలను పోలీసులుగా నియమించుకుందని, న్యాయవాదులుగా నమోదుచేసుకుందని మంగళూరు బీజేపీ శాసన సభ్యుడు ఏడేండ్ల క్రితమే వెల్లడించారు. ఇప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికే తూట్లుపొడుస్తోంది. ఇటీవలి కోర్టు తీర్పులన్నీ బీజేపీ కోరుకున్నట్లే రావడం యాదృచ్ఛికం కాదని బీజేపీ నాయకులే అంటున్నారు. మీడియా పాలకపక్ష కార్పొరేట్ల చేతుల్లో చేరింది. ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే చౌర్యోన్మాదస్వామ్యంగా ప్రజాస్వామ్యాన్ని మార్చింది. మతవాదం ఫాసిజానికి దారితీస్తోంది. జైళ్ళలో ఉండాల్సినవారు కుర్చీలెక్కి రాజ్యాంగ బాధ్యత మరిచారు. ఆ బాధ్యతను తలకెత్తుకొన్న సమాజ నిర్మాతలను జైళ్ళలో కుక్కారు. గతంలోలేని రీతిలో, స్థాయిలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది.

అంబేద్కర్ అనుమానాలు నిజాలయాయి. ఆయన చెప్పినట్టు ఇప్పుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగాల రక్షణ బాధ్యత ప్రజలదే. ప్రత్యామ్నాయ పార్టీలు సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పద్ధతులతో ఎదగాలి. విద్యార్థులు, యువత, పౌరులు రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు, పౌర జ్ఞానం, రాజ్యాంగ వక్రీకరణ నష్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్గస్వభావం, సామ్యవాదం, ఫాసిజంలపై అవగాహన పెంచుకోవాలి. ప్రజా స్వామ్యం, రాజ్యాంగాలను సమాజానికి అనుసం ధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు రాజ్యాంగరక్షణలో భాగస్వాములు కావాలి.

సెల్:9490204545

> అంబేద్కర్ అనుమానాలు నిజాలయాయి. ఆయన చెప్పినట్టు ఇప్పుడు స్వాతంత్ర్యం, రాజ్యాంగాల రక్షణ బాధ్యత ప్రజలదే. ప్రత్యామ్నాయ పార్టీలు సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక పద్ధతులతో ఎదగాలి. విద్యార్థులు, యువత, పౌరులు రాజ్యాంగ హక్కులు, బాధ్యతలు, పౌరజ్ఞానం, రాజ్యాంగ వక్రీకరణ నష్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్గస్వభావం, సామ్యవాదం, ఫాసిజంలపై అవగాహన పెంచుకోవాలి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలను సమాజానికి అనుసంధానించి ప్రచారం చేయాలి. బుద్ధిజీవులు రాజ్యాంగరక్షణలో భాగస్వాములు కావాలి.

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పొడవైనది. గణతంత్ర దినోత్సవంగా జరుపుకునే 26 జనవరి 1950న ఇది చట్టబద్ధంగా అమలు చేయబడింది. రాజ్యాంగ అసెంబ్లీలోని 299 మంది సభ్యులలో 15 మంది మహిళలు ఉన్నారు. కాని వీరి గురించి అంతగా బయటి ప్రపంచానికి తెలియదు. వారిలో ప్రతి ఒక్కరు ఆనాడు ఒక్కో చరిత్ర సృష్టించిన వారు. బాల్య వివాహాలపై పోరాడి, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారిని ఉద్ధరించడానికి అవిశ్రాంతంగా కృషి చేశారు. స్వాతంత్ర్య సమరయోధులుగా, న్యాయవాదులుగా, సంస్కరణవాదులుగా, రాజకీయ నాయకులు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ 15 మంది మహిళల జీవితాలను ఒకసారి చూద్దాం.





రాజ్యాంగ రూపకల్పనలో మహిళలు

దాక్షాయణి వేలాయుధన్

34 ఏండ్ల వయసులో దాక్షాయణి అసెంబ్లీలో అతి పిన్న వయస్కురాలు. కొచ్చిన్‌లోని పులయ కమ్యూనిటీకి చెందిన ఆమె తన కమ్యూనిటీలో చదువుకున్న మొదటి తరం మహిళల్లో ఒకరు. 1945లో కొచ్చిన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. అసెంబ్లీ మొదటిసారి సమావేశమైన పది రోజుల తర్వాత దాక్షాయణి దాని ముందు నిలబడి తన మొదటి ప్రసంగం చేశారు.

అమ్ము స్వామినాథన్

ప్రారంభం నుండి బలమైన స్వరాన్ని వినిపించేవారు అమ్ము. తను 13 సంవత్సరాల వయసులో వివాహం చేసుకోవలసి వచ్చినప్పుడు కొన్ని షరతులు పెట్టారు. వీటిలో మద్రాసుకు వెళ్లి ఆంగ్ల విద్యను పొందడం లాంటివి కూడా ఉన్నాయి. 1914లో ఆమె రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మూడేండ్ల తర్వాత 1917లో అన్నీ బిసెంట్, మార్గరెట్ కజిన్స్, మాలతీ పట్వర్ధన్, శ్రీమతి దాదాభోయ్, శ్రీమతి అంబుజమ్మల్ వంటి ఇతర ప్రముఖులతో కలిసి ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. 1934లో మద్రాసు నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. అణచివేత, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పని చేసిన ఒక దృఢమైన న్యాయవాది అమ్ము.

తహంసా జీవరాజ్ మెహతా

"పురుషులందరూ స్వేచ్ఛగా, సమానంగా జన్మించారు" అన్న దాన్ని "మానవులందరూ స్వేచ్ఛగా, సమానంగా జన్మించారు" అని సవరించబడింది. ఈ మార్పు చిన్నదే అయినప్పటికీ దాని ప్రభావం చాలా విస్తృతమైనది. అయితే దీని క్రెడిట్ పూర్తిగా హంసా జీవరాజ్ మెహతాకే దక్కుతుంది. 1897 జూలై 3న సంపన్నుల కుటుంబంలో జన్మించిన హంసా తండ్రి మనుభాయ్ నందశంకర్ మెహతా, అప్పటి బరోడా దివాన్. ఆమె చిన్నతనంలో ఇంగ్లాండ్ వెళ్లి భారతదేశానికి తిరిగి వచ్చే ముందు సోషియాలజీ, జర్నలిజం పూర్తి చేశారు. హంసా సహాయ నిరాకరణ, స్వదేశీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆమె 1937లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ స్థానం నుండి మొదటి ప్రావిన్షియల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కౌన్సిల్‌లో రెండు పర్యాయాలు (1937-39, 1840-49) పనిచేశారు. తదనంతరం రాజ్యాంగ సభలో చేరారు.



లీలా రాయ్

అక్టోబరు 1900లో అస్సాంలోని గోల్‌పరాలో జన్మించిన లీలా 1923లో ఢాకా విశ్వవిద్యాలయం నుండి ఎమ్మె పట్టా పొందిన మొదటి మహిళ. అదే సంవత్సరంలో ఆమె సామాజిక, రాజకీయాలను ప్రోత్సహించే, బోధించే మహిళల కోసం 'దీపాలి సంఘ'ను కూడా స్థాపించారు. విద్యకు గొప్ప మద్దతుదారు. ఆమె ఢాకాలో మహిళల కోసం రెండవ పాఠశాలను ఏర్పాటు చేశారు. మార్షల్ ఆర్ట్స్, వృత్తి శిక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈమె రచయిత్రి కూడా. 1931లో జయశ్రీని ప్రచురించడం ప్రారంభించారు. ఇది మహిళా రచయితలచే నిర్వహించబడిన మొదటి పత్రిక. లీలా 9 డిసెంబర్ 1946న బెంగాల్ నుండి రాజ్యాంగ పరిషత్ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. బెంగాల్ నుండి ఎన్నికైన ఏకైక మహిళా సభ్యురాలు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్

మొదట సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు దుర్గాబాయికి 12 ఏండ్లు. 1936లో ఆమె ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇది తర్వాత మద్రాసు నగరంలో గొప్ప విద్య, సామాజిక సంక్షేమ సంస్థగా మారింది. "నేను చట్టాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నాను. తద్వారా మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించి, తమను తాము రక్షించుకోవడానికి వారికి సహాయం చేయగలను" అని ఆమె తన ఆత్మకథలో రాసుకున్నారు. అందుకే జైలు శిక్ష తర్వాత ఆమె రాజకీయాల నుండి విద్యపై దృష్టి మళ్లించారు. దుర్గాబాయి న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు మద్రాసు బార్‌లో చేరారు. ఆమె 1946లో రాజ్యాంగ పరిషత్‌లోకి ప్రవేశించారు.

బేగం ఐజాజ్ రసూల్

రాజ్యాంగ పరిషత్‌లోని ఏకైక ముస్లిం మహిళా సభ్యురాలు ఐజాజ్ రసూల్. 1937లో తన మొదటి ఎన్నికల్లో రిజర్వ్‌డ్ కాని స్థానం నుండి గెలిచి ఉత్తరప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలయ్యారు. అప్పుడే అధికారికంగా పర్దాను వదులుకున్నారు. రాజకీయ కుటుంబం నుండి వచ్చిన రసూల్ చిన్నతనంలోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆమె తన తండ్రి జుల్ఫికర్ అలీ ఖాన్‌తో పాటు వివిధ సమావేశాలకు వెళ్లేవారు. కొన్నిసార్లు అతని కార్యదర్శిగా నోట్స్ కూడా తీసుకునేవారు. 1952 నుండి 1958 వరకు భారత జాతీయ కాంగ్రెస్‌కు రాజ్యసభ సభ్యురాలిగా సేవలందించారు. పదిహేనేళ్లకు పైగా భారత మహిళా హాకీ సమాఖ్య అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు.

కమల చౌదరి

1930లో శాసనోల్లంఘన ఉద్యమంలో అత్యంత చురుకైన మహిళా సభ్యులలో ఒకరుగా పేరుగాంచిన మహిళ కమల. ఆ కాలంలో అనేకసార్లు జైలుకెళ్లారు. 1946లో మీరట్‌లో జరిగిన కాంగ్రెస్ 54వ సదస్సులో ఆమె ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1947 నుండి 1952 వరకు రాజ్యాంగ పరిషత్‌లో సభ్యురాలిగా కొనసాగారు. కమలా నిష్ణాతులైన రచయిత్రి, లింగ వివక్ష, దోపిడీపై విస్తృతంగా రాశారు.

సుచేతా కృపాలానీ

స్వాతంత్ర్య సమరయోధురాలు, రాజ్యాంగ పరిషత్ సభ్యురాలు, ముఖ్యమంత్రి, ప్రతిచోటా మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన సుచేతా కృప్లానీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చాలా కీలక పాత్ర పోషించారు. ఆమె 1940లో ఐఎన్‌సీలో మహిళా విభాగాన్ని స్థాపించడానికి బాధ్యత వహించారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసిద్ధ "ట్రిస్ట్ విత్ డెస్టినీ" ప్రసంగం చేయడానికి ముందు వందేమాతరం, సారే జహాన్ సే అచా, జన గణ మన పాటలను పాడటానికి ఆమెపే ఆహ్వానించబడినప్పుడు ఆమె రాజకీయ జీవితంలో గర్వించదగిన క్షణాలలో ఒకటిగా చెప్పుకుంటారు.

మాలతీ చౌదరి

ఒడిశాకు చెందిన రాజ్యాంగ సభ సభ్యురాలు మాలతి సమాజంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి అపారమైన కృషి చేశారు. 16 ఏండ్ల వయసులో ఆమె శాంతినికేతన్ చేరుకుంది. అక్కడ ఆమె విశ్వభారతి విశ్వవిద్యాలయంలో చదువుకుంది. తర్వాత ఒడిషా ముఖ్యమంత్రి అయ్యి 1927లో ఒడిషాకు మారిన నబక్రుష్ణ చౌధురిని వివాహం చేసుకుంది. సత్యాగ్రహ ఉద్యమంలో ఆమె, ఆమె భర్త కీలక పాత్ర పోషించారు. ఒడిశాలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాజీరౌత్ ఛత్రవాస్ వంటి అనేక సంస్థలను ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆమెకు ఉంది.

పూర్ణిమా బెనర్జీ

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో భారత జాతీయ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, 1930ల చివరలో, 1940లలో స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్రగామిగా నిలిచిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళల నెట్‌వర్క్‌లో పూర్ణిమ ఒకరు. సామ్యవాద భావజాలం పట్ల తన నిబద్ధతను ప్రదర్శిస్తూ రాజ్యాంగ సభలో ఆమె చేసిన ఉద్వేగభరితమైన, ఆవేశపూరిత ప్రసంగం ఆమెకు తరచుగా గుర్తుకు వచ్చే వాటిలో ఒకటి. సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమ నిరసనల సమయంలో జైలు శిక్ష అనుభవించిన ఆమె జైలు నుండి తన బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేశారని నివేదికలు చెబుతున్నాయి.

సరోజినీ నాయుడు

"నైటింగేల్ ఆఫ్ ఇండియా" అని పిలువబడే సరోజినీ నాయుడు 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసిన మొదటి భారతీయ మహిళ. ఆమె భారత రాష్ట్ర గవర్నర్‌గా కూడా చేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ తర్వాత కేంబ్రిడ్జ్‌లో చదివిన ఆమె సహాయ నిరాకరణ ఉద్యమం వైపు ఆకర్షితురాలయారు. 1924లో ఆఫ్రికా అంతటా పర్యటించి అక్కడి భారతీయుల అభిరుచులను అర్థం చేసుకోవడంలో గడిపారు. 1914లో ఆమె రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌కి ఫెలోగా ఎన్నికయ్యారు. 1917లో భారతీయ స్త్రీల పరిస్థితిలో సంస్కరణల శ్రేణిని డిమాండ్ చేయడానికి మోంటాగు-చెమ్స్‌ఫోర్డ్ కమిటీని కలిసేందుకు మహిళా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు.

రాజకుమారి అమృత్ కౌర్

1927లో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్‌కు సహ వ్యవస్థాపకురాలిగా, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన మానవతావాది రాజకుమారి అమృత్. ఆమె ట్యూబర్‌క్యులోసిస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ లెప్రసీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేశారు. లీగ్ ఆఫ్ రెడ్‌క్రాస్ సొసైటీస్ గవర్నర్ల బోర్డు వైస్-ఛైర్‌గా, సెయింట్ జాన్స్ అంబులెన్స్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. బాల్య వివాహాలు, పర్దా వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేశారు. ఈమె దేశానికి మొదటి మహిళా క్యాబినెట్ మంత్రి కూడా.

అన్నీ మస్కరేన్

అన్నీ రాజ్యాంగ పరిషత్‌లో ట్రావెన్‌కోర్, కొచ్చిన్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహించాయి. అసెంబ్లీలో చర్చల సందర్భంగా ఆమె ఫెడరలిజం గురించి చాలా ఉద్వేగంగా మాట్లాడారు. మొదటి లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. కేరళ నుంచి లోక్‌సభకు ఎన్నికైన తొలి మహిళగా రికార్డు సృష్టించారు.

విజయలక్ష్మి పండిట్

విజయలక్ష్మి పండిట్‌కి జవహర్‌లాల్ నెహ్రూ సోదరిగానే కాకుండా మంచి గుర్తింపు ఉంది. స్వాతంత్ర్య సమరయోధురాలు, క్విట్ ఇండియా ఉద్యమంతో సహా అనేక సందర్భాల్లో జైలుకెళ్లారు. దేశపు మొట్టమొదటి మహిళా క్యాబినెట్ మంత్రి, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి మొదటి ఆసియా అధ్యక్షురాలు

రేణుకా రే

రేణుకా రే భారతదేశ స్వాతంత్ర్యం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఐసీఎస్ అధికారి, సామాజిక కార్యకర్త కుమార్తెగా రేణుకా రే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి బీఏ పూర్తి చేసి భారతదేశానికి తిరిగి వచ్చి ఆల్ ఇండియా ఉమెన్ కాంగ్రెస్‌లో చేరారు. రాజ్యాంగం మహిళల సమానత్వాన్ని గుర్తించడంలో కీలకపాత్ర పోషించారు. 1943 నుండి 1946 వరకు చురుకైన రాజకీయ జీవితాన్ని గడిపారు.

– సలీమ

వేతన జీవులకు ఊరట లభించేనా?

(మొదటిపేజీ తరువాయి)

రూ.ఐదు లక్షలకు పెంచాలంటూ 2013లో అప్పటి బీజేపీ లోక్‌సభ ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ డిమాండ్ చేశారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దాన్ని విస్మరించడం గమనార్హం. అయితే ఇది ఎన్నికల బడ్జెట్ కావడంతో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని కేంద్రం పెంచుతుందన్న ఆశల్లో వేతన జీవులున్నారు. ఈసారి ఏం జరుగుతుందో వేచిచూడాల్సిందే.

రూ.5 లక్షలకు పెంచాలి : చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలకు పెంచాలి. పొదుపు మొత్తాలపై ఇచ్చే రాయితీలను రూ.మూడు లక్షలకు పొడిగించాలి. వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించాలి.

రూ.10 లక్షలకు పెంచాలి : ఎం రాజేందర్, టీఎన్జీవో అధ్యక్షులు

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి. కేంద్ర ప్రభుత్వం కొత్త శ్లాబులను ప్రకటించాలి. 2015లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులొచ్చాయి. కానీ శ్లాబుల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. సీపీఎస్‌ను కూడా కేంద్రం రద్దు చేయాలి.

నారా లోకేశ్ యువగళం

- పాదయాత్ర కోలాహలం
- జూబ్లీహిల్స్ నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు బైక్ ర్యాలీ

నవతెలంగాణ - హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ "యువగళం" పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టనున్న 400 రోజులు, 4,000 కి.మీ.ల పాదయాత్రకు హైదరాబాద్ నుంచి బుధవారం బయలుదేరారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద, టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వద్ద, ఎన్టీఆర్ ఘాట్ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. కాగా నారా లోకేశ్ ఇంటి నుంచి ఎన్టీఆర్ ఘాట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు టీటీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నేతత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీని నిర్వహించారు. తప్పెట్ల మోతలు, టపాసులు, జానపద కోలాటాలతో సందడిగా బైక్ ర్యాలీ చేశారు. లోకేశ్ తన నివాసం వద్ద హాజరైన నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేశారు. పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలతో సంఘీభావం ప్రకటించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. టీడీపీ వర్ధిల్లాలి, ఎన్టీఆర్ అమర్ రహే, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలి, యువగళం ప్రతిధ్వనించాలి, సైకో పోవాలి - సైకిల్ రావాలి తదితర నినాదాలతో ఎన్టీఆర్ ఘాట్ పరిసరాలు మార్మోగాయి.

జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)



ఛైర్‌పర్సన్ కన్నీరు పెట్టుకుంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. జగిత్యాల పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రశ్నిస్తున్నామన్న కోపంతో ఎమ్మెల్యే అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మీకు పిల్లలు ఉన్నారు.. వ్యాపారాలు ఉన్నాయి.. జాగ్రత్త" అంటూ బెదిరించడంతోపాటు డబ్బుల కోసం కూడా డిమాండ్ చేశారని ఆరోపించారు. డబ్బులు ఇచ్చుకునే పరిస్థితుల్లో తాము లేమని చెప్పినా వినిపించుకోకుండా అహంకారపూరితంగా వ్యవహరించారన్నారు. బీసీ బిడ్డ ఎదుగుతుందని ఓర్వలేక తనపై కక్షగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు అడ్డొస్తూ, తనకు చెప్పకుండా ఎలాంటి అభివృద్ధి పనులూ చేయొద్దని హుకుం జారీ చేస్తున్నారని చెప్పారు. తాను నరక ప్రాయంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిలో కొనసాగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్నేహితుడి పెట్రోల్ బంకు కోసం జంక్షన్ చిన్నగా చేసి కట్టారని, డివైడర్ ఎత్తు తగ్గించారని తాను అధికారులను అడిగితే "నీకు సంబంధం లేని విషయం" అంటూ వారి ముందే ఇష్టారీతిన ఎమ్మెల్యే అవమానించారని ఆమె వాపోయారు. మూడు ఏండ్లుగా నరకం అనుభవిస్తున్నానని, ప్రజాసేవలో నిమగ్నం అయిన తనను నిత్యం వేధింపులకు గురి చేయడమే పనిగా పెట్టుకున్నారని, చివరకు వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టినా తప్పేనంటూ మాట్లాడారని ఆరోపించారు. ఆర్డీఓ కన్నా తక్కువ ప్రొటోకాల్ ఉండే మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిలో ఉండి జిల్లా స్థాయి అధికారులను ఎలా కలుస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. ఎమ్మెల్యే ఈ విధంగా వ్యవహరించడం సరికాదని, అవిశ్వాసం కూడా ఆయన ఆడిన డ్రామానేనని ఆమె ఆరోపించారు. సస్పెండ్ చేస్తానని కమిషనర్‌ను బెదిరించడంతోనే ఆయన లీవ్‌పై వెళ్లిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కనీసం తనకు మాట్లాడే స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని, ఆయన ఇచ్చిన స్క్రిప్టే చదవాలని శాసించారన్నారు. మంత్రి కేటీఆర్‌ను, ఎమ్మెల్సీ కవితను కలవకూడదని ఒత్తిళ్లకు గురి చేశారన్నారు. సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత పేర్లు ప్రస్తావించకూడదని హుకుం జారీ చేశారని ఆరోపించారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు తెలిపారు. అయితే, ఈనెల 23న అధికార పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేసి ఆ పత్రాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అందజేశారు. కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమౌతున్న తరుణంలో ఆమె తన పదవికి రాజీనామా చేశారు.

సేఫ్టీ ఆడిట్ నిర్వహించండి

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ అమోయ్ కుమార్, మేడ్చల్ కలెక్టర్ హరీష్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈసమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కే తారకరామారావు మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర అన్ని ప్రధాన నగరాల్లోని ఎత్తైన భవనాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఫైర్ సేఫ్టి ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని చెప్పారు. ఆస్పత్రులు, పాఠశాల భవనాలు, పెట్రోల్‌బంకులు, గ్యాస్ గోదాములు, వ్యాపార, వాణిజ్య భవనాలు, ఎత్తైన అపార్టుమెంట్లలో సేఫ్టి ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పారు. దీనికోసం అవసరమైతే 1999 నాటి ఫైర్‌సేఫ్టీ చట్టాలను మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని సూచించారు. అగ్నిమాపకశాఖకు ఆధునిక వాహనాలు, అగ్నిమాపక యంత్రాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, దీనికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపాలని మంత్రి కేటీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. రాష్ట్ర పశు సంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ ఫైర్‌సేఫ్టీపై మార్గదర్శకాలు సూచించడానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 25 లక్షల వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయనీ, ఇవన్నీ తమ స్వంత ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకునేవిధంగా మార్గదర్శకాలు జారీ చేయాలని చెప్పారు. హోం శాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ, భవన నిర్మాణ అనుమతులు జారీ చేసే సమయంలోనే ఫైర్‌సేఫ్టీపై కఠిన నిబంధనలు విధించాలని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు సమర్పించడానికి ఉన్నతస్థాయి అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు.

నేడు కిసాన్ ట్రాక్టర్స్ మార్చ్

20 రాష్ట్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

- హర్యానాలోని జింద్‌లో భారీ కిసాన్ మహాపంచాయత్‌కు సన్నాహాలు



న్యూఢిల్లీ : రైతుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు (గురువారం) దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ట్రాక్టర్స్ మార్చ్ నిర్వహించనున్నది. రైతులు జాతీయ జెండాను ఎగురవేసిన తరువాత ట్రాక్టర్ ర్యాలీలు, పాదయాత్రలు, సమావేశాలను నిర్వహించనున్నట్టు ఎస్కేఎం తెలిపింది. దేశవ్యాప్తంగా 300 జిల్లాలను కవర్ చేస్తూ 20 కంటే ఎక్కువ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. చారిత్రాత్మక రైతు పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులందరికీ నివాళులు అర్పిస్తామని తెలిపింది. జిల్లా కలెక్టర్లకు మెమోరాండం అందజేస్తామని పేర్కొంది. జనవరి 26న హర్యానాలోని జింద్‌లో రైతుల భారీ కిసాన్ మహాపంచాయత్ జరగనున్నది. ఎస్కేఎం ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు 2021 జనవరి 26న బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఎస్కేఎం బట్టబయలు చేస్తుంది. కిసాన్ ఐక్యత బలమైన ప్రదర్శనలో మహాపంచాయత్ సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొంది. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్న ఫాసిస్ట్, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మహాపంచాయత్ ఒక ధృఢమైన సందేశాన్ని పంపుతుందనీ, అదే సమయంలో రైతుల సమస్యలను కూడా లేవనెత్తుతుందని ఎస్కేఎం తెలిపింది.

రైతు హంతకుడైన ఆశిష్ మిశ్రాకు బెయిలా..?
ఎస్కేఎం దిగ్భ్రాంతి

లఖింపూర్ ఖేరీ వద్ద పట్టపగలు తన వాహనంతో నలుగురిని హతమార్చిన కేంద్రమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు ఎనిమిది వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం పట్ల సంయుక్త కిసాన్ మోర్చా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. అయితే ఆశిష్ మిశ్రా విడుదలైన వారంలోపు యూపీ వదిలి వెళ్లాలనీ, ఢిల్లీ, యూపీల్లో ఉండకూడదని ఉత్తర్వు నిర్దేశించడం కొంత ఓదార్పునిస్తుందని పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రైతులను చంపేస్తానని మంత్రి బెదిరించడంతోపాటు... రైతులను హత్య చేయడం హింసాత్మక చర్య అని పేర్కొంది. మిశ్రా అధికార బీజేపీకి అనుబంధంగా ఉన్న శక్తివంతమైన రాజకీయ నాయకుడు, ఆయన విడుదల సాక్షులను బాగా భయపెడుతున్నదనీ, విచారణను ప్రమాదంలో పడేస్తుందని ఎస్కేఎం ఆందోళన వ్యక్తం చేసింది. బీజేపీ నేతృత్వంలోని యోగి ప్రభుత్వం ఆశిష్ మిశ్రాను అరెస్టు చేయడం, అభియోగాలు మోపడం పట్ల మృదువుగా వ్యవహరిస్తోందనీ, చివరికి సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు, చర్యకు ఆదేశించాల్సి వచ్చిందని గుర్తుంచుకోవాలని సూచించింది. మిశ్రా న్యాయాన్ని ఎలా దారి మళ్లిస్తాడో, తప్పుదోవ పట్టిస్తాడో ఊహించవచ్చని పేర్కొంది. లఖింపూర్ ఖేరీ దోషులను త్వరగా శిక్షించాలని, అజయ్ మిశ్రా టేనిని కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని ఎస్కేఎం డిమాండ్ చేస్తూనే ఉన్నదనీ, కాని ఈ రెండూ నెరవేరలేదని పేర్కొంది. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని మరింత పొడిగించకూడదని కోరింది. ఆశిష్ మిశ్రా, ఆయన తండ్రి అజయ్ మిశ్రా సమాజానికి ముప్పు అని పేర్కొంది. లఖింపూర్ ఖేరీ ఘటనలో జైల్లో మగ్గుతున్న అమాయక రైతులకు శాశ్వత బెయిల్ మంజూరు చేయాలనీ, వారిపై పెట్టిన నకిలీ కేసులను ఉపసంహరించుకోవాలని ఎస్కేఎం డిమాండ్ చేసింది.

జేఎన్‌యూలో రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తారని ఒక ప్రకటనలో ఏఐఎస్ఏ తెలిపింది.

జామియా మిలియా

బుధవారం ఢిల్లీ జామియా మిలియా వర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన డాక్యుమెంటరీ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. పదుల సంఖ్యలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం వర్సిటీ ప్రధాన గేటును మూసేసిన పోలీసులు, విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. దీంతో గేటు వద్ద విద్యార్థులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఫతేపూర్ బేరిలోని క్యాంపస్‌కు 20 కి.మీ దూరంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల్ని పోలీసులు అరెస్టు చేయటం ఏంటని 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్' (ఏఐఎస్ఏ) ప్రశ్నించింది. అరెస్టయిన కార్యకర్తల మొబైల్ ఫోన్లను పోలీసులు లాక్కున్నారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐఎస్ఏ ఒక ప్రకటన జారీచేసింది. అరెస్టు చేసిన విద్యార్థుల్ని పోలీసులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ ప్రదర్శన చేపట్టగా, డాక్యుమెంటరీ ప్రసారమవుతుండగా...మధ్యలో పోలీసులు రంగంలోకి దిగి కార్యక్రమాన్ని నిలిపివేశారు.

పౌష్టికాహారంలో కామారెడ్డి వెనుకబాటు

(మొదటిపేజీ తరువాయి)

లోపంతో బాధపడుతున్నట్టు అధికారులు గుర్తించారు. 2021-22 లో 21,03,194 మంది చిన్నారులు అదనపు పౌష్టికాహారం కోసం నమోదు చేసుకోగా వారిలో 57.9 శాతం మంది అంటే 12,18,336 మందికి మాత్రమే పౌష్టికాహారం అందుతుండటం గమనార్హం. ఇందులోనూ 78.4 శాతంతో సిద్ధిపేట మొదటి స్థానంలో నిలవగా కేవలం 20.9 శాతం మందితో కామారెడ్డి చివరి స్థానంలోకి దిగజారింది. తల్లులకు అదనపు పౌష్టికాహారం అందించే కార్యక్రమానికి 4,82,242 మంది నమోదు చేసుకోగా 2,58,562 (53.6 శాతం) మందికి మాత్రమే అది అందుతున్నది. ఈ కేటగిరీలో 62.9 శాతంతో జగిత్యాల మొదటి స్థానంలో ఉండగా, 26.9 శాతంతో కామారెడ్డి చివరి స్థానంలో నిలిచింది. ప్రసవాల సమయంలో జరిగే మరణాలు 2019లో లక్షకు 56గా ఉండగా 2020 నాటికి 43కు తగ్గాయి. 2021-22 లో కేసీఆర్ కిట్లను 1,05,439 మందికి పంపిణీ చేయగా 2022-23లో ఆగస్టు నాటికే 97,448 మందికి అందజేశారు. 2021-22 లో 1,71,903 మంది ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందారు.

వెయ్యి మంది మగ పిల్లలకు...
934 మంది ఆడ పిల్లలు

నవజాత శిశువు మొదలుకుని ఆరేండ్ల లోపు చిన్నారుల సంఖ్య రాష్ట్రంలో 38,99,166గా ఉంది. వీరిలో మగ శిశువులు 20,17,935 కాగా వారి కన్నా 1,36,704 మంది తక్కువగా ఆడ శిశువుల సంఖ్య 18,81,231కే పరిమితమైంది. అంటే ప్రతి 1,000 మంది మగ శిశువులకు గానూ 934 మంది ఆడ శిశువులే ఉన్నారన్న మాట. జిల్లాలవారీగా చూస్తే ములుగు జిల్లాలో ప్రతి 1,000 మంది మగ శిశువులకుగాను 971 మందితో కొంత మెరుగ్గా ఉండగా, వనపర్తి, మహబూబాబాద్ జిల్లాల్లో ఆ సంఖ్య 903కే పరిమితమైంది.

రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదిక విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదికను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గణాంక భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారులు డాక్టర్ జి.ఆర్ రెడ్డి, అర్థగణాంక శాఖ డైరెక్టర్ జి దయానందం, రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామకృష్ణ, కన్సల్టెంట్ రామభద్రం, స్టాటిస్టికల్ అదనపు డైరెక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పురోగతి, జీడీపీ, అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరాలను ఈ ప్రచురణలో సవివరంగా పేర్కొన్నారు.

తెలంగాణకు 13 పోలీసు పతకాలు

- రెండు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు

న్యూఢిల్లీ : 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు కేంద్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 901 మందికి పోలీసు పతకాలు అందజేయనుంది. ఈ మేరకు బుధవారం అవార్డుల జాబితాను విడుదల చేసింది. 140 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పీఎంజీ), 93 మంది పోలీసులకు రాష్ట్రపతి పోలీసు పతకాలు(పీపీఎం), 668 మందికి పోలీస్ విశిష్ట సేవా (పోలీసు మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను ప్రకటించింది. గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 140 మందిలో అత్యధికంగా 48 మంది సీఆర్పీఎఫ్ పోలీసులున్నారు. మహారాష్ట్ర నుంచి 31 మంది, జమ్ముకాశ్మీర్ నుం చి 25, జార్ఖండ్ నుంచి 9, ఢిల్లీ నుంచి 7, ఛత్తీస్‌గఢ్ నుంచి ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ పురస్కారాలు దక్కాయి.

తెలంగాణకు రెండు రాష్ట్రపతి పోలీసు, 11 ప్రతిభా పతకాలు

తెలంగాణకు రెండు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలతో పాటు, 11 పోలీసు ప్రతిభా పతకాలు లభించాయి. అదే సమయంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారాంకు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకం లభించింది. ఆంధ్రప్రదేశ్‌కు రెండు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలతో పాటు, 15 పోలీసు ప్రతిభా పతకాలు లభించాయి. తెలంగాణలో విశిష్ట సేవలందించినందుకు గాను అనిల్ కుమార్ (ఏడీజీ), బంగి రామకష్ణ (అడిషనల్ కమాండెంట్, టీఎస్ఎస్పీ 12 బెటాలియన్)కు రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించాయి. కాగా ఈ ఏడాది మరో 13 మంది అధికారులు పోలీసు ప్రతిభా పతాకాలకు ఎంపికయ్యారు. తరుణ్ జోషి (వరంగల్ పోలీసు కమిషనర్), పేర్ల విశ్వ ప్రసాద్ (జాయింట్ పోలీసు కమిషనర్, స్పెషల్ బ్రాంచ్, హైదరాబాద్), గంగసాని శ్రీధర్ (ఏసీపీ, సైబర్ క్రైం), పి.నర్సింహ (డీఎస్పీ, రీజినల్ ఇంటలిజెన్స్), ఆర్.అరుణ్ రాజ్ (డీఎస్పీ, బేగంపేట్), జి వెంకటేశ్వర్లు(ఇన్‌స్పెక్టర్, సిటీ స్పెషల్ బ్రాంచ్), ఎం.శ్రీధర్ రెడ్డి (ఇన్‌స్పెక్టర్, ఐటీ సెల్), ఎస్.ఎస్ జైశంకర్ (ఏఆర్ఎస్ఐ, 3 బెటాలియన్), కరుకొండ దయశీల (ఆర్ఐ, వరంగల్), జి.అచ్యుత రెడ్డి (ఏఏసీ (గ్రేహౌండ్స్), ఎస్ రాందేవ్ రెడ్డి (ఇన్‌స్పెక్టర్, ఇంటలిజెన్స్), వీర రామాంజనేయులు (ఏఆర్ ఎస్ఐ, ఇంటలిజెన్స్), బి.వి.సన్యాసిరావు (ఇన్స్‌పెక్టర్, టీఎస్పీఎస్ హైదరాబాద్)లకు పోలీసు ప్రతిభా పురస్కారాలు దక్కాయి.

నమామి గంగే
పతంజలికి రూ.4కోట్ల ప్రాజెక్ట్

- పుష్ప వైవిధ్యంపై శాస్త్రీయ అన్వేషణ

న్యూఢిల్లీ : గంగా నదీ పరివాహక ప్రాంతంలో పుష్ప వైవిధ్యంపై శాస్త్రీయ అన్వేషణ చేయటం కోసం 'పతంజలి' సంస్థకు రూ.4.32 కోట్ల ప్రాజెక్టు దక్కింది. కేంద్ర జలశక్తి పరిధిలోకి వచ్చే 'నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా' (ఎన్ఎంసీజీ) నమామి గంగే కార్యక్రమాన్ని అమలుజేస్తోంది. హరిద్వార్‌లోని పతంజలి రీసెర్చ్, పతంజలి ఆర్గానిక్ రీసెర్చ్ సంస్థలకు పుష్ప వైవిధ్యంపై శాస్త్రీయ శోధన ప్రాజెక్టును 'ఎన్ఎంసీజీ' అప్పగించింది. 18 నెలల కాలవ్యవధిలో ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని ఎన్ఎంసీజీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదేశించింది. ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మినిట్స్ వివరాలు తాజాగా మీడియాకు విడుదల చేశారు. పుష్ప వైవిధ్యంపై బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని ఉపయోగించుకోవాలని, పాత విషయాలు పునరావృతం కాకుండా సంబంధిత ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సమావేశంలో 'ఎన్ఎంసీజీ' నిర్దేశించింది. అంతేగాక డెహ్రాడూన్ వద్ద ఉన్న ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వద్ద ఉన్న సమాచారాన్ని వినియోగించుకోవాలని పతంజలికి సూచించింది. ప్రాజెక్టుకు సంబంధించి సంయుక్త అవగాహనా ఒప్పందంపై పతంజలి సంస్థల చైర్మెన్ ఆచార్య బాలకృష్ణ, ఎన్ఎంసీజీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సంతకాలు చేశారు.

జర్నలిస్టు రాణా అయూబ్‌పై కేసు విచారణను
జనవరి 31కి వాయిదా వేయండి

- యూపీ కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జర్నలిస్టు రాణా అయూబ్‌పై మనీలాండరింగ్ కేసులో విచారణను జనవరి 31 తరువాత ఏ రోజుకు అయినా వాయిదా వేయాలని ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ ప్రత్యేక కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. ఘజియాబాద్ కోర్టు జారీచేసిన సమన్లకు వ్యతిరేకంగా అయూబ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జనవరి 31న విచారించనున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ వి. రామసుబ్రమణియన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'మేం ఈ కేసును జనవరి 31న విచారిస్తాం. ఈ లోగా ఘజియాబాద్ ప్రత్యేక కోర్టు అవినీతి నిరోధక అంశంపై జనవరి 27న నిర్ణయించిన విచారణను జనవరి 31 తరువాత తేదీకి వాయిదా వేయాలని తెలిపింది. విచారణను ముగించలేనందున ఈ ఉత్తర్వు జారీ చేస్తున్నాం. సమయాభావం వల్ల తప్ప మెరిట్‌ల ఆధారంగా కాదు' అని సుప్రీం కోర్టు ఆదేశించింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు సంబంధించి ఘజియాబాద్‌లోని ట్రయల్ కోర్టు అయ్యూబ్‌కు సమన్లు జారీ చేసింది. ఈ ఫిర్యాదు ముంబయిలో తలెత్తినందున ఈడి ఢిల్లీ జోనల్ ఆఫీస్ ఈ విషయాన్ని విచారిస్తున్నందున ఈ అంశాన్ని విచారించే అధికారం యుపి కోర్టుకు లేదని వాదిస్తూ అయ్యూబ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఇంటర్‌లో ఆన్‌లైన్ మూల్యాంకనం

- ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు
- తొలుత లాంగ్వేజ్‌లు, ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టులకు వర్తింపు
- వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల ఎవాల్యుయేషన్
- వచ్చే ఏడాది సైన్స్ సబ్జెక్టులకు అమలు
- టెండర్ నోటిఫికేషన్ విడుదల
- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- సమర్పణకు తుది గడువు ఫిబ్రవరి 9

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభం కానుంది. తొలుత ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని లాంగ్వేజ్‌తోపాటు ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులకు ఈ విధానాన్ని వర్తింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి సైన్స్ సబ్జెక్టులకు కూడా ఆన్‌లైన్ మూల్యాంకనం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. గురువారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. వాటి సమర్పణకు తుది గడువు వచ్చేనెల తొమ్మిదో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు అవకాశమున్నది. టెండర్ దరఖాస్తు ఫీజు రూ.మూడు వేలు చెల్లించాలి. వచ్చేనెల ఒకటో తేదీన ప్రీ బిడ్ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) రూ.12 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చేనెల తొమ్మిదిన మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్లను ఖరారు చేయనున్నట్టు ప్రకటించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి దశలవారీగా వార్షిక, అడాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభమవుతుంది. వార్షిక పరీక్షలకు ఏటా పది లక్షల మంది, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఐదు లక్షల మంది జనరల్ విద్యార్థులతోపాటు వార్షిక పరీక్షలకు 70 వేల మంది, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి 40 వేల మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరవుతారు. ప్రస్తుత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షల్లో తొలుత లాంగ్వేజ్ సబ్జెక్టులకు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులకు పది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులకు ఐదు లక్షలు కలిపి మొత్తం 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారు. సైన్స్ సబ్జెక్టులకు ఆఫ్‌లైన్ (పాత పద్ధతిలో) మూల్యాంకనం జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో లాంగ్వేజ్ సబ్జెక్టులు ఏడు లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులు 3.50 లక్షలు, ఒకేషనల్ 1.50 లక్షలు కలిపి మొత్తం 12 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపడతారు. వచ్చే విద్యాసంవత్సరం(2023-24)లో వార్షిక పరీక్షల్లో లాంగ్వేజ్ సబ్జెక్టులు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) పది లక్షలు, సైన్స్ సబ్జెక్టులు (50 శాతం మాత్రమే) పది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులు ఐదు లక్షలు కలిపి మొత్తం 45 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో లాంగ్వేజ్ సబ్జెక్టులు ఏడు లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులు 3.50 లక్షలు, సైన్స్ సబ్జెక్టులు (50 శాతం మాత్రమే) నాలుగు లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులు 1.50 లక్షలు కలిపి 16 లక్షల జవాబు పత్రాలకు ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపడతారు. 2024-25 విద్యాసంవత్సరంలో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఇంటర్ పరీక్షలు-2025 వార్షిక పరీక్షల్లో లాంగ్వేజ్ సబ్జెక్టులు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) పది లక్షలు, సైన్స్ సబ్జెక్టులు 20 లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులు ఐదు లక్షలు కలిపి మొత్తం 55 లక్షల జవాబు పత్రాలకు ఆన్‌లైన్‌లో మూల్యాంకనం కొనసాగుతుంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో లాంగ్వేజ్ సబ్జెక్టులు ఏడు లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్) సబ్జెక్టులు 3.50 లక్షలు, సైన్స్ సబ్జెక్టులు ఎనిమిది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులు 1.50 లక్షలు కలిపి మొత్తం 20 లక్షల జవాబు పత్రాలకు ఈ పద్ధతే ఉంటుంది.

చెప్పిన సొమ్ము ఇప్పించండి

- ఆర్థికమంత్రికి టీఎమ్‌యూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించి, కేవలం రూ.500 కోట్లు మాత్రమే విడుదల చేశారనీ, మిగిలిన రూ.వెయ్యి కోట్లు కూడా ఇవ్వాలని టీఎమ్‌యూ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం టీఎమ్‌యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏఆర్ రెడ్డి, థామస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్, ముఖ్య సలహాదారులు యాదయ్య, మారయ్య, కోశాధికారి రాఘవరెడ్డి తదితరులు ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన సీసీఎస్, పీఎఫ్ బకాయిలు, బాండ్ అమౌంట్ చెల్లించాలని కోరారు.



మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలైన వేతన సవరణ, యూనియన్ పునరుద్ధరణ, జాబ్ సెక్యూరిటీ విషయాల్లో ముఖ్యమంత్రితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్థిక మంత్రి తప్పక ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు.

యూబీఐడీఈఎఫ్ క్యాలెండర్‌ను
ఆవిష్కరించిన సురేష్ చంద్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (యూబీఐడీఈఎఫ్) క్యాలెండర్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర తెల్లి, హెచ్‌ఆర్ విభాగం చీఫ్ మేనేజనర్ ఎ విజయ్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ చంద్ర తెల్లి మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కానీ మానసిక సామర్థ్యానికి కాదని చెప్పారు. కదల్లేని స్థితిలో వీల్ చైర్‌లో కూర్చుని కేవలం అంతరిక్షంలోని బ్లాక్ హోల్స్‌పై పరిశోధన చేసి రహస్యాలు ఛేదించిన స్టీఫెన్ హాకింగ్ అందరికీ ఆదర్శమని అన్నారు. లూయిస్ బ్రెయిలీ కనిపెట్టిన ఆరు చుక్కల లిపి ఇప్పటికీ అనేక దేశాలు, భాషలు అంధుల కోసం వాడుతున్నాయని వివరించారు. ఇలాంటి మేధావులు ఈ ప్రపంచానికి ఆదర్శమనీ, భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశకులని అభిప్రాయపడ్డారు. దృష్టి లోపం ఉన్న వారందరి



అవసరాలను పరిగణనలోకి తీసుకుని వారి కోసం ప్రత్యేకంగా స్పర్శ్ బ్రెయిలీ డెబిట్ కార్డును రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఐడీఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి రాజశేఖర్, నాయకులు ఆర్ స్వామినాయక్, పి కృష్ణయ్య, దివ్యశ్రీ, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక భాషల్లో వెయ్యికి పైగా తీర్పులు : సీజేఐ

న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం వెయ్యికి పైగా తీర్పు లను వివిధ భాషల్లో విడుదల చేయను న్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. మొత్తం 1,091 తీర్పులను స్థానిక భాషలన్నింటిలోనూ విడుదల చేయనున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ బుధవారం ప్రకటించారు. తీర్పులను ఇంగ్లీషు నుంచి వివిధ భారతీయ భాషల్లోకి అనువదించడం శరవేగంగా జరుగుతోందని అన్నారు. ఒరియా, అస్సామీ, ఖాసీ, గారో, పంజాబీ, నేపాలీ, బెంగాలీ భాషల్లోకి అనువదిస్తున్నామని చెప్పారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్.. ప్రగతి భవన్‌లో సీఎం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు జాతీయ పతాకావిష్కరణలు

- ప్రజలకు తమిళిసై, కేసీఆర్ శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గణతంత్ర వేడుకల సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లో ప్రభుత్వం తరపున వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ ఉదయం ఏడు గంటలకు జాతీయ పతాకాన్ని ఎగరేస్తారు. అనంతరం ఆమె పుదుచ్చేరికి బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు. ప్రగతి భవన్‌లో నిర్వహించే ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఉదయం 8.30 గంటలకు ఆయన అక్కడ జాతీయ పతాకాన్ని ఎగరేస్తారు.

ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానానికి వెళ్లి అక్కడ అమర జవాన్ల స్థూపం వద్ద నివాళులర్పిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం (తెలంగాణ భవన్-జూబ్లీహిల్స్)లో నిర్వహించే వేడుకల్లో ఆ పార్టీ పార్లమెంటరీ నేత కే.కేశవరావు పాల్గొంటారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్, గాంధీ భవన్, బీజేపీ ఆఫీసుల్లో కూడా జాతీయ పతాకాలను ఎగురవేయనున్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని గవర్నర్ తమిళి సై, సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం దేశ పౌరులకు ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం వర్ధిల్లాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

బీఆర్ఎస్‌లోకి ఒరిస్సా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్..?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి గిరిధర్ గమాంగ్ బీఆర్ఎస్‌లో చేరనున్నారని తెలిసింది. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం వరకూ బీజేపీలో కొనసాగిన ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. గతంలో కాంగ్రెస్ తరపున ఆయన ఒరిస్సాకు సీఎంగా సేవలందించారు. 1998లో ఎంపీగా ఉన్న ఆయన ఓటుతోనే అప్పటి వాజ్‌పేయ్ సర్కారు కూలిపోయింది.

పోలవరం ఎఫ్ఆర్ఎల్‌పై సంయుక్త సర్వే

- సీడబ్ల్యూసీ అంగీకారం
- ఢిల్లీ ఉన్నతస్థాయి భేటీలో నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం కొన్నేండ్లుగా అడుగుతున్న పోలవరం పుల్ రివర్ లెవెల్(ఎఫ్ఆర్ఎల్) ముంపు ప్రాంతాల సంయుక్త సర్వేకు కేంద్రం జల సంఘం అంగీకరించింది. ఇంతకు ముందు సమావేశాల్లో భద్రాచలంలోని ఏనిమిది అవుట్ ఫాల్ తూముల విషయంలో కూడా తెలంగాణ చూపించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని సంయుక్త సర్వే నిర్వహణకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కేంద్ర జల సంఘం చైర్మెన్ కుష్విందర్ వోరా అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్యలపై అంతర్రాష్ట్ర సమావేశం కేంద్ర జల సంఘం కార్యాలయంలో జరిగింది. దీనికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి, పోలవరం చీఫ్ ఇంజినీర్ సుధాకర్ , తెలంగాణ నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేంద్రరావు, చీఫ్ ఇంజినీర్ కొత్తగూడెం శ్రీనివాస్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ఇంటర్ స్టేట్ గోదావరి డైరెక్టర్ సుబ్రమణ్యప్రసాద్ , ఒడిశా రాష్ట్రం నుంచి ఇంజినీర్ ఇన్ చీఫ్ అశుతోష్‌దాస్ పాల్గొన్నారు. అలాగే కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీ అధికారులు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో అసలు ముంపు ప్రాంతాలు లేవంటూ, ఉంటే అందుకు తగిన ఆధారాలు చూపించాలని గతంలో అటు ఏపీ డిమాండ్ చేయగా, ఇటు సీడబ్ల్యూసీ సైతం చెప్పింది. ఈ సమావేశంలో తెలంగాణ అధికారులు వాటికి సంబంధించిన అన్ని ఆధారాలను కేంద్ర జలసంఘం చైర్మెన్‌కు సమర్పించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు, భద్రాచలం మండలాల్లోని ఆరు గ్రామాల్లో 899 ఎకరాల భూమి ముంపు పరిధిలోకి వస్తుందని సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లలో మార్క్ చేసి చూపించడం జరిగింది. దీనికి ఆంధ్రప్రదేశ్ సహకరించాలని కోరారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు గతంలో పోలవరం ప్రాజెక్ట్‌లో ఎఫ్ఆర్ఎల్ వద్ద నీరు నిల్వ ఉన్నప్పుడు ముర్రేడు, కిన్నెరసాని వాగుల నీటి ప్రవాహాలపై ఉండే ప్రభావాలను అంచనా వేయాలని ఆదేశించడం జరిగింది. ఆ మేరకు ఈ రెండు వాగులపై జాయింట్ సర్వే జరిపి ముంపు ప్రభావం ఉందని గుర్తించడం జరిగింది. ఆ ప్రభావిత ప్రాంతాలను డిమార్కేట్ తక్షణమే చేయాలనీ, ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సూచించారు. అదనంగా మొదటి దశలో మరో ఆరు పెద్దవాగులపై ఇలాంటి ప్రక్రియ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కు సూచించడం జరిగింది. ఈ సర్వేలన్ని పీపీఏ ఆధ్వర్యంలో జరగాలని సీడబ్ల్యూసీ ఆదేశించింది. మణుగూరు భార జల ప్లాంట్, భద్రాచలం రామాలయం పరిసర ప్రాంతాల్లో కూడా సర్వే చేసి ముంపు ప్రమాదానికి గురి అయ్యే ప్రాంతాలను గుర్తించాలని సీబ్లూసీ ఆంధ్రప్రదేశ్ కు సూచించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకం కాదనీ, కాగా పోలవరం ప్రాజెక్టు మూలానా ఉత్పన్నమయ్యే సమస్యలను అధ్యయనం చేసి తగిన రక్షణ చర్యలు చేపట్టమని మాత్రమే కోరుతున్నదని ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేంద్ర రావు అన్నారు.

ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Edelweiss — Ideas create, values protect

రిజిస్టర్డు ఆఫీసు: టవర్ 3, వింగ్ 'బి', కొహినూర్ సిటీ మాల్, కొహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా(వెస్ట్), ముంబయి-400070
రీజనల్ ఆఫీసు చిరునామా: నెం.7-1-24/బిల్డి/101 నుండి 104, 4వ అంతస్తు, రొక్కనా టవర్స్, బ్లాక్-బి, గ్రీన్‌ల్యాండ్ సర్కిల్, బేగంపేట, హైదరాబాద్-500016

SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దిగువ రుణగ్రహీతలు ఇహెచ్ఎఫ్ఎల్ నుండి వారు పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు & వడ్డీని తిరిగిచెల్లించుటలో డిఫాల్ట్ చెందియున్నారు మరియు సదరు రుణ ఖాతాలు నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారి చివరగా తెలిసిన చిరునామాలకు ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేసి చట్టం)లోని సెక్షన్ 13(2)క్రింద వారికి డిమాండ్ నోటీసు జారీచేయబడినది. సదరు డిమాండు నోటీసుకు అదనంగా, వారికి ఈ పబ్లిక్ నోటీసు రూపంలో తెలియజేయబడుతున్నది. రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బాకీపడిన బకాయిలు, సెక్షన్ 13(2) క్రింద పంపబడిన డిమాండ్ నోటీసు మరియు క్లెయిం చేసిన మొత్తాల వివరాలు దిగువ ఇవ్వబడినవి.

1. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు& చిరునామా మరియు రుణ మొత్తం :
సురేష్ కుమార్ కొడిరాము (రుణగ్రహీత), కొడిరాము స్వర్ణ లత (సహ-రుణగ్రహీత), ఇ.నెం.13-14-98/901 పి & టి కాలనీ, కోదండ రాము నగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500036
LAN నెం: LHYDLAP000048758 రుణ ఒప్పందం తేది: 22-05-2018
డిమాండ్ నోటీసు తేది: 19.01.2023 ఎన్‌పిఏ తేది: 04-04-2023
రుణ మొత్తం: రూ. 18,60,000/- (రూపాయలు పద్దెనిమిది లక్షల అరవైవేలు మాత్రమే)
మొత్తం బకాయి: రూ.11,13,266.51/- (రూపాయలు పదకొండు లక్షల పదమూడువేల రెండు వందలఅరవైఆరు & యాభైఒక పైసలు మాత్రమే).

సెక్యూర్డు అసెట్ యొక్క వివరాలు: ఆస్తియొక్క షెడ్యూలు: రావు ప్లాజా, పి&టి కాలనీ, గడ్డిఅన్నారం, సరూర్‌నగర్, హైదరాబాద్-500060 వద్దగల సర్వేనెం.222, 223, 225, 258, 256&257, ప్లాట్ నెం.88, ఇ.నెం.14-90వద్దగల 300చ.గ.లకుగాను 25.08చ.మీ.లకు సమానమైన 30.00చ.గ.ల విస్తీర్ణపు స్థలపు విభజించబడని భాగంతోసహా 80.00చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియాతోసహా 1147.00చ.అ.ల ప్లింత్ ఏరియాగల ఇ.నెం.13-14-98/301, 3వ అంతస్తు, ఫ్లాట్ నెం.301గల ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.80, పడమర: 30' వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.87, దక్షిణం: ప్లాట్ నెం.89.

రుణగ్రహీతలైన మీరు ఈ ప్రకటన తేది నుండి 60 రోజుల్లోగా పైన పేర్కొన్నట్లు పూర్తిగా బాకీపడిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన విషయంలో, క్రింది సంతకందారు పైన పేర్కొన్న సెక్యూరిటీస్ ఎన్‌ఫోర్స్‌కు సర్ఫేసి చట్టంక్రింద చర్యలు ప్రారంభిస్తారు. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం దయచేసి గమనించగలరు, మా అనుమతిలేనిదే మీరు అమ్మకం, లీజు లేదా ఇతర రూపాల ద్వారా పైన పేర్కొన్న సెక్యూరిటీస్‌ను బదిలీచేయలేరు.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ
తేది: 26-01-2023
సం/- అధీకృత అధికారి
ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola

కార్పోరేట్ ఆఫీసు: 1వ అంతస్తు, 'దేర్ హౌజ్', నెం.2, ఎన్.ఎస్.సి బోస్ రోడ్, చెన్నై-600 001.
బ్రాంచి ఆఫీస్ : 102, 1వ అంతస్తు, మహేంద్ర టవర్స్, 7-1-59/2,59/6, హైదరాబాద్ - 500016
బ్రాంచ్ చిరునామా: సర్వే నెం.13పి, 14 & 108, 2వ అంతస్తు, ఎమ్‌హెచ్‌బి కాలనీ, పోతిరెడ్డిపల్లి, సంగారెడ్డి, టిఎస్-502295.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసు

మీరు దిగువ పేర్కొన్న రుణగ్రహీత/తాకట్టుదారునకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మీపై ప్రొసీడింగ్స్‌ను కంపెనీ ప్రారంభించింది మరియు రుణగ్రహీత/ల కొరకు రిజిస్టర్డు పోస్టు అక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద మీకు పంపబడిన నోటీసు చేరకుండానే వెనుదిరిగింది. కావున, మిమ్మల్ని కోరడమేమనగా ఈ ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోపు వడ్డీతో సదరు ఖాతాపై పేర్కొన్న బాకీపడిన రుణం మొత్తాలను చెల్లించుటకు నోటీసు స్వీకరించగలరు, విఫలం చెందిన విషయంలో, వడ్డీ మరియు ఖర్చులతో దీని బకాయిలను రాబట్టుటకు దిగువ పేర్కొన్న సెక్యూరిటీ ఎన్‌ఫోర్సింగ్ ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్(4) క్రింద దీని హక్కును వినియోగించుట ద్వారా మీ పైన కంపెనీ చర్యలను ప్రారంభించును. కంపెనీకి అందుబాటులోఉన్న ఏదేని ఇతర రెమెడీకు దురభిప్రాయం లేకుండా ఈ నోటీసు పంపబడినదని పేర్కొనడం అవసరం.

క్ర.సం.	రుణ ఖాతా నెం. & రుణగ్రహీత/ల పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	బాకీపడిన మొత్తం
1	రుణ ఖాతా నెం.లు X0HEHYD00002270522 డిమాండ్ నోటీసు తేది: 10.01.2023 1) వినయ్ కుమార్ వేదాంతం (తండ్రి వి.ప్రభాకర్) (దరఖాస్తుదారు),2) వేదాంతం లత (భర్త వి.ప్రభాకర్), (సహ-దరఖాస్తుదారు), 3) శ్రీ వెంకటేశ్వర కిరణా జనరల్ స్టోర్స్ (సహ-దరఖాస్తుదారు) అందరి నివాసం: ఇ.నెం.4-55, ఆర్‌టిసి కాలనీ, చెంగిచెర్ల గ్రామం, బోడుప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500092	Rs. 18,00,000/-	04-01-2023 నాటికి రూ.20,53,499.00/- దానిపై వడ్డీతోసహా
	ఆస్తుల షెడ్యూలు: చెంగిచెర్ల గ్రామం & జిపి, ఘట్‌కేసర్ మండలం, రంగారెడ్డి జిల్లా వద్దగల సర్వే నెం.60, 69/1, 69/2, 66/1, 67, 68 మరియు 70లోని ఆర్‌సిసి గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 500చ.అ.లతో 133చ.గ.లు లేదా 111.46 చ.మీ.ల విస్తీర్ణపు స్థలంతో ప్లాట్ నెం.55, ఇంటి నెం.4-55 మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: 40 వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.56, తూర్పు: 30' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.84.		
2	రుణ ఖాతా నెం.లు X0HESRE00003419230 డిమాండ్ నోటీసు తేది: 14.01.2023 1) కమ్మరి మల్లికార్జున్ (తండ్రి కమ్మరి బ్రహ్మయ్య) (దరఖాస్తుదారు),2) కమ్మరి మంగల (భర్త కమ్మరి మల్లికార్జున్) (సహ-దరఖాస్తుదారు), 3) శ్రీ సద్గురు ఫుడ్ వర్క్స్ (సహ-దరఖాస్తుదారు) అందరి నివాసం: 12-80/43/3, శ్రీసాయి నగర్ కాలనీ, రోడ్ నెం.13, రాజంపేట్, ఓంశాంతి బిల్డింగ్ దగ్గర, మల్కాపూర్ చింతల్, సంగారెడ్డి, తెలంగాణ-502001.	Rs. 46,00,000/-	13-01-2023 నాటికి రూ.44,77,362.00/- దానిపై వడ్డీతోసహా
	ఆస్తుల షెడ్యూలు: సాయినగర్‌కాలనీ, మల్కాపూర్‌గ్రామం & గ్రామపంచాయతీ, కొండపూర్ మండలం, మెదక్ జిల్లా, తెలంగాణ వద్దగల 184చ.గ.ల విస్తీర్ణపు ఏరియాతో సర్వే నెం.224/1& 225లోని ఓపెన్ ప్లాట్ నెం.281/నార్తర్న్ పార్ట్ మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.283, దక్షిణం: ప్లాట్ నెం.281 పార్ట్, తూర్పు: జెడ్.పి.రోడ్ సంగారెడ్డి నుండి మల్కాపూర్, పడమర: ప్లాట్ నెం.280/పార్ట్.		

తేది: 26-01-2023
ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్.

వియస్‌టి ఇండస్ట్రీస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: ఆజామాబాద్, హైదరాబాద్ - 500 020.
Phone: 91-40-27688000; Fax:91-40-27615336;
CIN: L29150TG1930PLC000576, Email:investors@vstind.com, website: www.vsthyd.com

31 డిసెంబర్ 2022 తో ముగిసిన మూడు నెలలు మరియు తొమ్మిది నెలల కాలానికి ఆడిట్ కాని ఆర్థిక ఫలితాలు యొక్క సారాంశము

(₹ లక్షలలో)

క్ర సం.	వివరములు	ముగిసిన ప్రస్తుత 3 నెలలు 31-12-2022 (ఆడిట్ చేయనివి)	ముగిసిన ప్రస్తుత కాలం కొరకు సంవత్సరం నుండి తేదీకి సంఖ్యలు 31-12-2022 (ఆడిట్ చేయనివి)	ముగిసిన క్రితం ఈ కాలపు 3 నెలలు 31-12-2021 (ఆడిట్ చేయనివి)
1ఎ	కార్యాకలాపాల నుండి మొత్తం ఆదాయం	44193	128341	43148
1బి	ఇతర ఆదాయం	1602	6034	970
	మొత్తం ఆదాయం	45795	134375	44118
2	కాలానికి నికర లాభం (పన్ను, మినహాయింపదగిన మరియు అసాధారణ ఐటంలకు ముందు)	10330	33914	11099
3	కాలానికి నికర లాభం పన్నుకు ముందు (మినహాయింపదగిన మరియు అసాధారణ ఐటంలకు తరువాత)	10330	33914	11099
4	కాలానికి నికర లాభం పన్నుకు తరువాత (మినహాయింపదగిన మరియు అసాధారణ ఐటంలకు తరువాత)	7898	25828	8272
5	కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి లాభం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) కలిగి ఉంది]	8010	25821	8270
6	ఈక్విటీ వాటా మూలధనం	1544	1544	1544
7	రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా)			
8	ప్రతి వాటా ఆర్జనలు (ఇపిఎస్) (ఒక్కొక్కటి ₹ 10/-) (వార్షికం కానిది) ఎ) బేసిక్ మరియు డైల్యూటెడ్ ఇపిఎస్ అసాధారణ ఐటంలకు ముందు బి) బేసిక్ మరియు డైల్యూటెడ్ ఇపిఎస్ అసాధారణ ఐటంల తరువాత	51.15 51.15	167.26 167.26	53.56 53.56

సూచన :

1. పైన తెలిపిన ఫలితాలు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్‌ఎక్స్చేంజీలతో దాఖలు చేసిన 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలం కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనా యొక్క సారాంశం. 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలం కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్చేంజ్ వెబ్‌సైట్‌లు (www.bseindia.com, www.nseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్ (www.vsthyd.com) లలో అందుబాటులో ఉన్నవి.
2. సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ అవసరాలు) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 ప్రకారం పైన పేర్కొన్న ఫలితాలు సంస్థాగత ఆడిటర్లచే పరిమిత సమీక్ష చేపట్టబడినవి, వారు దానిపై ఎటువంటి ఆక్షేపణలు లేని నివేదికను జారీ చేసినారు.

వియస్‌టి ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొరకు
సం/-
ఆదిత్య దేవ్ గుప్తు
మేనేజింగ్ డైరెక్టర్
DIN : 07849104

స్థలం : హైదరాబాద్
తేది : 25 జనవరి, 2023

Indian Bank — BANKING THAT'S # TWICE AS GOOD

ZO ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ 3-6-365, 4వ అంతస్తు, లిబర్టీ ప్లాజా, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

అమ్మకం ప్రకటన (ఇ-వేలం)

ఇండియన బ్యాంక్, జోనల్ ఆఫీస్ నుండి "ఎక్కడ ఎలా వున్నది అక్కడే ఉన్న స్థితిలో" వోల్క్స్‌వాగన్ వెంటో-01 నెం., మారుతి స్విఫ్ట్ డిజైర్ -04 నెం. & మారుతి స్విఫ్ట్-02 నెం. మొత్తం 07 కార్లు అమ్మకం. చివరి తేది: 09-02-2023. పూర్తి వివరముల కొరకు దయచేసి బ్యాంక్ వెబ్‌సైట్ www.indianbank.in/tenders/ ను సందర్శించగలరు.

సం/- అసిస్టెంట్ జోనల్ మేనేజర్

ఫారం ఏ
బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (వాలెంటరీ లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2017 యొక్క రెగ్యులేషన్ 14)

పిఎస్‌జి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వాటాదారులు శ్రద్ధ వహించుట కొరకు

1.	కార్పొరేట్ పర్సన్ పేరు	పిఎస్‌జి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ పర్సన్ యొక్క ఇన్‌కార్పొరేషన్ తేది	23/01/2012
3.	ఇన్‌కార్పొరేటెడ్/ రిజిస్టర్డు చేయబడిన కార్పొరేట్ పర్సన్ క్రింది అథారిటీ	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, హైదరాబాద్
4.	కార్పొరేట్ పర్సన్ యొక్క కార్పొరేట్ గుర్తింపు నెంబరు/లిమిటెడ్ లయబిలిటీ గుర్తింపు నెంబరు	U40300TG2012PTC078704
5.	కార్పొరేట్ పర్సన్ యొక్క నమోదిత కార్యాలయం చిరునామా & ప్రధాన కార్యాలయం చిరునామా	ఫ్లాట్ నెం.801, 8వ అంతస్తు, విఎస్ఎస్ నందదీప్ మేడ్చల్ ఆర్‌టిఓ ఆఫీస్ దగ్గర, కొంపల్లి రోడ్, మేడ్చల్ జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-500067, ఇండియా
6.	కార్పొరేట్ పర్సన్ యొక్క లిక్విడేషన్ ప్రారంభ తేది	23/01/2023
7.	లిక్విడేటర్ యొక్క పేరు, చిరునామా, ఇమెయిల్ అడ్రస్, టెలిఫోన్ నెంబరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	పేరు: శ్రీ.సుమన్ కుమార్ వర్మ, చిరునామా: ఆర్‌జెడ్-26ఏ/205బి, లేన్‌నెం.10, ఇంద్రపార్క్, పాలం కాలనీ, న్యూఢిల్లీ-110045 Email: ipskverma@gmail.com Mobile: 9968008789 Reg. No.: IBBI/IPA-003/00342/2021-2022/13657
8.	క్లెయింలు దాఖలు చేయుటకు ఆఖరి తేది	22/02/2023

ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమేమనగా 23.01.2023న పిఎస్‌జి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వాలెంటరీ లిక్విడేషన్ ప్రారంభమైనది.

పిఎస్‌జి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క వాటాదారులను వారి క్లెయింల ధృవీకరణలను 22.02.2023న లేదా ముందుగా నిర్దిష్ట రూపంలో ఐటం నెం.7 ఎదురుగా పేర్కొన్న చిరునామాలో లిక్విడేటర్‌కు దాఖలు చేయవలెనని తెలియజేయడమైనది.

ఫైనాన్షియల్ క్రెడిటర్లు రుజువులతో వారి క్లెయింలను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే దాఖలుచేయాలి. అందరు ఇతర క్రెడిటర్లు రుజువులతో క్లెయింలను నేరుగా, పోస్టు ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా దాఖలుచేయాలి. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించు క్లెయింలు దాఖలుచేసినచో జరిమానా విధించబడును.

సం/-
సుమన్ కుమార్ వర్మ,
లిక్విడేటర్, పిఎస్‌జి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్
Reg.No.: IBBI/IPA-003/00342/2021-2022/13657

తేది: 26-01-2023
ప్రదేశం: హైదరాబాద్

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్

SIGACHI

229/1 & 90, కళ్యాణ్స్ తులసీరామ్ ఛాంబర్స్, మదీనగూడ, హైదరాబాద్, తెలంగాణ- 500 049. సిఐఎన్ : యు24110టిజి1989పిఎల్‌సి009497

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యొక్క 3వ అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహణ తేది:04-02-2023, శనివారం, గం.11-00కు సంబంధించి తేది:19-01-2023న ప్రకటించిన మొదటి సవరణ ప్రకటన యొక్క వివరణాత్మక స్టేట్‌మెంట్ తేది:10-01-2023కు కొనసాగింపుగా 2వ సవరణ ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా తేది:10-01-2023న ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కంపెనీ యొక్క అసాధారణ సర్వసభ్య సమావేశం శనివారం, 4,ఫిబ్రవరి,2023 తేదీన ఉదయం గం.11-00నిమిషాలకు వీడియో కాన్ఫరెన్స్ (విసి)/ దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా నిర్వహించనున్నారు. ఈ యొక్క ప్రకటనకు కొనసాగింపుగా మొదటి సవరణ ప్రకటన జారీ చేయబడింది మరియు తేది:10-01-2023తో కూడిన వివరణాత్మక స్టేట్‌మెంట్‌ను కంపెనీ యొక్క వెబ్‌సైట్‌పై, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మరియు బిఎస్ఇ లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్‌పై పొందుపర్చబడింది మరియు కంపెనీ యొక్క వాటాదారులందరికీ 18-01-2023 తేదీన మెయిల్ చేయబడింది.

ఎన్ఎస్ఇ వారు కంపెనీ వారికి లేఖ 23-01-2023 ప్రకారం సలహా ఇవ్వడం జరిగింది, దీని ప్రకారం టైమ్‌లైన్ వినియోగం కోసం వర్కింగ్ క్యాపిటల్ వినియోగం కోసం అవసరమైన అంశాలకు సంబంధించి & దీనికి సంబంధించి సవరణ జారీ చేయవలెనది.

నిధులను ముట్టిన తేదీ నుంచి టెన్‌టేటివ్ టైమ్‌లైన్ ప్రకారం నిధుల వినియోగం కల్పించనున్నారు. క్రమ సంఖ్య 4కు సంబంధించి వర్కింగ్ క్యాపిటల్ మరియు క్రమ సంఖ్య 5-జనరల్ కార్పొరేషన్ ఉద్దేశాల కోసం, ఐటెమ్ నెం.2(ఎ)(1) ప్రకారం 1.ప్రిఫరెన్షియల్ ఇష్యూ యొక్క ప్రయోజనాలు/ఆఫర్ యొక్క వివరాలను"అనే శీర్షికపై పొందుపర్చబడినవి. పేజీ నెం.2లోని టేబుల్ వద్ద 1వ సవరణ ద్వారా దిగువ వివరాలు పొందుపర్చబడినవి.

ఐటెం నెం.2ఎ (1) :

1. ప్రిఫరెన్షియల్ ఇష్యూ యొక్క ప్రయోజనాలు/ ఆఫర్ వివరాలు

క్ర. సం.	నిధులను పెంచాల్సిన లక్ష్యం మరియు సదరు ప్రతిపాదన యొక్క ఇష్యూ	ప్రతి లక్ష్యం కోసం ఉద్దేశించబడిన నిధులను ఖర్చు చేయడం (రూ.కోట్లలో)	నిధులను పొందిన తేదీ నుండి వినియోగించాల్సిన కాలపరిమితి యొక్క టెన్‌టేటివ్ టైమ్‌లైన్స్
4	వర్కింగ్ క్యాపిటల్	30.00	2 సంవత్సరాలు
5	సాధారణ కార్పొరేట్ ఉద్దేశాలు	25.00	2 సంవత్సరాలు

ఇజిఎం వివరణాత్మక నోటీసులో మరియు మొదటి సవరణలో పొందుపర్చిన మిగతా అన్ని వివరాల్లో ఎలాంటి మార్పులేదని తెలియజేయనైనది.

సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొరకు
సం/-
శ్రేయా మిత్రా
కంపెనీ సెక్రెటరీ & కాంప్లియన్స్ అధికారి

ప్రదేశం: హైదరాబాద్
తేది:25-01-2023

CORRIGENDUM TO THE DRAFT LETTER OF OFFER FOR THE ATTENTION OF THE PUBLIC SHAREHOLDERS OF

NUTRICIRCLE LIMITED

CIN: L18100TG1993PLC015901
REGISTERED OFFICE: 5-8-272, Flat No. 201, Ayesha Residency, Opp. City Convention Centre, Public Garden Road, Nampally, Hyderabad, Telangana - 500001
TEL NO.: 9030528805; Email: nutricirclelimited@gmail.com; Website: www.nutricircle.biz

OPEN OFFER FOR ACQUISITION OF UP TO 70,663 (SEVENTY THOUSAND SIX HUNDRED SIXTY-THREE) FULLY PAID-UP EQUITY SHARES OF FACE VALUE OF RS. 10/- (RUPEES TEN ONLY) EACH ("EQUITY SHARES"), REPRESENTING 26.00% (TWENTY-SIX PERCENTAGE) OF THE VOTING SHARE CAPITAL OF NUTRICIRCLE LIMITED (THE "TARGET COMPANY"), FROM THE PUBLIC SHAREHOLDERS OF THE TARGET COMPANY ("OFFER"/" OPEN OFFER") BY HITESH MOHANLAL PATEL ("ACQUIRER") ALONG WITH BHAVNA HITESH PATEL ("PAC 1"), DIMPLE VIPUL PATEL ("PAC 2"), VIPUL MOHANLAL PATEL ("PAC 3"), VAISHALI VIJAY PATEL ("PAC 4") AND VIJAY JEEVAN PATEL ("PAC 5") (HEREINAFTER "PAC 1", "PAC 2", "PAC 3", "PAC 4" AND "PAC 5" COLLECTIVELY REFERRED TO AS "PACS")

This corrigendum to the DLOF (as defined below) (**"Corrigendum"**) is being issued by Fedex Securities Private Limited, the Manager to the Open Offer (**"Manager to the Offer"** or **"Manager"**), for and on behalf of the Acquirer in respect of the Open Offer to the Public Shareholders pursuant to and in compliance with applicable provisions under the Securities and Exchange Board of India (Substantial Acquisition of Shares and Takeovers) Regulations, 2011 and subsequent amendments thereto (**"SEBI (SAST) Regulations"**). This Corrigendum should be read in continuation of, and in conjunction with the Public Announcement (**"PA"**) dated January 04, 2023 and Detailed Public Statement (**"DPS"**) which was published on January 11, 2023 in Business Standard Newspaper (English - All Editions), Nava Telangana Newspaper (Hyderabad Edition), Navshakti Newspaper (Mumbai Edition) and Business Standard Newspaper (Hindi - All Editions) in relation to the Offer and Draft Letter of Offer filed with SEBI, Stock Exchange and the Target Company on January 18, 2023. Capitalised terms used in this Corrigendum have the meaning assigned to them in the PA, DPS and DLOF.

The Public Shareholders are requested to take note that **Part 4.7.1 (Other disclosure of Acquirer and PACs)** of the DLOF, shall be read as follows:

In the past, non-compliance / delayed compliances have been observed on the part of the Acquirer and PACs of the Target Company, with respect to compliance with the applicable provisions of Chapter V of SEBI (SAST) Regulations, 2011 and Securities and Exchange Board of India (Prohibition of Insider Trading) Regulations, 2015.

Regulations	Financial year	Due date of Compliance**	Actual date of Compliance	Delay / Non-Filing	Comments
29(2) of the SEBI (SAST) Regulations, 2011	2012-13, 2013-14	Not Filed*	Not Filed*	Not Filed*	Acquirer along with PACs had acquired the Equity shares of the Target Company in a series of transactions for the financial years. *The proof of submission is not available with Acquirer and PACs and those disclosures are also not being disseminated on the BSE website, hence it is not ascertainable to verify the submission thereof.
	2013-14	Not Filed*	Not Filed*	Not Filed*	
	2014-15	Not Filed*	Not Filed*	Not Filed*	
	2017-18	Not Filed	Not Filed	Not filed	Dimple Vipul Patel had acquired the Equity shares of the Target Company in a series of the transaction as mentioned below (Refer to Note 1)
	2018-19	July 25, 2018	August 20, 2018	26 days	Bhavna Hitesh Patel acquired the Equity shares of the Target Company in a series of the transaction as mentioned below (Refer to Note 2)
		July 26, 2018	August 20, 2018	25 days	
		July 27, 2018	August 20, 2018	24 days	
		June 27, 2018	January 19, 2023	1668 days	Dimple Vipul Patel had acquired the Equity shares of the Target Company in a series of the transaction as mentioned below (Refer to Note 2). Dimple Vipul Patel has undertaken to make the necessary disclosure.
	2020-21	July 08, 2020	January 19, 2023	925 days	Acquirer along with PACs had acquired the Equity shares of the Target Company as mentioned below (Refer to note 3). Acquirer and PACs have undertaken to make the necessary disclosure.
		July 13, 2020	January 19, 2023	920 days	
		July 15, 2020	January 19, 2023	918 days	
	2021-22	April 28, 2021	January 19, 2023	631 days	Acquirer along with some PACs had acquired the Equity shares of the Target Company as mentioned below (Refer to note 4) Acquirer and PACs have undertaken to make the necessary disclosure.
		August 12, 2021	January 19, 2023	525 days	
Reg 30 (1)	2018-19, 2019-20, 2020-21	Not Filed	Not Filed	Not filed	Acquirer along with PACs together holds Equity Shares of more than twenty-five or more voting rights in the Target Company

** The date of the transaction is a based on demat statements to the extent available.

Note 1:

Name	Date of Acquisition	Pre-Holding of Equity shares		Acquisition of Equity Shares		Post Holding of Equity shares		Collectively holding of Acquirer along with PAC	
		Equity	%	Equity	%	Equity	%	Equity	%
Collectively holding of Acquirer along with PACs								16897	6.22
Dimple Vipul Patel		6786	2.5	NA	NA	NA	NA		
	November 28, 2017	6786	2.5	28107	10.34	34893	12.84		
	December 06, 2017	34893	12.84	10050	3.70	44943	16.54		
Collectively post-holding after Acquisition by the Acquirer along with PACs								55054	20.26

Note 2: 2018-19

Name	Date of Acquisition	Pre-Holding of Equity shares		Acquisition of Equity Shares		Post Holding of Equity shares		Collectively holding of Acquirer along with PAC	
		Equity	%	Equity	%	Equity	%	Equity	%
Collectively holding of Acquirer along with PACs								55054	20.26
Dimple Vipul Patel		44951	16.54	NA	NA	NA	NA		
Dimple Vipul Patel	June 25, 2018	44951	16.54	1662	0.61	46613	17.15		
Dimple Vipul Patel	June 25, 2018	46613	17.15	6197	2.28	52810	19.43		
Collectively post-holding after Acquisition by the Acquirer along with PACs								86124	31.69

Note 3: 2020-21

Name	Date of Acquisition	Pre-Holding of Equity shares of the Acquirer along with PACs		Acquisition of Equity Shares by the Acquirer or PACs		Post Holding of Equity shares of Acquirer along with PACs		Collectively holding of Acquirer along with PAC	
Collectively holding of Acquirer along with PACs								85624	31.50
Hitesh Mohanlal Patel		77	0.03	NA	NA	NA	NA		
Hitesh Mohanlal Patel	July 06, 2020	77	0.03	5524	2.03	5601	2.06		
Hitesh Mohanlal Patel	July 08, 2020	5601	2.06	3640	1.34	9241	3.40		
Hitesh Mohanlal Patel	July 09, 2020	9241	3.40	1000	0.37	10241	3.77		
Dimple Vipul Patel	July 09, 2020	52310	19.24	2500	0.92	54810	20.17		
Vipul Mohanlal Patel	July 13, 2020	4147	1.53	23,597	8.68	27744	10.21		
Vijay Jeevan Patel	July 14, 2020	3379	1.24	(150)	(0.06)	3229	1.19		
Bhavna Hitesh Patel	July 17, 2020	25711	9.46	24	0.01	25735	9.47		
Hitesh Mohanlal Patel	November 11, 2020	10241	3.77	300	0.11	10541	3.88		
Hitesh Mohanlal Patel	March 22, 2021	10541	3.88	38	0.01	10579	3.89		
Hitesh Mohanlal Patel	March 22, 2021	10579	3.89	(100)	(0.04)	10479	3.86		
Vipul Mohanlal Patel	March 26, 2021	27744	10.21	369	0.17	28113	10.38		
Dimple Vipul Patel	March 23, 2021	54810	20.16	135	0.05	54945	20.22		
Hitesh Mohanlal Patel	March 24, 2021	10479	3.86	(50)	(0.02)	10429	3.84		
Hitesh Mohanlal Patel	March 25, 2021	10429	3.84	(50)	(0.02)	10379	3.82		
Hitesh Mohanlal Patel	March 26, 2021	10379	3.82	(50)	(0.02)	10329	3.80		
Dimple Vipul Patel	March 31, 2021	54945	20.22	50	0.02	54995	20.24		
Collectively post-holding after Acquisition by the Acquirer along with PACs								122401	45.04

Note 4: 2021-22

Name	Date of Acquisition	Pre-Holding of Equity shares of the Acquirer along with PACs		Acquisition of Equity Shares by the Acquirer or PACs		Post Holding of Equity shares of Acquirer along with PACs		Collectively holding of Acquirer along with PAC	
Collectively holding of Acquirer along with PACs								122401	45.04
Hitesh Mohanlal Patel	April 7, 2021	10329	3.80	10	0.00	10339	3.80		
	April 8, 2021	10339	3.80%	5	0.00	10344	3.81		
	April 9, 2021	10344	3.81	117	0.04	10461	3.85%		
	April 22, 2021	10461	3.85	10	0.00	10471	3.85		
	April 26, 2021	10471	3.85	30	0.01	10501	3.86		
	June 8, 2021	10501	3.86	25	0.01	10526	3.87		
	June 8, 2021	10526	3.87	10	0.00	10536	3.87		
	August 6, 2021	10536	3.87	465	0.17	11001	4.05		
	August 9, 2021	11001	4.05 %	1200	0.44	12201	4.49		
	August 10, 2021	12201	4.49	1250	0.46	13451	4.95		
	August 10, 2021	13451	4.95	1250	0.46	14701	5.41		
	August 10, 2021	14701	5.41	100	0.04	14801	5.45		
Dimple Vipul Patel	April 09, 2021	54995	20.24	266	0.10	55261	20.34		
	June 25, 2021	55261	20.34	1000	0.37	56261	20.71		
	August 13, 2021	56261	20.71	841	0.31	57102	21.01		
Vipul Mohanlal Patel	April 30, 2021	28113	10.34	1300	0.48	29413	10.82		
	May 04, 2021	29413	10.82	1000	0.37	30413	11.19		
	May 05, 2021	30413	11.19	1300	0.48	31713	11.67		
	May 14, 2021	31913	11.67	300*	0.11	32013	11.78		
Collectively post-holding after Acquisition by the Acquirer along with PACs								130751	48.11

*including opening shares of 100

OTHER INFORMATION

1. Except as detailed in this Corrigendum, all other terms, conditions and contents of the Open Offer and the DPS remain unchanged. The aforementioned developments/ amendments have been incorporated in the DLOF/ LOF.
2. The Acquirer accepts full responsibility for the information contained in this Corrigendum (other than such information which has been obtained from the public sources or provided or relating to and confirmed by the Target Company), and undertakes that he is aware of his obligations under the SEBI (SAST) Regulations and undertakes to comply and fulfill the same.
3. This Corrigendum is expected to be available on the website of SEBI at www.sebi.gov.in. The Target Company (www.nutricircle.biz), the Manager to the Offer (www.fedsec.in) and BSE (www.bseindia.com). For further details, please refer to the Letter of Offer.

Issued on behalf of the Acquirers by the Manager to the Offer

FEDEX SECURITIES PRIVATE LIMITED
B 7, 3rd Floor, Jay Chambers, Dayaldas Road, Vile Parle (East), Mumbai - 400 057, Maharashtra, India
Tel No.: +91 81049 85249; **E-mail:** mb@fedsec.in;
Investor Grievance E-Mail: mb@fedsec.in; **Website:** www.fedsec.in
Contact Person: Saipan Sanghvi; **SEBI Registration Number:** INM000010163

Signature of the Acquirer

Sd/- Hitesh Mohanlal Patel	Sd/- Bhavna Hitesh Patel	Sd/- Dimple Vipul Patel
Sd/- Vipul Mohanlal Patel	Sd/- Vaishali Vijay Patel	Sd/- Vijay Jeevan Patel

Place: Mumbai
Date: January 25, 2023

డయాలసిస్ స్థలాన్ని పరిశీలించిన వైస్ చైర్మెన్ మాధవరెడ్డి

నవతెలంగాణ ఘట్కేసర్



ఘట్కేసర్ మున్సిపాలిటీలోని ప్రభుత్వం ఆస్పత్రిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న కిడ్నీ రోగుల డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందుపట్ల వెంకటరెడ్డి, బేతాళ నర్సింగ్‌రావు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యురాలు అబ్బగోని మీనాగౌడ్ కీసరగుట్ట ట్రస్టు బోర్డ్ కమిటీ సభ్యుడు మెరుగు నరేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బర్ల హరిశంకర్ ముదిరాజ్, పల్లె విజయ్‌గౌడ్, ఎండి సిరాజ్, కందకట్ల మాధవరెడ్డి, బానుక నవీన్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కొట్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు నియామకాల్లో అవకతవకలను సవరించాలి

నవతెలంగాణ - హస్తినాపురం



పోలీస్ నియమకాల్లో అవకతవకలను వెంటనే తొలగించి అర్హులైన వారికి పోలీస్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎల్.బి.నగర్ యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బి.యన్.రెడ్డి నగర్ చౌరస్తాలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షుడు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పు ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులందరినీ మెయిన్స్ పరీక్షకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కె.శివ కుమార్, వెంకటేష్, రుత్విక్‌రెడ్డి, శివ, గుణ, స్వామి, చిన్న గౌడ్, ఓం ప్రకాష్, చింటూ, విష్ణు, సాయి కృష్ణ, సందీప్, శశి, కార్తీక్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలను తొలగించిన రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం. 283లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను బుధవారం తెల్లవారుజామున జేసీబీల సహకారంతో రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య తొలగించారు. అనంతరం సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేదలు నాలుగు నెలల కింద గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, రెవెన్యూ అధికారులు పోలీసుల నిర్బంధంలో గుడిసెలను తొలగించడం దారుణమన్నారు. ఎలాంటి ఆధారాలు ఉండకూడదనే ఉద్దేశంతో ముందస్తుగానే తమ సెల్‌ఫోన్లు పోలీసులు



లాగేసుకున్నారన్నారు. సర్వేనెం. 283/44/45లో కోర్టు ఆర్డర్ ఉందంటూ కొంతమంది కాంపౌండ్ వాలు నిర్మించుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్నా, రెవెన్యూ అధికారులు కోర్టు ఆర్డర్‌ను ఎత్తివేయడానికి ప్రయత్నం చేయకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారుల ద్వంద్వ వైఖరిని వీడాలన్నారు. ఎన్నిసార్లు గుడిసెలు పీకేసినా మళ్లీ గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నర్సింహ్మ, నాయకులు గుండె శివకుమార్, గుడిసెవాసులు సురేష్, ప్రణయ్, కిరణ్, మైసయ్య, యాదయ్య, నాగరాజు, మహిళలు పారిజాత, రాణి, ప్రభావతి, విజయ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు : తహాశీల్దార్ అనితారెడ్డి

ప్రభుత్వం భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ అనితారెడ్డి హెచ్చరించారు. అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెం 283 లో కొందరు అక్రమంగా నిర్మాణాలను, గుడిసెలను వేయడంతో వాటిని తొలగించామని తెలిపారు.

దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని పాపాయిగూడ భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తామని, డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న దళారుల పట్ల గుడిసె వాసులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా వసూళ్లకు పాల్పడితే సీపీఐ నాయకులకు లేక స్థానిక పోలీసులకు ఆధారాలతో సహా సమాచారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు గుడిసె వాసులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలో గల పాపాయిగూడ సర్వే నెం. 215 నుండి 224లోని భూదాన్ భూముల్లో నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను ఇప్పించాలనే దృఢ సంకల్పంతో సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేశామన్నారు. భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్

గుడిసె వాసులకు సీపీఐ నాయకుల విజ్ఞప్తి



రెడ్డి, అతని అనుచరులు పాత తేదీల్లో పట్టాలు ఇచ్చినట్లుగా నకిలీ ప్రొసీడింగ్ పత్రాలను సృష్టించి అక్రమ మార్గంలో అమాయక ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయలకు భూములను విక్రయించి భూదందా చేస్తున్నారని వారు ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాటంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలను లక్ష్యంగా చేసుకొని ప్రతి గుడిసె వద్దకు వెళ్లి ఈ స్థలానికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను తాము ఇస్తామని అందుకుగాను తమకు వేల రూపాయల్లో డబ్బులు ఇవ్వాలని మభ్యపెడుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయం పట్ల గుడిసెవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ వసూళ్లను సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని, సుమారు రెండు దశాబ్దాలుగా భూదాన్ భూములకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, అంతకు ముందు యాభై సంవత్సరాల క్రితం నుండి ప్రభుత్వ రికార్డుల్లో సైతం భూధాన్ భూమిగా నమోదు చేయబడి ఉందన్నారు. ఈ భూదాన్ భూముల్లో తప్పుడు ఓఆర్‌సీ సంపాదించుకొని బోగస్ ప్రొసీడింగ్ పత్రాలు సృష్టించి అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. భూదాన్ భూములు నిరుపేద ఇళ్ల స్థలాలకు కేటాయించే వరకు పేద ప్రజలకు అండగా ఉంటామని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పేదలకు సీఎం సహాయ నిధితో ఎంతో మేలు

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవ తెలంగాణ- సరూర్ నగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో మేలు చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కి చెందిన ఎండి గౌస్ అనే వ్యక్తి కాళ్ల నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ డబ్బులకు ఇబ్బంది పడి స్థానిక నాయకులను సంప్రదించగా నిమ్స్‌లో చికిత్స కోసం మంత్రి సబితాఇంద్రారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లక్ష రూపాయలు ముందస్తు చెక్కు మంత్రి చేతులమీదుగా జిల్లెలగూడ క్యాంపు ఆఫీస్‌లో ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు ఎంఏ సాజీద్, రామిడి రాంరెడ్డి, కామేష్ రెడ్డి, బాలరాజ్, పవన్ యాదవ్, జంగయ్య యాదవ్, సాయినాథ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవ తెలంగాణ-సంతోష్ నగర్

దేశం, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కష్టాలు తెలిసిన ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలుచోట్ల కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న క్షౌరశాలలకు, లాండ్రీలకు, దోబీఘాట్లకు ఉచిత విద్యుత్ అందిస్తామని, గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని అమలు చేసేందుకు అధికారికంగా జీవో జారీ చేయడం పట్ల బీసీ వర్గానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా నాయిబ్రాహ్మణులకు, రజక వర్గానికి చెందిన వారికి నెలకు 250యూనిట్లు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు జీవోను జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎంఐఎం ఆక్టివ్ సభ్యులు, అధ్యక్షులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హోళ్లకు మరమ్మతులు

మొదలు పెట్టి మర్చిపోయారు?





నవ తెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ మజీద్ సమీపంలోని ముస్లిం సోదరులు నమాజ్‌కి వచ్చే వేళల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి అధికారులు మ్యాన్ హోళ్లకు మరమ్మతు పనులు మొదలు పెట్టి ఆ తర్వాత పూర్తి చేయకుండా మర్చిపోయారు. దీంతో ఇక్కడి వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఏ పని కూడా సరిగ్గా చేయడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నెలనెలా జీతాలు తీసుకుంటున్నా స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులు పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అనేకమంది ప్రాణత్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్లో గురుకుల కళాశాలలో జరిగిన జన జన మన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షులు, రాష్ట్ర ఎంపీపీల పోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, సీఐ అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మన దేశ స్వతంత్ర్యం కోసం లక్షల మంది ప్రాణాలు అర్పించారన్నారు. భారత రాజ్యాంగం నిర్మాణం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్.. తన కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా తన ప్రాణాలు పణంగా పెట్టి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మన రాజ్యాంగాన్ని నిర్మించారన్నారు. రాజ్యాంగం ఏర్పాటు చేసి దాదాపు 74 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మన భారతదేశం జనాభాలో యువత ఎక్కువగా ఉన్నారన్నారు. కానీ యువత చెడు అలవాట్లకు ధూమ పానాలకు అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. స్వామి వివేకానంద లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని, స్వామి వివేకానంద 39 సంవత్సరాలు బతికి ఈరోజు దేశ యువతకే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అలా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్ కృష్ణ, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్



నవ తెలంగాణ-ఉప్పల్

చిలకానగర్ డివిజన్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీతారామ కాలనీ ఎన్జీఆర్ఐ కాంపౌండ్ వాల్ నుండి రాఘవేంద్రనగర్ కాలనీ వినాయక టెంపుల్ వరకు నిర్మించిన స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్ పైన నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, రామానుజన్, అల్లిబిలీ మహేందర్, బింగి శ్రీనివాస్, బాణాల నారాయణరెడ్డి, రమేష్, ఫొటో బాలు, గూడూరు రమేష్, బాలు మహిళా నాయకులు షహనాజ్, సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపించాలి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు

నవ తెలంగాణ- సరూర్ నగర్

ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి చూపించాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ భాష్యం హైస్కూల్ విద్యార్థుల క్రీడా ఉత్సవాల ఫెస్టివల్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఇన్స్పెక్టర్ నాగమల్లు, జోనల్ ఇంచార్జ్ అంకమ్మరావు హాజరై క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల దశలోని క్రీడల్లో ఆసక్తి చూపించాలన్నారు. క్రీడలతో శారీరక శ్రమతోపాటు మానసిక ఉత్తేజం కలుగుతుందన్నారు. క్రీడలతో మంచి గుర్తింపుతోపాటు



రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం వస్తుందన్నారు. సమాజంలో మంచి గుర్తింపు కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటిలో డ్రయినేజీ నీళ్లు కలవకుండా చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి

నవ తెలంగాణ- సరూర్ నగర్

ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తీలో తాగే నీటిలో డ్రయినేజీ వాటర్ కలిసి కలుషితమైన నీళ్లు వస్తున్నాయని, స్థానిక ప్రజల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి వెంటనే బస్తీకి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక బస్తీ ప్రజల చేత సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదు చేయించారు. ఆ అధికారి కూడా సానుకూలంగా స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్, పగడాల శ్రీశైలం, విజయ్, జహంగీర్, జగదీష్, నగేష్, బస్తీవాసులు భాస్కర్ నాయక్, ప్రేమ్ నాయక్, హరి నాయక్, దశరథ



నాయక్, రవి నాయక్, బాలు నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్ పేట్

సర్పంచుల హక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి విమర్శించారు. బుధవారం తెలంగాణ పంచాయితీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల సమస్యలపై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల



నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతి చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటి, ఆఫీస్, ఉద్యోగం పనుల్లో బిజీగా ఉంటున్న మహిళలకు కాస్త మానసిక ఉల్లాసం ఉండేందుకు ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. పోటీల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు



అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ పంతంగి మాధవి, సంఘం అధ్యక్షుడు యాదగిరిరావు, కార్యదర్శి రమేష్, సాంస్కృతిక కార్యదర్శి సుభాషిణి, ప్రచార కార్యదర్శి రఘు వంశి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీ

నవ తెలంగాణ-సంతోష్ నగర్



మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఓల్డ్ మలక్ పేట డివిజన్ కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీ తెలిపారు. డివిజన్‌లో చేపట్టిన యూజీడీ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల్లో అధికారులతో సర్వే చేయించి అవసరమైన చోట్ల కొత్తగా డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్ ఆవరణలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా అన్ని రంగాల అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- రెండు ఇండ్లలో.. రెండు కార్యాలయాల్లో చోరీ
- మరో ఆరు ఇండ్లలో చోరీకి విఫలయత్నం
- సీసీ కెమెరాలో రికార్డైన ఇద్దరు దొంగల విజువల్స్

నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్‌లో బుధవారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు హల్ చల్ చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న చంద్రపురి కాలనీలో రెండు ఇండ్లలో, రెండు కార్యాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా పక్కన ఉన్న ఇండ్లకు గడియ పెట్టి మరీ వారి పని



కానిచ్చేశారు. అంతటితో ఆగకుండా మరో ఆరు ఇళ్లలో చోరీకి విఫలయత్నం చేశారు. సుమారు అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో దొంగలు చోరీకి వచ్చినట్లు సీసీ ఫుటేజ్ దృశ్యాలను బట్టి పోలీసులు చెబుతున్నారు. అయితే చెన్నైలో నివాసం ఉంటున్న వారి ఇంట్లో సుమారు ఎనిమిది లక్షల నగదుతోపాటు విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. కాగా దొంగలు ఇద్దరే ఉన్నారా? ఇంకెవరైనా పాల్గొన్నారా? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.



ఎల్బీనగర్‌ను అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఎమ్మెల్యేతో సమావేశమైన కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్
- కాలనీల సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌లోని పలుకాలనీలలో మౌళిక సదుపాయాల కొరత ఎక్కడ ఉందో గుర్తించి సమస్యలను పరిష్కరించేలా నివేదికలను కార్పొరేటర్ సమక్షంలో తయారు చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. డివిజన్లో రెండు రోజుల క్రితం మార్నింగ్ వాక్‌లో పర్యటించిన ఎమ్మెల్యేకు సరస్వతినగర్ కాలనీ, పిండి నారాయణరెడ్డి నగర్, భాగ్యనగర్ ఫేస్.1, భాగ్యనగర్ ఫేస్.2, నార్త్‌ఎక్స్టెన్షన్, శ్రీరామ అయోధ్యనగర్, తుల్జాభవానీనగర్, సత్యదేవ్ ఎంక్లేవ్ కాలనీల నుండి సమస్యలు పరిష్కరించాలని వినతులు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, కరెంట్, ఇతర అధికారులచే ఎమ్మెల్యే సమావేశమైన నేపథ్యంలో డివిజన్‌లో పర్యటించి త్వరలో నివేదిక ఇవ్వాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన చోట నూతన రోడ్లు, మంచినీటి పైప్‌లైన్స్, త్రీఫేస్ కరెంటు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాబోయే రోజుల్లో ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు ఆందోజ్ సత్యంచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరెడ్డి ఉదయ్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.శ్రీనివాస్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, దేరంగుల కృష్ణ, నారగోని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు కనకయ్య, కోటేశ్వరరావు, బలరాంరాజు, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు యాజమాన్య హక్కులు కల్పించాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

రక్షణ శాఖ ఏర్పాటు స్థలంలో ఏండ్ల తరబడి నివాసముంటున్న పేదలకు యాజమాన్య హక్కు కల్పించాలని కోరుతూ బుధవారం శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు సీతఊ, విలీన కమిటీ సభ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే జి.సాయన్న అసెంబ్లీలో ప్రస్తావించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎయిర్‌పోర్టు అథారిటీ స్థలాల్లో గత నాలుగు దశాబ్దా లుగా పేదలు నివాసం ఉంటున్నారని, వారికి భూ యాజమాన్య హక్కు కల్పించాలని అన్నారు.

అభివృద్ధి పనులతో.. జవహర్‌నగర్‌లో కొత్త కాంతులు



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రగతి పనులతో కార్పొరేషన్‌లో కొత్త కాంతులు సంతరించుకుందని, 30 ఏండ్ల నాటి సమస్యలకు 3 నెలల్లో శాశ్వతంగా పరిష్కారం దక్కిందంటే ఈ ఘనత మంత్రి మల్లారెడ్డికే దక్కుతుందని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్‌లోని ప్రగతి పనులకు రూ.31.50లక్షల నిధులను పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జవహర్‌నగర్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. శ్మశానవాటికల అభివృద్ధికి రూ. 20 లక్షలు, పబ్లిక్ టాయిలెట్‌ల కోసం రూ. 2 లక్షలు, రోడ్ల మరమత్తులకు రూ. 8.50 లక్షలు, ఓపెన్ నాలా అభివృద్ధి కోసం రూ. 1 లక్ష నిధులను కేటాయించామని, ప్రతి డివిజన్‌లో పనులు శరవేగంగా పూర్తవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలన



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గురువారం జరగనున్న గణతంత్ర దినోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు, అందరికీ అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట కలెక్టరేట్ ఆవరణలో 74వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ ఆవరణలో మొదటిసారిగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్నందున ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ విషయంలో జాతీయ పతాకావిష్కరణ మొదలుకొని... సభావేదిక, సభాస్థలి, ఆవరణలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అలాగే గణతంత్ర దినోత్సవానికి కలెక్టరేట్‌కు వచ్చే వీఐపీలు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలు, మీడియా ప్రతినిధులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటితో పాటు కుర్చీలు, టెంట్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించినట్టు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజల కోసం కూడా ప్రత్యేకంగా కుర్చీలు, షామియానాలు, విద్యుత్తు లైట్లు, తాగునీటి సదుపాయాలు కల్పించామని... కార్యక్రమానికి వచ్చేందుకు, వెళ్ళేందుకు వేర్వేరుగా దారులు ఏర్పాటు చేసి బ్యారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అనంతరం సభావేదిక అలంకరణతో పాటు ఆయా విషయాలను అధికారులతో చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి నీరజాగాంధీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి తనూజ, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్టూడెంట్ వీసాపై వచ్చి డ్రగ్స్ సరఫరా

- నైజీరియన్ అరెస్టు
- రూ.60వేల విలువగల కొకైన్ స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టూడెంట్ వీసాపై వచ్చి హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్‌ను హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్స్ మెంట్, బహద్దూర్‌పురా పోలీసులు కలిసి అరెస్టు చేశారు. నిందితుని నుంచి రూ.60వేల విలువగల ఐదు గ్రాముల కొకైన్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ చక్రవర్తి తెలిపిన వివరాల మేరకు నైజీరియాకు చెం దిన ఓజెంగ్వా ఇమ్మాన్యుయేల్ ఒసోండు స్టూడెంట్ వీసాపై 2016లో నైజీరియా నుంచి ముంబాయ్‌కి వచ్చాడు. సులు వుగా డబ్బులు సంపాదించాలని డ్రగ్స్ సప్లయ్ దారుడిగా మారాడు. తెలిసిన వారికి, కావాల్సిన వారికి డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వచ్చిన నిందితుడు డ్రగ్స్ సప్లయ్ చేసేందుకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్‌తోపాటు బహద్దూర్‌పురా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్‌లో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ నరసింహ యాదవ్‌తో కలిసి రూ. 42 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్‌లోని ఎల్.బి నగర్‌లో రూ. 21,50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు, అస్మత్ పేట్ ఎస్సీ బస్తీలో రూ. 20.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మెన్ నరేందర్‌గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మెన్ మన్నే ఉదయ్ యాదవ్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, వార్డ్ మెంబర్ ఎం నర్సింగ్ రావు, డివిజన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్ బాయ్, హరినాథ్, జీహెచ్ఎంసి అధికారులు ఈఈ గోవర్ధన్ గౌడ్ డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సమగ్రాభివృద్దే తన ధ్యేయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్, అనంత నగర్, వినోభా నగర్‌లలో రూ.1 కోటి 32 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...కలిసి వచ్చే కార్పొరేటర్లను కలుపుకుని పోతూ ఆయా డివిజన్‌లలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు చెప్పారు. అలాగే ఈస్ట్ కాకతీయ నగర్, వెస్ట్ కాకతీయ నగర్‌ల లోని శ్మశాన వాటికలను కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, అధికా రులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు శ్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పిం చాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..శ్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మి, పిట్ల శ్రీనివాస్, సూరి, ఓం ప్రకాష్, ఉపేందర్ రెడ్డి, ఫరీద్,ప్రభాకర్ రెడ్డి,బాలకృష్ణ గుప్త, ఆగమయ్య, సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డి, పిట్లనాగరాజు, బాబు రావు, లత, చంద్రకాంత్, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్ పరిధిలోని అండాల్‌నగర్ కాలనీలో కాలనీవాసులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిం చారు. కాలనీలో పెండింగ్ లో ఉన్నా రోడ్లు పూర్తి చేయా లని, కాలనీ ట్రాన్స్ ఫార్మర్ పోల్స్ షిఫ్టింగ్, వాటర్ సమస్య తదితర సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. కాలనీలో ఇంటర్నల్ రోడ్ల నిమిత్తం జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. 30 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, నాయకులు ఆమినుద్దీన్, పిట్ల శ్రీనివాస్, సత్తయ్య, చందు, సంతోష్ నాయుడు, ఆదినారాయణ, సందీప్ గౌడ్, సూరి, బాలకృష్ణ గుప్త, ఆగమయ్య, అండల్ నగర్ అసోసియేషన్ సభ్యులు ఉత్తమ్ టకూర్, శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ, మదన్ మోహన్, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.





జలమండలిలో ఘనంగా ఓటరు దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పర్సనల్ డైరెక్టర్ శ్రీధర్ బాబు ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో ప్రాముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా.. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడికి లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, అర్హత కలిగిన వారందరూ ఓటు హక్కు పొంది దాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎంలు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, టి.వి.శ్రీధర్, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 20 వ వార్డు గోపికృష్ణ కాలనీలో మున్సిపల్ నిధులు రూ 7 లక్షలతో సీసీ రోడ్డు పనులకు చైర్మెన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాల్టీలో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుమిత్ర సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం

- కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లో ఇందిరానగర్‌లో సమస్యలు పరిష్కరించడంలో ఉప్పల్ ఎమ్మెల్యే, అలాగే కార్పొరేటర్ పూర్తిగా వైఫల్యం చెందారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్‌లో సమస్యలపై విస్తృతంగా ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇండ్ల మధ్యల డ్రయినేజీ నీరు పొంగిపొర్లడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తద్వారా ప్రజలకు డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కార్పొరేటర్ ఎన్నికల సమయంలో హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ వచ్చి ఇందిరానగర్ లో నివసిస్తున్న ముస్లిం సోదరులకు శ్మశాన వాటిక కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని వాగ్దానం చేసి ఓట్లు దండుకున్నాడన్నారు. రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా గాని హామీని నెరవేర్చలేదన్నారు. కార్పొరేటర్ ఎన్నికలకు ముందు దోమలపై యుద్ధం అన్నారు కానీ దోమలతో బంధం పెంచుకున్న కార్పొరేటర్ అని ఎద్దేవా చేశారు. తక్షణమే ఇట్టి సమస్యలపై కాప్రా మున్సిపల్ డీసీతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా లేనియెడల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం అఖిల భారతీయ రవిదాసియా ధార్మిక సంఘటన సమన్వయ కమిటీ తెలంగాణ వారి "చలో కాశి బనారస్" గోడపత్రికను లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాచారం డివిజన్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్ గౌడ్, మేడ్చల్ మలాజిగిరి జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ ఎండి రషీద్ (అశూ), ఉప్పల్ ఎస్సీ సెల్ చైర్మెన్ హెచ్‌ఆర్ మోహన్, అలీమ్ భాయ్, యూసుఫ్, హాజీ, మస్తాన్ భాయ్, అజీమ్, అహ్మద్, జహంగీర్, మస్తాన్, జిలాని, షకీల్, జలీల్, సాజిద్, అయూబ్, ఫియస్, ఇస్మాయిల్, కాజా, మునీర్, ముబిన్ , గొల్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు



కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన

- రోజుకు శిబిరాల్లో పాల్గొంటున్న దాదాపు 1500 మంది..
- నియోజకవర్గంలో 9 సెంటర్లు ఏర్పాట్లు

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదల పాలిటీ వరంగా మారింది. నియజకవర్గంలో అధికారులు 9 సెంటర్లలో (మల్కాజిగిరి లోని ఇందిరా మహిళా భవనం, యాప్రాల్ మల్లన్న టెంపుల్, అంబేద్కర్ కమ్యూనిటీ భవనం సైనికపురి, దీనదయల్ నగర్ కమ్యూనిటీ హాల్,గాయత్రి నగర్ కమ్యూనిటీ హాల్,ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్ మౌలాలి, అనంత సరస్వతి నగర్ కమ్యూనిటీ హాల్,మధుసూదన్ నగర కమ్యూనిటీ హాల్, మల్లికార్జున్ నగర కమ్యూనిటీ హాల్) కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. ఒక్కో సెంటర్లలో 8 నుంచి 10 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈ శిబిరాలలో కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారు. దగ్గర చూపు, దూరం చూపు,కంటి జబ్బులకు సంభందించి అన్ని పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కంటి అద్దాలు అందచేస్తున్నారు. ఈ శిబిరం దాదాపు శనివారం, ఆదివారం మినహాయించి 100 రోజుల పనిదినాలు పనిచేస్తుందని శిబిరం నిర్వాహకులు నోముల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గాంధీనగర్‌లో కంటి వెలుగు కార్యక్రమం



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి గాంధీనగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏడో అధ్యక్షుడు తేజ పాల్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తేజ్‌పాల్ ఇంటింటికి వెళ్లి స్థానికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ వైద్య బృందం కూడా ప్రత్యేకంగా పాల్గొని స్థానికులకు పరీక్షలు నిర్వహించారు.

అర్హులందరూ
ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ వార్డు కార్యాలయంలో బీఎల్ఓలతో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే ఈ దినోత్సవం ఉద్దేశం అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారతదేశం అని.. కానీ ఇలాంటి దేశంలో పట్టణాల్లో నివసించే కొందరు ప్రజలు ఓటు వేయడానికి ముందుకు రావట్లేదని చెప్పారు. ఓటు హక్కును పొందేందుకు యువత ఆసక్తి చూపట్లేదన్నారు. అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రారంభించిందని తెలిపారు.

నేరేడ్‌మెట్ : మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందు పరిచిన ఒక మనిషికి ఒక ఓటు అనే ప్రాధా న్యత గురించి విద్యార్థు లకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. రాజు, జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ ఎస్ రమేష్, జి. మల్లిక, ప్రభుత్వ పాలన విభాగ అధిపతి డాక్టర్ ఏ చంద్రయ్యలు మాట్లాడారు.



పార్కు స్థలాన్ని కాపాడాలి

- సొసైటీ అధ్యక్షులు సీత ఆంజనేయులు



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని శ్రీ భావన రుషి హౌసింగ్ సొసైటీలో లేఅవుట్‌లో కొంతమంది వ్యక్తులు 2203 గజాల పైన ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకో వాలని సొసైటీ అధ్యక్షులు సీత ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం సొసైటీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసి సొసైటీ లేఅవుట్ ఏర్పడిందని ఇందులో సూర్యనారాయణ పేరుతో 22 03 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించామని తెలిపారు. స్థానికంగా ఉండే నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కొంతమంది పార్కు స్థలంలో భవనం నిర్మించేందుకు జేసీబీ ద్వారా చెట్లను తొలగించి శుభ్రం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేటర్‌తో శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి విలువైన పార్కు స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే న్యాయ పోరాటానికైనా సిద్ధమని తెలిపారు.

శానిటేషన్ ఉద్యోగిచే అధికారి కారు వాషింగ్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన కారును సర్కిల్ కార్యాలయంలో గార్డెనింగ్ పనులను నిర్వహించే చిరు శాని టేషన్ ఉద్యోగులచే వాషింగ్ చేయించడం చర్చనియాంశంగా మారిం ది. దేశ స్వాతంత్రం వచ్చి రిపబ్లిక్ డే ఉత్సవాలను నిర్వహిం చుకునే ఒక రోజు ముందే ఇలాంటి పనులు చేయడం అవమానకరం. కాప్రా సర్కిల్ పరిధిలోని శానిటేషన్ విభాగంలో అధికారులు ఇష్టానుసారంగా పారిశుధ్య కార్మికులను వినియోగిస్తున్నారని ఆరోప ణలు వస్తు న్నాయి. ప్రజా ప్రతినిధుల ఇండ్లలో పనిచేయించడం కాకుం డా, ఉన్నత స్థాయి అధికా రులు ఇంట్లో కూడా పారిశుధ్య కార్మికులతో పనులను నిర్వహిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. ఏఎమ్ హెచ్‌ఓ, సానిటరీ సూపర్వైజర్, జవాన్లు, ఎస్ఎఫ్ఐలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీలో సిబ్బంది వేతనాలనే కాజేస్తున్నారని, కాప్రా సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రములపై అధికారులు దృష్టిని కేంద్రీకరించడం లేదని తెలుస్తోంది. జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ ప్రజాప్రతినిధుల అండతో , ఇక్కడ పనిచేసే ఏఎమ్‌హెచ్ వన్ బదిలీ చేయించి ఆస్థానంలో బాధ్యతను స్వీకరించడంపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇక సర్కి ల్‌లో ఆరు డివిజన్లకు ముగ్గురైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా ఒకరే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పం దించి పారిశుధ్య కార్మికుల వట్టి చాకిరిపై, అవినీతి అక్రమాలపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవినీతి అక్రమాలు పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్మికులకు అండగా సీఐటీయూ

కాప్రా పారిశుధ్య కార్మికులకు అండగా సీఐటీయూ పోరాడుతుంది. పారిశుధ్య కార్మికునితో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కారును వాషింగ్ చేయించడం బాధాకరం దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి, పారిశుద్ధ కార్మికుల వేతనాలు చెల్లించడంలో కూడా అక్రమాలు జరుగుతున్నట్టు తమ దష్టికి వచ్చింది. దీనిపై ఉన్నత అధికారుల దష్టికి తీసుకెళ్తాం.

– సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

అంగన్‌వాడీ విద్యార్థులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంగన్వాడీ విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్ పరిధిలోని గంగానగర్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ ఈ సందర్భంగా పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణులు, చిరు విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే బాబు, నర్సింగ్ యాదవ్, రాజు, అరవింద్, నర్సింగ్ యాదవ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లీకేజీపై దృష్టి సారించండి : కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట

వాటర్ లీకేజ్ పై అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ అమృత సూచించారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక వెజిటేబుల్ మార్కెట్ గల్లీలోని వాటర్ లీకేజీ అవుతుందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటననీ, ఏమైనా సమస్యలుంటే ఉంటే నేరుగా తనని కలవాలని సూచించారు.

బిల్లుల వసూళ్లలో జలమండలి అధికారుల జాప్యం

- బిల్లులు చెల్లించిన వారిపైనా కొరడా..
- మొండి బకాయిదారులపై మెతక వైఖరి
- బిల్లులో తప్పులతడక

నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లి జలమండలి సెక్షన్ కార్యాలయం పరిధిలో ని పలు ప్రాంతాల్లో నల్లా బిల్లులు పేరుకుపోయి మొండి పద్దులుగా మారుతున్నాయి. జలమండలి అధికారులు బకాయిదారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సంస్థ ఆదాయానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. సెక్షన్ పరిధిలో రూ.3 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయంటే అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రూ.20వేల నుంచి రూ.లక్షకు పైగా బకాయిలు ఉన్నప్పటికీ ఆ బిల్లులను వసూలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్న వారిపట్ల అధికారులు కనికరం చూపకుండా నిర్ధాక్షిణంగా నల్లా కనెక్షన్ కట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. బాగ్ లింగంపల్లి సెక్షన్ పరిధిలో 5465 కనెక్షన్స్ ఉండగా సుమారు 3వేలకు పైగా వినియోదారులు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు.



బిల్లులు చెల్లించిన వారిపై కొరడా

చిక్కడపల్లికి చెందిన ఓ వినియోగదారుడి కనెక్షన్ డొమెస్టిక్ అయినప్పటికీ అధికారుల తప్పిదంతో దాన్ని కమర్షియల్ కనెక్షన్‌గా మార్చి అధిక బిల్లులు వేశారు. ఈ సమస్యను 2017లో అప్పటి జీఎం దష్టికి తీసుకెళ్లగా రూ.10వేలు బిల్లులు కట్టించుకుని డొమెస్టిక్ చేస్తామని చెప్పారు. ఇప్పటికీ ఐదేండ్లు గడుస్తున్నా కమర్షియల్ కనెక్షన్ నుంచి డొమెస్టిక్ కనెక్షన్‌కు మారలేదు. కొత్తగా వచ్చిన అధికారులు రూ.70వేలు బకాయిలు ఉన్నాయి చెల్లించాలని లేకుంటే కనెక్షన్ తొలగిస్తామని బెదిరించారు. మళ్లీ కొత్తగా వచ్చిన జీఎం దృష్టికి తీసుకెళ్లగా మారుస్తాం మళ్లీ రూ.10వేలు బిల్లు చెల్లించాలని చెప్పారు

సార్ వినియోగదారుడు రూ.10వేలు చెల్లించిన తర్వాత జీఎం మారారు. జీఎంలు మారుతున్నారు తప్ప కనెక్షన్ స్టేటస్ మాత్రం మారడం లేదని వినియోగదారుడు వాపోతున్నారు. చివరికి బిల్లు చెల్లించిన వ్యక్తి నల్లా కనెక్షన్ కోల్పోయాడు.

బిల్లులన్నీ తప్పులతడక

సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రతినెలా వచ్చే బిల్లులు తప్పులు తడకగా మారుతున్నాయి. రూ.వందల్లో రావాల్సిన బిల్లులు రూ.వేళల్లో వేస్తున్నారు. దీంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదేంటని అడగాడానికి వినియోగదారులు ఆఫీసుకు వెళ్లగా అధికారులు ఎవరూ అందుబాటులో ఉండటం లేదు.

ఏ సమస్య అయినా జీఎం దృష్టికే తీసుకెళ్లాలి
మేనేజర్ జీవనజ్యోతి

బాగ్ లింగంపల్లి సెక్షన్ పరిధిలో ఏ సమస్య ఎదురైనా సంబంధిత వినియోదారులు నారాయణగూడలోని జీఎం కార్యాలయానికి వెళ్లాలి.

దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు రాజ్యాంగ వ్యతిరేకం



- ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

దండకారణ్య ఆదివాసులపై వైమానిక దాడులు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుద్ధిజీవులు ప్రజాస్వామ్యవాదుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ కోదండరాం లక్ష్మీనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలపై భారత ప్రభుత్వం చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. జనవరి 11వ తేదీన దక్షిణ బస్తర్ లోని కిష్టారం, పామేడు ప్రాంతంలో జరిగిన సైనిక దాడికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇండియన్ ఎయిర్ఫోర్స్ హెలికాప్టర్‌లో కోబ్రా జలాలు సీఆర్పీ బలగాలు జరిపిన బాంబుల దాడిలో పొట్టం హంగి అనే ఆదివాసి యువతీ మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. రాజ్యాంగంలోని జీవించే హక్కును కాపాడాల్సిన ప్రభుత్వం తానే ఈ దేశ ప్రజలపై వైమానిక యుద్ధం చేయడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. భారత ప్రజలు అనేక ప్రక్రియల ద్వారా పోరాటాల ద్వారా స్థాపించిన ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వాలే కాలరాస్తున్నయి అనడానికి ఈ ఘటన ఉదాహరణ అన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ త్రిపుర సంక్షోభంలో ఉన్నదని ఈ ఘటన తెలియజేస్తుందని పేర్కొన్నారు. సామాజిక ఆర్థిక సంస్కృతిక సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు వాటిని మరింత పెంచుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దండకారణ్య ఆదివాసులపై యుద్ధాన్ని ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో కేప ప్రభాకర్, ప్రముఖ కవి శివారెడ్డి, పాణి, ఎస్‌ప దేవిడ్, బల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ ఇంజినీరింగ్ స్టూడెంట్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. విషయం తెలిసి అతని పేరెంట్స్ పాకెట్ మనీ కట్ చేశారు. దీంతో ఏకంగా తండ్రి ప్రాణాలనే తీయాలనుకున్నాడు. అందుకు హత్య చేసేందుకు సిద్ధపడ్డాడు. 'ఓ యువతి డ్రగ్స్ కొనుగోలు కోసం చోరీకి పాల్పడింది. మొదట్లో ఇంట్లో తల్లిదండ్రుల పర్సులను మాయం చేసేది. అవి సరిపోకపోవడంతో బంధువుల ఇండ్లల్లో బంగారు ఆభరణాలను కొట్టేసి చివరకు పోలీసులకు చిక్కింది' 'మలక్‌పేటకు చెందిన ఓ యువకుడు డ్రగ్స్‌కు ఇంట్లో డబ్బులు ఇవ్వడం లేదని చెప్పి తల్లిదండ్రులు కొనిచ్చిన టూ వీలర్‌ను అమ్మడమే కాదు.. వీధుల్లో పార్క్ చేసిన వాహనాలనూ కొట్టేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. సరదాగా అలవాటైన డ్రగ్స్ వ్యసనంగా మారి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది. ఇటీవలె డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థుల ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. డ్రగ్స్ బారి నుంచి యువతరాన్ని కాపాడుకోవాలన్న మంచి ఉద్దేశంతో 'క్యాంపెయిన్ అగెనెస్ట్ డ్రగ్స్' ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది ఖిల్వత్ సద్భావన ఫోరం. ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, ఖలీలుర్రహ్మాన్ ఈ మేరకు విద్యార్థుల్లో, యువకుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం హైదరాబాద్ షాలిబండలోని 'హయాత్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల పై ప్రముఖ లైఫ్ కోచ్ ఫక్రుద్దీన్ అలీ అవగాహన కల్పించారు. చేజేతులా యువతరం తమ జీవితాలను ఎలా కోల్పోతుందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కండ్లకు కట్టారు. డ్రగ్స్ బానిసత్వంలో నుంచి యువత బయటికి రావాలని కోరారు. యువతతో పాటు బానిసలు అవుతున్న ప్రజలు దాని ద్వారా వచ్చే ప్రభావాలను ఆరోగ్య సమస్యలను ప్రభావితం చేసే పల అంశాలను సూచించారు. ఈ కార్యక్రమంలో సద్భావన ఫోరం పాట్రన్ యూసుఫ్ అలీఖాన్, పీఆర్ సెక్రెటరి మంజూర్ అహ్మద్, హయాత్ జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ ఇజ్లాల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-అడిక్‌మెట్

మహిళ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం దయానంద్ నగర్, విద్యా నగర్ ప్రాంతానికి చెందిన అత్తాపురం అరుంధతి తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అరుంధతి మధ్యాహ్న సమయంలో తాగిన మైకంలో కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. సాయంత్రం వరకు ఆమె తిరిగి ఇంటికి రావచ్చని కుటుంబ సభ్యులు భావించారు. తన తల్లి ఇలా పలుమార్లు గతంలో తాగిన మైకంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజుల్లో తిరిగి వచ్చేదనీ, ఈ సారి 8 రోజులు గడిచినా ఇంతవరకు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కన వాళ్లను బంధువులను ఆరా తీసినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో స్థానిక నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగంలో ముగిసిన స్తుతి వర్క్‌షాప్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్ సంయుక్తంగా డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టి) సౌజన్యంతో ఈనెల 18వ తేదీన ప్రారంభమైన "సినర్జిటిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ యుటిలైజింగ్ ది సైంటిఫిక్ అండ్ టెక్నాలజీకల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (స్తుతి)-2023" బుధవారంతో ముగిసింది. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.బి.వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ ఎ.బాలకిషన్, గౌరవ అతిథులుగా నిట్ వరంగల్ మాజీ డీన్ ప్రొ.వేదుల రాజేశ్వర్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ, సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి) డైరెక్టర్ ప్రొ.డి.కరుణ సాగర్ హాజరై ప్రసంగించారు. "గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర క్షీణత, నీరు, గాలి, నేల కాలుష్యాల రోజు రోజుకీ పెరుగుతున్న ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పని చేయాలి" అన్నారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ కె. శైలజ, వృక్ష శాస్త్ర విభాగాధిపతి, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ ప్రొ.బి.రమాదేవి, నిట్ వరంగల్ టెక్నికల్ ఆఫీసర్ జి.ఎస్.ఆర్.సంజీవని మాట్లాడి వర్క్‌షాప్‌లో చూపించిన పరికరాలు, అధునాతన పరిశోధన యంత్రాల గురించి, వారం రోజులుగా విద్యార్థులకు ఏం నేర్పించారు, వర్క్‌షాప్ రిపోర్ట్‌ను వెల్లడించారు. అనంతరం వర్క్‌షాప్‌లో దేశంలోని వివిధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, ప్రవేటు సంస్థల నుంచి పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు ప్రొ. సబిత, డా.నాగేశ్వర్‌రావు, డా.విజయ్‌భాస్కర్, డా.కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అధ్యాపకులు డా.శశికళ, డా.మంచాల లింగస్వామి, కె.సజన్, భీమ్ రావు, పరిశోధకులు డా.గాజుల ప్రభాకర్, మహేష్, డా.సుమన్, డా.రఘు, రమేష్, కవిత, నీత, పీజీ విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ సెక్రెటరీని కలిసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారిని బుధవారం వారి కార్యాలయంలో మంత్రులు మహ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మర్యాదపూర్వకంగా కలిశారు.

నాలాల పునరుద్ధరణకు రూ.6,700 కోట్లు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

జీహెచ్‌ఎంసీ పరిధిలోని నాలాల పునరుద్ధరణకు రూ.6700 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇటీవల గోశామహల్ నియోజకవర్గం చక్నవాడిలో కుంగిపోయిన నాలా పునరుద్ధరణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నాలా నిర్మాణం కోసం రూ.1.27 కోట్లు కేటాయించమని తెలిపారు. బేగంబజార్, ఉస్మాన్ గంజ్ మీదుగా 2.5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ నాలా నాణ్యతా ప్రమాణాలను త్వరలో సమీక్షిస్తామని తెలిపారు. గోశామహల్ నియోజకవర్గంలో ఉన్న నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఇతర అంశాలపై దృష్టి పెట్టడాన్ని మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోశామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు నంద కిషోర్ వ్యాస్ బిలాల్, ఎం.ఆనంద్ కుమార్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, రామచందర్ రాజు, సీనియర్ నాయకులు మహేందర్, అలె పురుషోత్తం, సంతోష్ గుప్త, ప్రియ గుప్త, లతక్కా, పరమేశ్వరి సింగ్, శశిరజ్ సింగ్, శ్రీనివాస్ గౌడ్, క్రాంతి కుమార్, ధనరాజ్, ప్రకాష్ గుప్త, పప్పు భాయ్, ప్రదీప్, ప్రదీప్ కొలరి, సర్కిల్- 14 డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి క్యాలెండర్‌ను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బాల్ రాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.జగదీష్ నాయి, సెక్రటరీ సాగర్, బి.వెంకట్, గురు చరణ్, మల్లయ్య, పి.శ్రీనివాస్, తోకచుక్క నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ హైదరాబాద్ జిల్లా యూనిట్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులను ఉద్యోగులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కొత్త ఉద్యోగులు టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్), జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్‌ను బుధవారం గృహకల్ప కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి సన్మానించారు. అనంతరం ముజీబ్ మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో విధులు నిర్వహించి సంఘానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా జిల్లా సంఘం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. నూతన సభ్యులకు ఎన్నికల అధికారి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్ సమక్షంలో ఎలక్షన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. యూనిట్ అధ్యక్షుడిగా సాయి కాంత్, సహ అధ్యక్షుడిగా రాజేశం, ఉపాధ్యక్షులుగా రాజేందర్ కుమార్, అనిత, వీణ కుమారి, కార్యదర్శిగా రాధ, సంయుక్త కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, జలజ, కుమారి భవాని, కోశాధికారిగా బాలరాజ్, కార్య నిర్వాహక కార్యదర్శిగా విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా రాజ్ కిరణ్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మిఎన్నికయ్యారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 20శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి అని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పెళ్లి అంజి డిమాండ్ చేశారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలను తగ్గిస్తూ ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. తెలంగాణకు జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలనీ, ట్రిబుల్ ఐటీ ఐఏఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 6,7,8, తరగతులు ఇచ్చే స్కాలర్షిప్ లను ఇవ్వకుండా ఆపేసిందనీ, కేంద్రం రద్దు చేసుకుని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కేంద్రంలో ఉన్న 16 లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మంగలి షాపుల్లో కరెంటును నిలిపేయరాదు



- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-అడిక్‌మెట్

విద్యుత్‌శాఖ అధికారులు మంగలి షాపుల్లో కరెంటు నిలిపివేయరాదనీ, రాష్ట్ర ప్రభుత్వం వారికి 250 యూనిట్ల సబ్సిడీ కరెంట్‌ను ఇస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రతినెలా 25వ తేదీ తర్వాత కరెంట్ అధికారులు మంగలి షాపులకు వచ్చి మీకు 250 యూనిట్ల సబ్సిడీ కరెంటు ఇవ్వట్లేదు.. మీరు కరెంటు బిల్లు చెల్లించాలని బెదిరిస్తున్నారు. కొన్ని చోట్ల షాపులో కరెంట్ కట్ చేసి వెళ్తున్నారు అని ముషీరాబాద్ నియోజకవర్గ నాయీ బ్రాహ్మణులు బుధవారం ఎమ్మెల్యే కోటర్స్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి ముషీరాబాద్ (ఏ డి ఈ) కరెంట్ అధికారికి ఫోన్ చేసి మీరు మంగలి షాపులలో కరెంటు ఎలా కట్ చేస్తారు అని ప్రశ్నించారు. వారికి 250 యూనిట్ల సబ్సిడీ ప్రభుత్వం ఇస్తున్నదనీ, దానితో పాటు వారి షాపులలోకి వెళ్లి కరెంట్ కట్ చేయొద్దనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఉన్నదనీ, అది మీరు గమనించలేరా అని అధికారులతో మాట్లాడారు. కరెంట్ అధికారి స్పందిస్తూ ఇకనుంచి అలా జరగకుండా చూస్తామని హామీనిచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యదర్శి రాకేష్ చేర్యాల, మనోహర్ నాయి, విక్రమ్ అన్న, ప్రభువు, శివ, కిరణ్, శ్రీకాంత్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన్ టైం ఛాన్స్ బ్యాక్ లాక్ ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలి



నవతెలంగాణ-ఓయూ

బ్యాక్ లాక్ ఎగ్జామ్ ఫీజులను తగ్గించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్టర్ ప్రో.లక్ష్మీనారాయణకు వినతిపత్రం బుధవారం అందజేశారు. 2010 నుండి 2017 సంవత్సరం వరకు అడ్మిషన్లు పొంది యూజీ, పీజీ, ఎంటెక్ కోర్సులలో బ్యాక్ లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్ టైం ఛాన్స్ పేరుతో 2022 నవంబర్ నెలలో స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం మేరకు ఎగ్జామ్ రాసుకుని అవకాశాన్ని విద్యార్థులకు కల్పించారు. కానీ స్టాండింగ్ కౌన్సిల్ చేసిన తీర్మానం యూనివర్సిటీ కోర్సుల ఫీజుల కన్నా ఎగ్జామ్ ఫీజును ఎక్కువగా నిర్ణయించింది. దీనిద్వారా విద్యార్థులు అంత ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన ఫీజులను తగ్గించి ఎగ్జామ్ రాసుకునే విధంగా ఫీజులు నిర్ణయించి విద్యార్థులకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య నెల్లి, ఉపాధ్యక్షుడు ఇరిగి బాలరాజు, అభ్యర్థులు శ్రవణ్, శేఖర్, సాయి పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి




నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓటు మన హక్కు.. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే పాషా ఖాద్రీ అన్నారు. సంతోష్ నగర్ సర్కిల్ - 7 డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు నేతృత్వంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు రెయిన్‌బజార్‌లో నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు మన ఆయుధం అన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ అనుసంధానంతో ఓటర్ నమోదులో అవకతవకలను సరి చేసుకోవాలని సూచించారు. అనంతరం రెయిన్‌బజార్ కార్పొరేటర్ అబ్దుల్ వాసే, డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారుతో కలిసి సీనియర్, యువ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పేద రోగులకు సహకారం అభినందనీయం

- ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి స్వచ్ఛందంగా సహకారం విజయ ట్రస్ట్ అందించడం అభినందనీయమని ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. బుధవారం కార్డియాక్ క్యాథ్‌లాబ్‌లో ఉపయోగించేందుకు వాడే పారేసే విలువైన వస్తువులను విజయ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శ్రీధర్ వీరా రెడ్డి వారి దాతల బృందంతో సూపరింటెండెంట్ కార్యాలయంలో విభాగం అధిపతి డాక్టర్ నిజాముద్దీన్ తో కలిసి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గుండెకు నిర్వహించే అధునాతన చికిత్సలకు ఎంత ఉపయోగపడతాయన్నారు. వారి దాతృత్వ కార్యకలాపాల ద్వారా పేద రోగులకు మరోసారి మద్దతునివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. స్వచ్ఛందంగా సేవలు, ప్రభుత్వ సహకారంతో పేద రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు తమ వంతుగా అన్ని వేలలో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తమ ఉదాత్తమైన పనికి సంస్థకు అభినందనలు తెలిపారు.

సినిమా థియేటర్‌పై 'భజరంగ్‌దళ్' దాడి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో టెన్షన్ నెలకొంది. తారక రమణ, ఐనాక్స్ థియేటర్‌ల వద్ద పఠాన్ సినిమాను నిలిపివేయాలంటూ భజరంగ్ దళ్ నాయకులు ఆందోళనకు దిగారు. వందల సంఖ్యలో వచ్చిన నాయకులు థియేటర్‌పై దాడి చేశారు. పటాన్ సినిమా పోస్టర్లను చించి వేసి సినిమా నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భజరంగ్ దళ్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇష్టానుసారంగా చెట్లను కొట్టేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ట్రీ కటింగ్ పేరుతో చెట్లను నరికివేస్తున్న అర్బన్ ఫారెస్ట్, విద్యుత్‌శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్" డిమాండ్ చేసింది. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో కౌన్సిల్ అధ్యక్షులు ఎస్.సిహెచ్. రంగయ్య, గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గుప్తా, ప్రకృతి ప్రేమికులు మన్నే దామోదర్ రెడ్డితో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రంగయ్య మాట్లాడుతూ ఓ పక్క సీఎం కేసీఆర్ హరితహారం పేరుతో కోట్లాది మొక్కలు నాటిస్తుంటే అధికారులు మాత్రం విద్యుత్ వైర్లకు అడ్డున్నాయన్న సాకుతో చెట్లను అడ్డంగా నరుకుతూ పచ్చదనాన్ని హరిస్తున్నారన్నారు. నగరంలో పలుచోట్ల కొన్ని వ్యాపార సంస్థలకు మేలు జరిగేలా ఫుట్ పాత్‌లపై ఉన్న భారీ వృక్షాలను కొట్టివేసేందుకు అర్బన్ ఫారెస్ట్ అధికారులే అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. నానా రకాల కాలుష్యాలతో పర్యావరణం పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుంటే పచ్చదనాన్ని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అర్బన్ ఫారెస్ట్ అధికారులు, చెట్లు కొట్టిస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాపాడాల్సిన అధికారులే "వాల్టా చట్టం" నిబంధనలు బేఖాతరు చేయడం పట్ల విచారం వ్యక్తం చేశారు. చెట్ల పట్ల అర్బన్ ఫారెస్ట్, విద్యుత్ అధికారుల తీరు ఇలాగే కొనసాగితే " నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ " కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మార్చ్ ఫాస్ట్‌లో మొదటి స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి అథ్లెట్‌లు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
మెదక్‌లో ఈనెల 21, 22న జరిగిన 9వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ చాంపియన్షిప్‌లో సుమారు 150 మంది వివిధ వయస్సు గల అథ్లెట్స్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నుండి పాల్గొనగా, మెన్ అండ్ ఉమెన్ మార్చ్ ఫాస్ట్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి అథ్లెట్స్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ఆయన నివాసం వద్ద బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారిని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, సెక్రటరీ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-కూకట్‌పల్లి
ఆరోగ్యకర సమాజానికి ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి అన్నారు, జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో నేడు మహిళలు రాణిస్తున్నారని, నిరాశా, నిస్పృహలకు లోను కాకుండా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, సేవా, రాజకీయ రంగాలలో ఆడపిల్లలకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, పాఠశాలబాలికలు పాల్గొన్నారు.

చక్నవాడి నాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు

నవతెలంగాణ-సిటీబ్యూరో
గోషామహల్‌లోని చక్నవాడి నాలాను ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుం టామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటో గ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. చక్నవాడి నాలాపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి గత నెలలో కుంగిపోయింది. వెంటనే మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకెళ్లగా 1.27 కోట్ల రూపాయలను నూతన వంతెన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేశారు. ఇటీవలనే నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాగా, బుధవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నగరంలోని అనేక నాలాలు ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించబడ్డాయని, అవి శిథిలావస్థకు చేరుకొన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చొరవతో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. చక్నవాడి నాలా దారుస్సలాం నుండి ప్రారంభమై తోఫ్ ఖానా, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, కిషన్ గంజ్, గురుద్వారా మీదుగా సుమారు 2.5 కిలోమీటర్ల దూరం ప్రవహించి మూసీనదిలో కలుస్తుందని చెప్పారు. ప్రజల అవసరాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. ఇష్టమొచ్చినట్లుగా నాలాలపై చేపట్టిన అక్రమ నిర్మాణాల వలన అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని, ప్రజల్లో దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు ఉన్నాయని, ప్రజల అవసరాలను తెలుసుకొని వాటిని తాము పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన బేగంబజార్ చేపల మార్కెట్‌ను 10 కోట్ల రూపాయల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. నూతన మార్కెట్‌లో అర్హత కలిగిన వారికి మాత్రమే స్టాల్స్‌ను కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జ్ఞాన్‌బాగ్ ప్రాంత ప్రజల కోరిక మేరకు కమ్యునిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ ఈఎస్‌సీ జియాఉద్దీన్, సీఈ కిషన్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ నాయక్ తదితరులు ఉన్నారు.



కంటి వెలుగుతో వృద్ధులకు అండగా సీఎం కేసీఆర్

- మంత్రి మల్లారెడ్డి
- డబిల్‌పూర్‌లో రూ.3 కోట్ల 18 లక్షలు, రైలాపూర్‌లో రూ.64లక్షల నిధుల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-మేడ్చల్
సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో పర్యటించి రూ. 3కోట్ల 18లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.అనంతరం రైలాపూర్ గ్రామంలో రూ.64లక్షలతో సీసీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వృద్ధులకు పెద్ద కొడుకులాగా కంటి చికిత్సలు చేయిస్తూ ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్న వైద్యాధికారు లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రతిరోజు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ ఏర్పాటుచేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ భాస్కర్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షులు నంద రెడ్డి, ఎంపీపీ రజిత రాజ మల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయా నందారెడ్డి, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్,సర్పంచ్ లు గీత భాగ్యరెడ్డి, మెట్టు నర్మదా గోపాల్ రెడ్డి, లక్ష్మీ సంజీవయ్య, సొసైటీ చైర్మెన్ రణదీప్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు విజయా నందరెడ్డి, సర్పంచ్ లు ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు రాజ మల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నాయకులు భాగ్యరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటితరం యువత మంచిని స్వీకరించి, చెడును విసర్జించాలి

ఐఏఆర్ఈ కళాశాలలో సామాజిక స్పృహపై గరికపాటి ప్రసంగం



నవతెలంగాణ-దుండిగల్
నేటితరం యువత మంచిని స్వీకరించి, చెడును విసర్జించాలని ఒకరితో ఒకరు ఓర్పు, సహనం కలిగి మానవత్వంతో ఉండాలని పద్మశ్రీ డా.గరికపాటి నరసింహారావు తెలిపారు. బుధవారం దుండిగల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలకి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి సామాజిక స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్నటువంటి మంచి, చెడు విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ముఖ్యంగా తల్లిదండ్రులను, గురువులను, గౌరవించాల న్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, వీలైనంత వరకు ఎదుటి వారికి, తోటి విద్యార్థులకు సహాయపడేలా ఉండాలన్నారు. అవగాహనలేని విషయాలను, అధ్యాపకులతో తల్లిదండ్రులతో సంప్రదించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. తోటి వారితో అందరూ సమానమే అని, సామాజిక స్పృహ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆయనకి గణపతి ప్రతిమ, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సిహెచ్. సత్తిరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎల్‌వి. నరసింహ ప్రసాద్, అధ్యాపకురాలు శిరీష, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసన

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కుకాట్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండితులు నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పదోన్నతులు, షెడ్యూల్ విడుదల, ఆషెడ్యూల్లో భాషా పండితుల అప్‌గ్రేడ్ అయినటువంటి పోస్టుల్లో భాషా పండితులను పదోన్నతులు ద్వారా అవకాశం కల్పించేందుకు గాను 2017 తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి భాషా పండితులకు సంబంధించిన సమస్యలను త్వరలో పూర్తిచేస్తామని ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని, పండిత ఐక్య కార్యాచరణ వేదిక దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించుటకు పిలుపునిచ్చిన సందర్భంగా, ఒకరోజు భాషాపండితులందరూ నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన వ్యక్తం చేయాలనే పిలుపుమేరకు కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి జిల్లా అధ్యక్షులు వివిఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ, గత 20ఏళ్లుగా ఉద్యోగం పొంది పదోన్నతులకు నోచుకోకుండా ఉన్నత పాఠశాలలో వెట్టిచాకిరి నిర్వహిస్తున్న పండితుల ఆకాంక్షను, ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే దిశగా పత్రికలు కూడా సహకారం అందించాలని కోరారు. భాషా పండితుల, పీఈటీల పదోన్నతుల ఆకాంక్ష నెరవేరాలని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలు విజయవంతం చేసినందుకు భాషా పండితులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు దశలవారి కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకొని మన ఆకాంక్షను నెరవేర్చే విధంగా కృషి చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బి.స్వప్న, జిల్లా సమన్వయ సహఅధ్యక్షులు కృష్ణ గౌడ్, రామచందర్ ఎల్లమ్మ బండ, సీనియర్ భాషా పండితులు చంద్రశేఖర్ మాణిక్యం, జిల్లా మహిళా కార్యదర్శి సాయి గీతిక, నిరసనకు సంఘీభావం తెలుపుతూ భాషా పండితులు ఆకాంక్ష నెరవేరాలని ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు దమయంతి, రాణి, ఉమావసుంధర, విజయలక్ష్మి, మంజుల, మల్లారెడ్డి, నజీముద్దీన్, శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి తుల్జారాం, సహదేవ్‌లు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి

బాలానగర్ అధికారులకు పురస్కారాలు
దక్కడం హర్షణీయం - సీఐ కె. భాస్కర్



నవతెలంగాణ-బాలానగర్
రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు అధికారులకు అత్యుత్తమ పురస్కారాలు దక్కాయి. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన ముగ్గురు పోలీసు అధికారులకు నేడు సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా సేవా పథకాలను అందజేయనున్నారు.
బుధవారం కమిషనరేట్ నుండి సమాచారం అందుకున్న బాలానగర్ సీఐ భాస్కర్ వారిని అభినందించారు. పోలీసు శాఖలో అత్యుత్తమ సేవలందించిన పోలీస్ సిబ్బందికి సేవా పతకాలు, ఉత్కృష్ట, అతి ఉత్తిష్ఠ సేవా పథకాలను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అందజేయడం అభినంద నీయమని అన్నారు. పోలీసు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మక్బూల్ పాషా, ఏఎస్ఐ (క్రైం) సంగమేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లకు వివిధ సేవా పతకాలు బాలానగర్ పోలీసు అధికారులకు దక్కడం గర్వంగా ఉందన్నారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపే ఈ పథకాలని అన్నారు. భవిష్యత్తులో ఇదేవిధంగా సిబ్బంది ఉత్తమ సేవలందించి మరిన్ని అత్యుత్తమ పురస్కారాలను సాధించాలని సీఐ భాస్కర్ ఆకాంక్షించారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ స్కూల్‌లో 'పరీక్ష పే చర్చ'

- ఆర్ట్ కాంపిటీషన్‌తో సహా వివిధ పోటీల నిర్వహణ



నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా, దేశ వ్యాప్తంగా రూపొందించిన, పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా, డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్‌లు నిర్వహించిన, పాఠశాల కరెస్పాండెంట్ సురభి రవీందర్‌రావు, డైరెక్టర్ చెన్నమనేని స్రవంతి, తేజస్వినిరావు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గజ్జెల యోగానంద్, రవికుమార్ యాదవ్, కొరదల నరేష్, మొవ్వ సత్యనారయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రధాన మంత్రీ ఇప్పటి వరకు విద్యార్థులు రాసే పరీక్షల గురించి, పరీక్షల సమయంలో విద్యార్థులు గురయ్యే ఒత్తిడి గురించి ఆలోచించలేదని, అది కేవలం ప్రధాని నరేంద్ర మోడీకి మాత్రమే సాధ్యమైందని తెలుపుతూ, పరీక్ష పే చర్చ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులు పరీక్షలు రాసే ముందు, పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవకుండా, చదువుపై మక్కువ పెంచుకొని పరీక్షలు రాసి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. విద్యార్థులు పాఠశాల విద్యా దశ నుండే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, ఆ లక్ష్య సాధన కోసం, అంకితభావంతో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, మనిభుషన్, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధన హైస్కూల్‌లో ఆర్ట్ కాంపిటీషన్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం డివిజన్‌లోని మార్కండేయనగర్‌లో ఉన్న సాధన హైస్కూల్లో ప్రధాన మంత్రి 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థుల 'పెయింటింగ్ కాంపిటీషన్' నిర్వహించగా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ హాజరై గెలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సృజన, ఉత్సాహం, చూశాక పరీక్షలను వాటి ఒత్తిడిని తప్పకుండా జయిస్తారని నమ్మకం కలిగిందన్నారు. ఈనెల 27న ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి 'పరీక్ష పే చర్చ' ప్రత్యేక ప్రసారం ద్వారా విద్యార్థులు వారి తల్లిదండ్రులు వీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్ రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, బావిగడ్డ రవి, ఎక్సమ్ వారియర్స్ నిర్వహణ కమిటీ సభ్యులు దయాకర్, డివిజన్ అధ్యక్షులు దుర్యోధన్ రావ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరాం రెడ్డి, దీపక్ , కేశవ్, సందీప్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డుపైకి దూసుకొచ్చిన కంటైనర్ లారీ

అక్కడికక్కడే మృతి





నవతెలంగాణ- మేడ్చల్
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ హోంగార్డు పైకి కంటైనర్ లారీ దూసుకెళ్లి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్(35) బుధవారం ఉదయం 12 గంటల ప్రాంతంలో కండ్లకోయ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వేగంగా కంటైనర్ లారీ హోంగార్డు పైకి దూసుకురావడంతో శ్రీనివాస్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగ సంఘటన స్థలాన్ని ఏసీపీ రామలింగరాజు,సీఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధికి, సంక్షేమానికి మారుపేరుగా నిలుస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో రూ. 42 లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్డు నిర్మాణాల కొరకు స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తుందని, ఎక్కడ కూడా ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణాలు, రోడ్లు నూతన డ్రైనేజ్ వ్యవస్థలు, పార్కులు, ఓపెన్ వ్యాయామశాలలు, కమ్యూనిటీ హాల్స్, అనేకమంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఇలా చెప్పుకుంటూ పోతే వేలకోట్ల రూపాయల అభివృద్ధి సంక్షేమం నియోజకవర్గంలో చేశామని ఆయన తెలిపారు.
జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, ఎక్కడైనా ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

సోఫీఖాజా పాష దర్గాను దర్శించుకున్న నూతన్‌కల్ ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ- మేడ్చల్
మండల పరిధిలోని నూతన్ కల్ గ్రామంలో ఉన్న సోఫీఖాజా పాష దర్గాను పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి,వార్డు సభ్యుడు యూనిస్ పాషా బుధవారం దర్శించుకొని సోఫీ ఎండి హుస్సేన్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మల్లమ్మ,ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,నాయకులు జీవన్,మహేందర్ రెడ్డి,నారమ్ రెడ్డి,ఆంజనేయులు,కిష్టయ్య, మదన లక్ష్మీనారాయణ,సత్తి నరసింహారెడ్డి, యాదగిరి, అశోకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ మహాసభ సభ్యులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కే.వివేకానంద్‌ని పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మల స్వామి ముదిరాజ్, వాసుదేవరావు ముదిరాజ్, గొల్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, బొక్క శీను ముదిరాజ్, కనకయ్య ముదిరాజ్, గొడుగు శీను ముదిరాజ్ ,బల్ల సత్తయ్య ముదిరాజ్, వీరయ్య ముదిరాజ్, నరహరి ముదిరాజ్, నాగభూషణ్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, శ్రావణ్‌కుమార్ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ ప్రకాష్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్ తదితర ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.

మూసాపేట్ డివిజన్ బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం

నవతెలంగాణ-కూకట్‌పల్లి
కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, నారాయణపేట జిల్లా ఇన్‌ఛార్జి మాధవరం కాంతారావు, మూసాపేట్ కార్పొరేటర్ కె.మహేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు, నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ పరిధిలోని బూత్, బూత్‌కి భారతీయ జనతా పార్టీ కార్యక్రమంలో భాగంగా, నేడు స్థానిక బీజేపీ నేతలతో కలిసి పర్యటించారు. డివిజన్ వ్యాప్తంగా డివిజన్‌లో ఉన్న బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహించి, ఓటరు నమోదు ప్రక్రియ, బోగస్ ఓట్ల గుర్తింపుపై ఆరా తీశారు. ప్రతి బూత్ లో అధ్యక్షుడి ఇంటికి బోర్డు ఏర్పాటు చేసి వారిని సన్మానించారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు కార్యకర్తలు నాయకులు అందరూ సిద్ధంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం తోపాటు జిల్లా వ్యాప్తంగా బీజేపీ జెండా ఎగిరే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా అధ్యక్షులు శ్రీ హరీష్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, డివిజన్ ఇన్చార్జిలు వినోద్ కుమార్, శైలేష్ కుమార్, జిల్లా నాయకులు డాకయ్య కృష్ణ ముదిరాజు, మల్లేష్, మాణిక్, యాదగిరి, మంగమ్మ, సతీష్, సాయి, శ్రీను, కిషోర్, అబ్బాస్, రవి గౌడ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

మత కల్లోలాలకు మోడీనే కారకుడు !

ముస్లింల పట్ల కొట్టొస్తున్న పక్షపాతం

- బ్రిటన్‌లో ప్రసారమైన బీబీసీ డాక్యుమెంటరీ రెండో భాగం



లండన్ : భారత ప్రధాని మోడీపై బీబీసీ తీసిన డాక్యుమెంటరీ ఇండియా : ది మోడీ క్వశ్చన్ రెండో భాగం మంగళవారం రాత్రి బ్రిటన్‌లో బీబీసీలో ప్రసారమైంది. 2014లో మెజారిటీ కన్నా పెరిగిన బలంతో 2019లో తిరిగి ప్రధానిగా మోడీ ఎన్నికైన తర్వాత దేశంలోని ముస్లిం మైనారిటీలకు, మోడీకి మధ్య గల సమస్యాత్మక సంబంధాల గురించి ఈ భాగంలో క్షుణ్ణంగా పరిశీలించారు. అకస్మాత్తుగా 370వ అధికరణను రద్దు చేయడం, వివాదాస్పదమైన పౌరసత్వ (సవరణ) చట్టం, 2019 (ఈ చట్టం వివక్షాపూరితంగా వుందని, రాజ్యాంగ విరుద్ధమని గణనీయ వర్గాలు భావిస్తున్నాయి. సుప్రీం కోర్టు దీనిని విచారించాల్సి వుంది), 2002లో ఈశాన్య ఢిల్లీలో రేగిన మతోన్మాద హింస వీటన్నింటినీ ఈ నివేదిక పరిశీలించింది. ఈ తుది డాక్యుమెంటరీ భాగంలో ప్రతి అంశంపైనా స్వతంత్ర నివేదికలను, సాక్ష్యాధారాలను, బాధిత పక్షాలు, విద్యావేత్తలు, మీడియా సభ్యులు, పౌర సమాజం వ్యాఖ్యలను బీబీసీ నిశితంగా పరిశీలించి, సమీక్షించింది. ప్రతి విషయంలో ప్రభుత్వ, పోలీసు బలగాల డిఫెన్స్ వాదనలను కూడా ఉటంకించింది. ఇందులో బీజేపీ దృక్కోణానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురి వ్యాఖ్యలతో సహా ప్రముఖ జర్నలిస్టు, మాజీ బీజేపీ ఎంపి స్వపన్ దాస్ గుప్తా వ్యాఖ్యలు వున్నాయి. 'ప్రజా శ్రేయస్సుకి సంబంధించి కొత్త యుగాన్ని ఆవిష్కరిస్తామని, వినూత్నమైన భారతదేశాన్ని నెలకొల్పుతామని మోడీ హామీ ఇచ్చినప్పటికీ ఆయన పాలనలో దేశంలో 'మతపరమైన కల్లోలం' ఏర్పడిందని డాక్యుమెంటరీ పేర్కొంది. గుజరాత్ అల్లర్లలో ఆయన పాత్ర లేదంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినప్పటికీ "ఆందోళనలు మాత్రం పోవడం లేదు" అని డాక్యుమెంటరీ పేర్కొంది.

వేధింపులకు గురి చేసి హత్యలు

2014లో అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తర్వాత, ముస్లింలను హతమార్చిన కేసులు విపరీతంగా పెరిగాయి. పింక్ రివల్యూషన్ పేరుతో గొడ్డు మాంసాన్ని రవాణా చేయడం రాష్ట్రాను తీవ్ర వివాదాస్పద అంశంగా మారింది. ఆ తర్వాత గొడ్డు మాంసాన్ని అనేక రాష్ట్రాల్లో చట్టవిరుద్ధం చేశారు. హిందువులు గోవులను అతి పవిత్రంగా పూజిస్తారు కాబట్టి గొడ్డు మాంసం తినరాదని నిషేధించారు. గో జాగరణ అంశంపై ఈ డాక్యుమెంటరీ ప్రధానంగా దృష్టి సారించింది. 2017లో గో సంరక్షకుల చేతుల్లో హత్యకు గురైన అలిముద్దీన్ అన్సారి కథను ఈ డాక్యుమెంటరీ వివరించింది. అదే రోజు మోడీ తన సుదీర్ఘ మౌనాన్ని విడనాడి మాట్లాడారు. ఆ తర్వాత, వెంటనే ఆకస్మిక పరిణామం సంభవించింది.

అలీముద్దీన్ హత్య విషయంలో బీజేపీ ప్రతినిధి నిత్యానంద్ మహతో దోషిగా ఎలా తేలిందీ, యావజ్జీవ శిక్ష పడిన వైనాన్ని ఈ


హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద బీబీసీ డాక్యుమెంటరీని వీక్షిస్తున్న విద్యార్థులు

డాక్యుమెంటరీ వివరించింది. అయితే మోడీ మంత్రుల్లో ఒకరు, ఆయనకు, దోషులుగా తేలిన ఇతరులకు వారి న్యాయ ఫీజుల్లో సాయం చేశారు. పైగా వారిని పూలదండలు వేసి స్వాగతించారు.

"వారు ఈ దేశ పాలకులు, ఆ పాలకులే ఈ వ్యక్తులకు మద్దతిచ్చినపుడు మాలాంటి పేదవారం ఏమీ చేయలేం." అని అన్సారీ భార్య వాపోవడం ఆ డాక్యుమెంటరీలో కనిపిస్తోంది. నాలుగేళ్ళ తర్వాత, వారందరూ స్వేచ్ఛా జీవులయ్యారు అంటూ ఆ డాక్యుమెంటరీ ముగుస్తుంది.

2015 మే నుంచి 2018 డిసెంబరు మధ్య దాదాపు మూడున్నరేండ్ల కాలంలో గో సంరక్షకులు 44మందిని హత్య చేశారని, గో హింసకు సంబంధించిన ఘటనల్లో దాదాపు 280మందిని గాయపరిచారని హ్యూమన్ రైట్స్ వాచ్ డాక్యుమెంటరీలో పేర్కొంది. ఈ బాధితుల్లో చాలామంది ముస్లింలేనని తెలిపింది.

ఇలా ముస్లింలను వేధింపులకు గురి చేసి హతమార్చడమనే ధోరణి బాగా పెరుగుతూ వచ్చి దేశంలో ఒక పద్ధతిగా మారిపోవడాన్ని గురించి స్వపన్ దాస్‌గుప్తాని ప్రశ్నించగా, ఇది 'అనవసరమైన ఊహ' అని వ్యాఖ్యానించారు. మోడీ తరహా హిందూ జాతీయవాదానికి రికార్డు సంఖ్యలో భారత ఓటర్లు మద్దతిస్తున్నారంటూ దాస్‌గుప్తా ప్రధానిని వెనకేసుకువచ్చారు.

"భారతదేశం పనిచేసే తీరును హిందూ మత విధానంగా మార్చడం, భారతదేశ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక స్వభావాన్ని కోలుకోలేని రీతిలో మార్చడమనేది ఇక్కడ ప్రాథమిక లక్ష్యంగా వుంది. ముఖ్యంగా, ముసుగులు తొలిగాయి." అని భారత రాజకీయాలపై నిపుణుడు, సెయింట్ ఆండ్రూస్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ క్రిస్ ఓగ్లెన్ వ్యాఖ్యానించినట్లు ఆ డాక్యుమెంటరీలో వినవచ్చు.

370వ అధికరణ

2019 ఆగస్టులో 370వ అధికరణను రద్దు చేస్తూ వివాదాస్పదమైన చర్య తీసుకోవడం, తర్వాత జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని విభజించి, కేంద్ర పాలిత ప్రాంతంగా అనూహ్యమైన రీతిలో మార్చడంపై డాక్యుమెంటరీ వ్యాఖ్యానిస్తూ, ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేసిన 9వారాల తర్వాత కాశ్మీర్‌కు సైనిక బలగాలు పంపబడ్డాయని పేర్కొంది. ఫలితంగా కేంద్రం ప్రత్యక్ష నియంత్రణలోకి ఆ ప్రాంతం వెళ్లిపోవడంతో 'సమాచార స్తంభన' నెలకొందని డాక్యుమెంటరీ పేర్కొంది.

అయితే, తాము అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి నెలకొంటున్నాయని ప్రభుత్వం చెప్పుకుంటున్నట్లు డాక్యుమెంటరీ పేర్కొంది.

సీఏఏ, ఈశాన్య ఢిల్లీ హింస

మతాన్ని భారతదేశ పౌరసత్వంతో ముడిపెట్టడానికి ఉద్దేశించిన సీఏఏకి వ్యతిరేకంగా ప్రజల్లో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగడం, అటుపై 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో మతోన్మాద హింస చోటు చేసుకోవడంపై మాట్లాడుతూ, "ముస్లిం ఆందోళనకారులపై కరడుగట్టిన హిందూ మత పెద్దలు బెదిరింపులకు దిగారు." అని డాక్యుమెంటరీ పేర్కొంది.

23 ఏండ్ల ముస్లిం ఫైజాన్‌ను చనిపోయేదాకా పోలీసులు చితకబాదారని వైరల్ అయిన వీడియోను ఉటంకిస్తూ డాక్యుమెంటరీ పేర్కొంది. "నా కొడుకు న్యాయం జరగాలి. అతడు అమాయకుడు, ఏ కారణం లేకుండానే చంపేశారు." అని ఫైజాన్ తల్లి బాధపడడం ఆ డాక్యుమెంటరీలో వినవచ్చు.

2020 ఢిల్లీ అల్లర్లలో మరణించిన వారిలో మూడింట రెండు వంతుల మంది ముస్లింలేనని తెలుస్తోందని ఆ చిత్రం పేర్కొంది. వేధింపులకు దిగడం, అనుచితంగా వ్యవహరించడంతో సహా పోలీసులు తీవ్రంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆందోళనకారులపై మితిమీరి, ఏకపక్షంగా బల ప్రయోగానికి దిగారని, హింస, అల్లర్లలో చురుకుగా పాల్గొన్నారని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన దర్యాప్తును ముగిస్తూ చేసిన వ్యాఖ్యలను బీబీసీ డాక్యుమెంటరీ పేర్కొంది. పోలీసులు వ్యవహరించాల్సిన రీతిలో వ్యవహరించలేదని ఒకవేళ వ్యవహరించినా, ప్రతిసారీ తప్పుడు వ్యక్తులనే నిందిస్తూ వచ్చారని, బాధితులనే హింసకు పాల్పడిన వ్యక్తులుగా పేర్కొంటూ వచ్చారని, ఈ చర్యలపై సక్రమంగా దర్యాప్తు జరగాలని తాము కోరామని, కానీ అది ఇంతవరకు జరగలేదంటూ ఢిల్లీలో జరిగిన అల్లర్లపై అమ్నెస్టీ నివేదిక పేర్కొందంటూ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా అధ్యక్షుడు అకార్ పటేల్ వ్యాఖ్యానించడం ఆ చిత్రంలో వినిపిస్తుంది."పోలీసులను తక్కువగా చేస్తూ, పక్షపాతంగా వ్యవహరించారని, మానవ హక్కుల ఉల్లంఘనలంటూ దురుద్దేశ్యపూర్వకంగా కేసు పెట్టారంటూ" అమ్నెస్టీ నివేదికపై ఢిల్లీ పోలీసులు చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చిత్రంలో వున్నాయి.

అల్లర్ల సమయంలో పోలీసులు 2వేల మందికి పైగా అరెస్టు చేశారు, వీరిలో హిందువులు, ముస్లింలు కూడా వున్నారు.

ప్రభుత్వం తమని కాపాడుతుందనే భావనతో వుండవద్దంటూ ముస్లింలకు సందేశాన్ని పంపారని చిత్రంలో జర్నలిస్టు అలిసాన్ జాఫ్రి వ్యాఖ్యానించినట్లు వినిపిస్తుంది. "ఇది జరుగుతుందని నువ్వు అనుకున్నావా? ర్వాండాలా నిజంగా తయారవుతుందనుకుంటున్నావా?" అని మేం ఒకరితో ఒకరు మాట్లాడుకున్నాం. ఈ చిత్రంలో నేనెందుకు మాట్లాడాలి? దీంతో మేమెవరం ఏకీభవించలేదని రికార్డవడానికి ఇది చేయాలి, అంతేకానీ సాయం కోసం పిలుపు కాదు ఇది, ఎందుకంటే ఏ సాయమూ రాదు కనుక" అని అరుంధతి రాయ్ వ్యాఖ్యానించారు.

పీఎంపై బీబీసీ డాక్యుమెంటరీని దాయడానికే

ఎమర్జెన్సీ అధికారాలు

- ట్విట్టర్, యూట్యూబ్ లకు ఎంఐబీ ఆదేశాలు

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్లలో మోడీపాత్రపై బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీని కట్టడి చేయడానికి కేంద్రం తన అధికారాలను విస్తృతంగా వినియోగిస్తున్నది. ఈ డాక్యుమెంటరీలోని విషయాలు ప్రజలకు చేరకుండా దానిని దాచేందుకు చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా వివాదాస్పద సమాచార సాంకేతిక నిబంధనలు - 2021 (ఐటీ రూల్స్) లోని ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగిస్తూ ట్విట్టర్, యూట్యూబ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. డాక్యుమెంటరీకి సంబంధించిన లింకులను తొలగించాలని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ) సదరు సామాజిక మాధ్యమాలను ఆదేశించింది.

"ఇండియా : ద మోడీ క్వశ్చన్"

పేరుతో బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ మొదటి భాగాన్ని బీబీసీ ఇటీవల భారత్ మినహా ఇతర దేశాల్లో విడుదల చేసిన విషయం విదితమే. భారత్‌లో బీబీసీ ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేయకున్నా.. కొందరు దీనిని యూట్యూబ్‌లో షేర్ చేశారు. ట్విట్టర్‌లోనూ ఈ డాక్యుమెంటరీ లింకులను షేర్ చేశారు. దీంతో ఈ వీడియో వ్యాప్తిని అడ్డుకోవడానికి మోడీ సర్కారు చర్యలకు ఉపక్రమించింది.

ఇందులో భాగంగానే డాక్యుమెంటరీకి సంబంధించిన ఈ లింకులను తొలగించాలనీ, భవిష్యత్తు లోనూ ఈ వీడియో అప్‌లోడ్ కాకుండా బ్లాక్ చేయాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ఆదేశాలు జారీ చేశారు. ఐటీ నిబంధనల్లోని ఎమర్జెన్సీ అధికారాలను వినియోగించి ట్విట్టర్‌కు నిషేదాజ్ఞలు జారీ చేసినట్టు ఎంఐబీ సీనియర్ సలహాదారు ఒకరు ధ్రువీకరించడం గమనార్హం. ఈ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద మంత్రిత్వ శాఖ ఆదేశాలు ఉల్లంఘించినట్టయితే భారీ జరిమానాతో పాటు ఏడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్రం ఆదేశాలను ట్విట్టర్, యూట్యూబ్ లకు చెందిన అధికారులు పాటించారు. అయితే, కేంద్రం ఆదేశాలకు సంబంధించిన అధికారిక కాపీ లేదా పత్రికా ప్రకటనా ఎంఐబీ నుంచీ కానీ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నుంచి ఇప్పటికీ విడుదల కాలేదు.

ఈనెల 17న బీబీసీ డాక్యుమెంటరీ " ఇండియా : ద మోడీ క్వశ్చన్"

రెండు భాగాల్లో ఒక భాగం యూకేలో ప్రసారమైంది. తొలి ఎపిసోడ్‌లో మోడీ తొలినాళ్లలో రాజకీయ జీవితాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా, 2002 లో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అల్లర్లలో రెండు వేల మంది మరణించడంపై ప్రశ్నలను తొలి ఎపిసోడ్ లేవనెత్తింది. బ్రిటీషులోని అంతర్గత నివేదికల ఆధారంగా దీనిని రూపొందించినట్టు బీబీసీ వెల్లడించింది. 2002లో హింసాత్మక పరిస్థితులు తలెత్తడానికి నేరుగా మోడీనే బాధ్యుడని బ్రిటీషు విదేశీ కార్యాలయ నివేదిక పేర్కొన్నది.

అభివృద్ధి కోసం అప్పులు చేయడమేంటి? చావడమేంటి?

- రాష్ట్రంలో సర్పంచ్‌ల పరిస్థితి దారుణం
- 18 మంది ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం
- సీపీఐ(ఎం) సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ధనిక రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు అప్పులు చేయడమేంటో? వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడమేంటో అర్థం కావడం లేదని సీపీఐ(ఎం) సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌లో పంచాయతీరాజ్ చట్ట సవరణపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఎవ్వరినీ సంప్రదించకుండా నూతన పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. అఖిల పక్షం తరఫున ఎంతో మంది సీఎంల దగ్గరకు వెళ్లి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాలనీ, ఈ సీఎం(కేసీఆర్) దగ్గరకు ఒక్కసారి కూడా వెళ్లలేకపోయానని చెప్పారు. ఆ చట్టంతో పంచాయతీరాజ్ వ్యవస్థను కేసీఆర్ తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నారని విమర్శించారు. సర్పంచుల సమస్యలపై సెమినార్లు, సదస్సులు మరిన్ని పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 18 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, వారందరి కుటుంబాలతో మీటింగ్ పెడితే బాగుంటుందని సూచించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమర్థుడే అయినప్పటికీ అంతా కేసీఆర్ చేతుల్లో ఉండటంతో ఆయన ఏమీ చేయలేకపోతున్నాడన్నారు. టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ..సర్పంచ్‌లు ఏం చేయాలో ఎమ్మెల్యేలు నిర్ణయించడం దారుణమన్నారు. అసలు వారిపై ప్రభుత్వ పెత్తనమేంటని ప్రశ్నించారు. సర్పంచుల పదవీకాలం ఏడాదే ఉందనీ, పోరాడితే పోయేదేం లేదన్న భావనతో వారంతా రోడ్ల మీదకొచ్చి ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే అన్ని పార్టీలతో చర్చించి బలమైన పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బీజేపీ నేతలు, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేస్తే ప్రభుత్వం చచ్చినట్టు దిగొస్తుందన్నారు. సర్పంచుల నిధులను కేసీఆర్ పక్కదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా సర్పంచులను వేధించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి, వైఎస్ఆర్‌టీపీ నేత గట్టు రామచందర్‌రావు, ఆప్‌నేత సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు విమలక్క, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్


మోహన్‌బాబు, లక్ష్మీప్రసన్న, సముద్రఖని

లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై డా.మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అగ్ని నక్షత్రం'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. మోహన్ బాబు, లక్ష్మీప్రసన్న తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఈ చిత్రంలో విలక్షణ నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. మలయాళంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించిన మలయాళ నటుడు సిద్దిక్, యువ హీరో విశ్వంత్, చైత్ర శుక్లతో పాటు భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషించారు.

శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా ఒక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ అని, ఆసక్తికర ఫైట్స్‌తో ఆకట్టుకుంటుందని డైరెక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. ఈ చిత్రానికి అచ్చు రాజామణి సంగీతం అందిస్తున్నారు. గోకుల్ భారతి కెమెరామెన్‌గా, మధు రెడ్డి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

మెప్పించే సిందూరం


బ్రిగిడా సాగ, ధర్మ

శివ బాలాజీ, ధర్మ, బ్రిగిడా సాగ ప్రధాన తారాగణంగా శ్యామ్ తుమ్మలపల్లి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సిందూరం'. రిపబ్లిక్ డే సందర్భంగా నేడు (గురువారం) ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.

ఈ సందర్భంగా దర్శకుడు శ్యామ్ తుమ్మలపల్లి మాట్లాడుతూ, 'ఈ సినిమా అందర్నీ అలరిస్తుందని ఆశిస్తున్నాను. నక్సల్స్ పాయింట్‌తో ఉద్యమం నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. హిస్టరీలో జరిగిన కొన్ని రియాలిటీ సన్నివేశాలను ఈ సినిమాలో చూపించాం. ఉద్యమ నేపథ్యం, రాజకీయం, ప్రేమకథ ఇందులో ఉంటాయి. మొత్తంగా ఇది నక్సల్ ఇన్వార్మర్ కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని తెలిపారు.

'ఈ సినిమాలో నటించిన అందరికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను. మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది. శ్రీ లక్ష్మీ నరసింహ మూవీ మేకర్స్ బ్యానర్ పై వస్తోన్న ఈ సినిమా అందరికి నచ్చే సినిమా అవుతుంది' అని నిర్మాత ప్రవీణ్ రెడ్డి జంగా చెప్పారు. శివ బాలాజీ మాట్లాడుతూ,'డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినపుడు బాగా నచ్చింది. ఇదొక ఇంటెన్స్ జోనర్. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు కాంట్రవర్సీ అవుతుందేమో అనిపించింది. డైరెక్టర్ బాగా రీసెర్చ్ చేసి ఈ కథ రాసుకున్నారు. నేను మొదటిసారిగా నక్సలైట్‌గా కనిపించబోతున్న ఈ సినిమా కొత్త కథ, కథనాలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది' అని అన్నారు.

ఆ రాత్రి ఏం జరిగింది?


'వాలెంటైన్స్ నైట్' చిత్ర బృందం


సునీల్, చైతన్య రావు మదాడి ప్రధాన పాత్రలలో స్వాన్ మూవీస్ సమర్పణలో ఫన్ సాగ బ్యానర్ పై రూపొందిన చిత్రం 'వాలెంటైన్స్ నైట్'.

అనిల్ గోపిరెడ్డి దర్శకత్వంలో యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి తృప్తి పాటిల్, సుధీర్ యాళంగి మహీంధర్ నారల నిర్మాతలు. ఈ చిత్రం నేడు (గురువారం) విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.

ఈ సందర్భంగా చైతన్య రావు మాట్లాడుతూ, 'నిర్మాతలు ఈ కథని బలంగా నమ్మి ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. దర్శకుడు అనిల్ సినిమాని చాలా కొత్తగా తెరకెక్కించారు. ఇందులో చాలా జోనర్స్ ఉన్నాయి. ఒకే సినిమాలో దాదాపు పది కథలు చూడొచ్చు. ఒక కథకి మరో కథకి ఎక్స్‌లెంట్ ఇంటర్ లింక్ ఉంటుంది. ఫ్యామిలీతో కలసి చూడాల్సిన సినిమా ఇది' అని తెలిపారు. '6 జంటల కథ ఇది. ఒకరి కథలోకి ఒకరు ప్రవేశించిన తర్వాత 'వాలెంటైన్స్ నైట్' నాడు ఏం జరిగిందనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం. ఇందులో ప్రేమ, రొమాన్స్, టీనేజ్ లైఫ్.. అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు అనిల్ గోపిరెడ్డి అన్నారు.

నవచిత్రం

సైంధవ్‌గా వెంకటేష్


వెంకటేష్

అగ్ర కథానాయకుడు వెంకటేష్ తన ల్యాండ్‌మార్క్ 75వ చిత్రం కోసం 'హిట్' సిరీస్‌తో విజయాల్ని అందించిన డైరెక్టర్ శైలేశ్ కొలనుతో చేతులు కలిపారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ పై వెంకట్ బోయనపల్లి ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ బుధవారం టైటిల్ పోస్టర్, గ్లింప్స్ ద్వారా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'సైంధవ్' అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. వెంకటేష్ పవర్ ఫుల్ లుక్‌లో చేతిలో తుపాకీ పట్టుకుని టెర్రిఫిక్‌గా కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక కారు, పేలుడును కనిపిస్తోంది. టైటిల్ పోస్టర్ 'సైంధవ్'లో యాక్షన్ ఎక్కువగా ఉంటుందని, వెంకటేష్ ఇంటెన్స్ పాత్రలో నటిస్తున్నారని చెప్పకనే చెబుతోంది.

వెంకటేష్ ఒక మెడిసన్ వయాల్ ఉన్న కూల్ బాక్స్‌తో చంద్రప్రస్థ అనే ఓడరేవు ప్రాంతంలోకి ఎంటరై, అక్కడ కంటైనర్ నుంచి తుపాకీని బయటకు తీస్తాడు. చివరగా గూండాల గ్యాంగ్‌ని ఉద్దేశించి.. 'నేనిక్కడే ఉంటార్రా... ఎక్కడికి వెళ్ళను... రమ్మను...' అంటూ హెచ్చరించడం గ్లింప్స్‌లో ప్రజెంట్ చేశారు.

గ్లింప్స్ సినిమా స్వభావం, దాని టోన్, ఇందులో వెంకటేష్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారో చూపించింది. త్వరలోనే షూటింగ్‌ని ప్రారంభిస్తామని కూడా మేకర్స్ ప్రకటించారు. గ్లింప్స్ వీడియోకి అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించిన సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ సినిమా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ నుండి ప్రొడక్షన్ నెం 2.గా రానుంది. 'శ్యామ్ సింగరాయ్'తో నిర్మాణంలో విజయవంతంగా అడుగుపెట్టింది. అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే భారీ స్థాయిలో ఈ చిత్రం రూపొందుతుంది. ఇది వెంకటేష్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా ఉండనుందని మేకర్స్ తెలిపారు.

ప్రముఖ నటీనటులు, అత్యున్నత సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం పని చేస్తున్నారు. ఎస్ మణికందన్ కెమెరామెన్‌గా, గ్యారీ బిహెచ్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్న ఈ చిత్రానికి కిషోర్ తాళ్లూరు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

హిమ వనంలో అగ్ని వర్షం..


సమంత, దేవ్ మోహన్

సమంత నటించిన లేటెస్ట్ పాన్ ఇండియా చిత్రం 'శాకుంతలం'. ఫిబ్రవరి 17న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సంగతి తెలిసిందే.

కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా దర్శకుడు గుణశేఖర్ రూపొందించిన పౌరాణిక ప్రేమ కావ్యం ఇది. ప్రతి ఫ్రేమ్‌ను అత్యద్భుతంగా తెరకెక్కించే గుణ శేఖర్ మరోసారి 'శాకుంతలం' వంటి విజువల్ వండర్‌తో పాన్ ఇండియా ప్రేక్షకులను మెస్మరైజ్ చేయటానికి సిద్ధమవుతున్నారు.

ఈ మూవీ ప్రమోషన్స్ భారీ స్థాయిలో సాగుతున్నాయి. అందులో భాగంగా విడుదలైన మూవీ ట్రైలర్, 'మల్లికా మల్లికా..' సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌ను క్రియేట్ చేశాయి. ఈ నేపథ్యంలో బుధవారం చిత్ర యూనిట్ ఈ సినిమా నుంచి 'ఋషి వనంలోన...' పాటను విడుదల చేశారు. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించటంతో మరోసారి ఆయన తనదైన శైలిలో అందమైన బాణీలను పలికించారు. దుష్యంతుడు, శకుంతల మధ్య ఉండే ప్రేమను తెలియజేసే ఈ పాట అందరి హృదయాలను ఆకట్టుకుంటోంది. ఈ పాటలో కనిపించే ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్, విజువల్స్ ప్రేక్షకులను మైమరిపింప చేస్తున్నాయి. ఈ ఇన్‌టెన్స్ క్యాచీ సాంగ్‌ను సిద్ శ్రీరామ్, చిన్మయి ఎంతో శ్రావ్యంగా ఆలపించారు. శ్రీమణి పాటను రాశారు. దేవ్ మోహన్, సమంత మధ్య ఉండే కెమిస్ట్రీ ఓ మ్యాజిక్‌ను క్రియేట్ చేసింది. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దేశం కోసం చేసిన సినిమా : పరుచూరి గోపాలకృష్ణ


రాఘవ, పరుచూరి గోపాలకృష్ణ, రవీంద్ర గోపాల

దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు తెలుగు సినీ చరిత్రలో ఎవరూ చేయనటువంటి గొప్ప దేశభక్తి చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'.

గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' లాంటి చిత్రాలను నిర్మించిన నాగలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని నిర్మించారు.

రవీంద్రజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ.. ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రలలో నటించగా సూర్య, జీవా, ప్రసాద్ బాబు, అశోక్ కుమార్, సుధ నటించారు. ఈ చిత్రంలోని పాటలను ఇటీవల ఫిలించాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత పరుచూరి గోపాలకృష్ణ, నిర్మాత దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్, మోహన్ వడ్లపట్ల, బాబ్జీ, ప్రమోద్ శర్మ బల్లెపల్లి మోహన్, ఘంటాడి కృష్ణ, దర్శకుడు, నటుడు, నిర్మాత రవీంద్ర గోపాల తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, "అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ ఇలా స్వాతంత్ర్య సమరయోధుల పాత్రలంటే ఎన్టీఆర్‌గారే గుర్తొస్తారు. అలాంటి సాహసం చేసి మన రవీంద్ర గోపాల్ ఈ సినిమాలో ఏకంగా 14 మంది స్వాతంత్ర్య సమర యోధుల పాత్రలు వేశాడు. తన మీద తనకు ఎంతో నమ్మకం ఉంటే కానీ ఇది సాధ్యం కాదు. తనకోసం కాదు.. ఇది దేశంకోసం చేసిన సినిమా. స్వాతంత్ర్య సమర యోధుల గొప్పతనాన్ని ప్రపంచానికి తెలపాలన్న తపనతో ఈ సినిమా చేశాడు. ఇటీవల సినిమా చూశాను. ప్రతి పాత్రకు న్యాయం చేశాడు. ఇందులో పాటలు కూడా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా విజయం సాధించి, మరెన్నో మంచి చిత్రాలు చేసే ప్రోత్సాహాన్ని ప్రేక్షకులు కల్పించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'ఒక మంచి సినిమా చేయాలన్న కసితో చేసిన సినిమా ఇది. ఇటీవల మా చిత్ర ట్రైలర్‌ని ఆవిష్కరించి, మమ్మల్ని ఆశీర్వదించిన నిర్మాత దిల్ రాజుకి ధన్యవాదాలు. సినిమాను ఫిబ్రవరి 3న విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నాం' అని చిత్ర దర్శకుడు, నిర్మాత, నటుడు రవీంద్ర గోపాల్ తెలిపారు. సంగీత దర్శకుడు ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ,'ఇందులో 7 పాటలున్నాయి. ప్రతి పాటను నాతో అద్భుతంగా చేయించిన రవీంద్రకి ధన్యవాదాలు' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గుజరాత్ 2002 మత ఘర్షణలు 14 మంది నిందితులు విడుదల!

న్యూఢిల్లీ : గుజరాత్ 2002 మత ఘర్షణల్లో కేసుల విచారణ అత్యంత పేలవంగా సాగుతోంది. బహిరంగంగా.. పట్టపగలు వేలాది మంది ముస్లిం మైనార్టీలపై ఆనాడు హత్యాకాండ కొనసాగింది. ఈ ఘటనల్లో అరెస్టయిన నిందితులు..మెల్ల మెల్లగా నిర్దోషులుగా విడుదలవుతున్నారు. తాజాగా 14మంది నిందితులను నిర్దోషులుగా తేల్చుతూ పంచమహల్‌లోని హాలోల్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ వారు సరైన ఆధారాలు సమర్పించలేదని కేసును కొట్టేసింది. మత ఘర్షణలు 2002లో జరగగా, కోర్టు విచారణ 18ఏండ్ల తర్వాత మొదలైంది. కోర్టు విచారణ జరుగుతుండగా...నిందితుల్లో ఐదుగురు చనిపోయారు. మిగతా నిందితులకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు చూపలేదు. నేరం జరిగిన చోట నిందితుల పాత్ర ఉందని నిరూపణ కాలేదు. ఆయుధాలు, పెట్రోల్, కిరసనాయల్ వంటి పదార్థాలు నేరం జరిగిన చోట వాడినట్టు ఆధారాలు లభ్యం కాలేదని కోర్టు తెలిపింది. ఆనాడు మత ఘర్షణల కారణంగా పలు గ్రామాల్లోని ముస్లింలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో డెలోల్ గ్రామానికి చెందిన కొంతమంది ముస్లింలు 'కాలోల్ రిలీఫ్ కేంద్రా'నికి చేరుకున్నారు. రిలీఫ్ క్యాంప్‌కు వచ్చే క్రమంలో తమ కుటుంబ సభ్యులెంతో మంది గల్లంతయ్యారని కొంతమంది ముస్లింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుటుంబంపై 150 నుంచి 200మంది దాడికి తెగబడ్డారని మరొక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తానున్న గ్రామంలో దాదాపు 18 మంది ముస్లింలు కనిపించకుండా పోయారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమపై దాడి చేసినవారిని గుర్తిస్తూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, 20మందిని నిందితులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదుచేశారు. గొడ్డలి, కత్తులతో దాడి చేసి అమాయక ముస్లింలను హత్యచేశారని ఆరోపణలు నమోదయ్యాయి. అయితే నిందితులు వాడిన కత్తులు, గొడ్డళ్లు వంటివేవీ కేసు విచారణ జరిపిన పోలీసులు సేకరించలేదు. చార్జ్‌షీట్ 2004లో నమోదైంది. కొంతమంది కనిపించలేదనే కారణంతో నిందితుల్ని దోషులుగా నిర్ధారించలేమని న్యాయస్థానం అభిప్రాయపడింది.

ఏసీడీ పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం తగదు

పోలీస్ లైసెన్సుల పేరుతో వేధింపులు సరికాదు

- సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏసీడీ పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను మోపటం, పోలీసు లైసెన్స్ పేరుతో వ్యాపారులను వేధించడం సరికాదని టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఆయా నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల అసమర్థ పాలనలో, అప్పుల భారం, ఆర్థిక సంక్షోభం తప్ప తెలంగాణకు ఒరిగింది శూన్యమనీ, ఆయన కుటుంబ అవినీతి, కమిషన్ల కక్కుర్తితో ప్రభుత్వ సంస్థలు దివాళా తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలన అసమర్థతను, వ్యవస్థల పతనాన్ని కప్పి పుచ్చుకోవడానికి విద్యుత్ ఏసీడీ ఛార్జీల పేరుతో ప్రజల నెత్తిన అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. గతంలో అభివృద్ధి ఛార్జీలు, ఎడ్యుకేషన్ సెస్సులు, గ్రీన్ సెస్సుల పేరుతో భారం మోపారని గుర్తుచేశారు. మళ్లీ రెండు నెలల విద్యుత్ బిల్లుల డిపాజిట్ పేరుతో పేదల జేబుకు చిల్లుపెట్టడానికి రంగం సిద్ధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు కరోనా, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసరాల పెరుగుదలకు తోడు ఉపాధి కరువై, ఉద్యోగాలు కోల్పోయి యువత రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ డిపాజిట్ల పేరుతో ప్రభుత్వమే పేద, మధ్య తరగతి వారిపై దోపిడీకి తెగబడటం క్షమించరాని విషయమని పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి ఎందుకెళ్లాయి?

దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రగతి సాధించామన్నది నిజమైతే... విద్యుత్ సంస్థలు రూ.60 వేల కోట్ల నష్టాల్లోకి ఎందుకెళ్లాయి? అని రేవంత్‌ఈ సందర్భంగా సీఎంను ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలకు ప్రభుత్వమే రూ.20 వేల కోట్ల మేర బాకాయి పడిందని తెలిపారు. చత్తీస్‌ఘడ్‌తో వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం లోపభూయిష్టంగా ఉండి ప్రజలపై భారాలకు కారణమవుతున్నదంటూ నిపుణులు హెచ్చరించినా పెడ చెవిన పెట్టారని విమర్శించారు. యాదాద్రి-భద్రాద్రి లాంటి ప్లాంట్ల నిర్మాణంలో వినియోగిస్తున్న కాలం చెల్లిన సాంకేతికతతోనూ భారం తప్ప ప్రయోజనం లేదని స్పష్టం చేశారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు కొత్త రూపురేఖలు భూసార పరీక్షలు ప్రారంభం

- 2025 అక్టోబర్ నాటికి పనులు పూర్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌లో పునరాభివద్ధి పనులను ప్రారంభించారు. దీనికోసం భూసార పరీక్షలు, స్థలాకృతి (టోపోగ్రాఫిక్) సర్వేను పూర్తిచేశారు. ఈ పనులన్నీ 2025 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. టోపోగ్రాఫిక్ సర్వే ఆధారంగా సైట్ లేఅవుట్, సరిహద్దు నమూనా పనులు పురోగతిలో వున్నాయి. అప్‌గ్రేడ్ చేయబడిన స్టేషన్ బిల్డింగ్‌లో అధునాతనమైన హంగులతో బుకింగ్ కార్యాలయం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న స్టేషన్‌కు ఉత్తరం వైపు వచ్చే మల్టీ-లెవల్ కార్ పార్కింగ్‌కు అనుగుణంగా, ప్రస్తుత బుకింగ్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్చాల్సి ఉంటుంది. తద్వారా ఇదివరకే ఉత్తరం వైపు ఉన్న ద్విచక్ర వాహనాల పార్కింగ్ గేట్ నంబర్ 3 సమీపంలో ప్రత్యామ్నాయ ప్రదేశానికి (ఉత్తరం వైపునే) మార్చబడింది. దీనికి సంబంధించిన తవ్వకం పనులు సాగుతున్నాయి. పాత రైల్వే క్వార్టర్స్‌ను తొలగించి, కొత్త ఆర్‌పిఎఫ్ కార్యాలయ నిర్మాణం కోసం పునాదుల తవ్వకం పనులు పురోగతిలో ఉన్నాయి.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన..

500 మంది నిరుపేదలు



ప్రభుత్వ భూములు పేదలకు పంచాల్సిందే.. : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ అనేక వాగ్దానాలు ఇచ్చిందని, అయినప్పటికీ నేటి వరకు వాటిని అమలుచేయకపోవడంతో విసిగివేసారిన పేదలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేసుకున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చాలీచాలని వేతనాలతో అద్దె భవనాల్లో నివసిస్తున్న 500 మందికి పైగా నిరుపేదలు.. సర్వే నెంబర్-283, 284, 285లో బుధవారం గుడిసెలు వేసి ఇంటి స్థలాల పోరాటం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, సింగరేణి అధికారులు.. అక్కడికి చేరుకొని నిలువరించే ప్రయత్నం చేయగా.. అక్కడే భీష్మించుకు కూర్చుని.. ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాల్సిందేనని పట్టుబట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో నిరుపేద కుటుంబాలు అద్దె భవనాలలో తీవ్ర ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్న నిరుపేద కుటుంబాలు.. ఇంటి స్థలాల పోరాటం ప్రారంభించారని తెలిపారు. ఎనిమిదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు.

తమ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. దాంతో చేసేదేమీ లేక నిరుపేదలతో భూ పోరాటం ప్రారంభించినట్టు తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాల పోరాట బాధ్యులకు ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో సహా ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు కంపేటి రాజన్న, చెన్నూరి రమేష్, పొలం రాజేందర్, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు కేసీఆర్ సర్కారుకు చెంపపెట్టు

పరేడ్‌తో గణతంత్ర దినోత్సవం చేయాలి

కరోనా సాకు చూపెట్టడం దారుణం : ఎంపీ లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పరేడ్‌తో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్న హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామనీ, ఇది కేసీఆర్ సర్కారుకు చెంపపెట్టులాంటిదని బీజేపీ ఓబీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, ఇతర పార్టీల సభలకు లేని కోవిడ్ నిబంధనలు, గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎందుకని ప్రశ్నించారు. దేశం గర్వించదగ్గ వేడుకకి తుచ్ఛ రాజకీయాలను ఆపాదించడం దారుణమని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేసీఆర్ ముందుకెళుతున్నారని విమర్శించారు. రాజ్‌భవన్‌లో వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారనీ, అసలు క్యాబినెట్ ఎప్పుడు జరిగింది? నిర్ణయం ఎక్కడ తీసుకున్నారు? అని ప్రశ్నించారు. మహిళా గవర్నర్ అని చూడకుండా మినిమం ప్రోటోకాల్ కూడా పాటించకపోవడం దారుణమన్నారు. తమ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కేసీఆర్ ఓటమే లక్ష్యంగా ముందుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా ఒకసారి మోడీ, అమిత్‌షా, జేపీ నడ్డా పర్యటిస్తారని తెలిపారు. 11వేల గ్రామాల్లో సమావేశాలు పెట్టి కేసీఆర్ మోసాలను ఎండగడుతామన్నారు. పల్లెగోస-బీజేపీ భరోసా పేరుతో ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. శుక్రవారం జరిగే పరీక్షా పే చర్చ తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ స్థానం పరిధిలోని ఐదు పాఠశాలల్లో మోడీ ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పరేడ్ గ్రౌండ్‌లోనే గణతంత్ర వేడుకలు నిర్వహించాలి: బండి

పరేడ్ గ్రౌండ్‌లోనే అధికారికంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గవర్నర్ వ్యవస్థను గౌరవించాలనీ, రాజ్యాంగ, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని కోరారు.

మేడ్చల్, భూపాలపల్లి, గద్వాలలో డ్రాపౌట్లు ఎక్కువ

- 41,369 బడుల్లో 62.28 లక్షల విద్యార్థులు చేరిక
- రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదికలో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 41,369 బడుల్లో 62,28,665 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 20,711, ప్రాథమికోన్నత పాఠశాలలు 7,688, ఉన్నత పాఠశాలలు 12,045, మాధ్యమిక పాఠశాలలు 924 ఉన్నాయి. హైదరాబాద్‌లో అత్యధికంగా 2,929 స్కూళ్లు, అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లిలో 542 పాఠశాలలున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అర్థగణాంక శాఖ నివేదికను బుధవారం విడుదల చేసింది. అందులో పాఠశాల విద్యాశాఖకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనే డ్రాపౌట్లు రికార్డు స్థాయిలో ఉన్నారని ప్రకటించింది. ఉన్నత పాఠశాలల్లో మేడ్చల్ మల్కాజిగిరిలో 26.71 శాతం, జయశంకర్ భూపాలపల్లిలో 26.08 శాతం, జోగులాంబ గద్వాలలో 23.37 శాతం డ్రాపౌట్లున్నారని వివరించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి హైదరాబాద్‌లో ఎక్కువ డ్రాపౌట్లున్నారని తెలిపింది. ప్రాథమిక స్థాయిలో 7.37 శాతం, ప్రాథమికోన్నత స్థాయిలో 7.78 శాతం డ్రాపౌట్లున్నారని పేర్కొంది.

రాజన్న సిరిసిల్లలో ప్రాథమిక పాఠశాలల్లో రికార్డు స్థాయిలో నెగెటివ్ డ్రాపౌట్ (-7.43 శాతం) నమోదైంది. పెద్దపల్లిలో ప్రాథమికోన్నత స్కూళ్లలో నెగెటివ్ డ్రాపౌట్ (-0.69 శాతం), కరీంనగర్‌లో ఉన్నత పాఠశాలల్లో (-1.46 శాతం) నమోదైందని వివరించింది. ప్రాథమిక పాఠశాలల్లో 2021-22 విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో -0.54 శాతం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3.14 శాతం, ఉన్నత పాఠశాలల్లో 13.74 శాతం డ్రాపౌట్లున్నారు.

రైతాంగంపై పన్ను ఆలోచన అత్యంత దుర్మార్గం..

- ఎమ్మెల్సీ పల్లా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఏనాడూ ఎవ్వరూ ఆలోచించని విధంగా మోడీ ప్రభుత్వం... రైతాంగంపై పన్ను వేయాలనుకోవటం అత్యంత దుర్మార్గమని రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మెన్ వివేక్ దేబ్‌రాయ్... ఒక పత్రికలో రైతుల ఆదాయంపై కూడా పన్నేయాలంటూ వ్యాసం రాశారని గుర్తు చేశారు. ఇది ఆయన మాటగా తాము భావించటం లేదనీ, మోడీ మన్ కీ బాత్‌గా భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, యెగ్గె మల్లేశంతో కలిసి పల్లా విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ స్వయంగా ప్రధానే అనేకసార్లు ప్రకటించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. 60 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ ఇస్తామని కూడా బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో హామీనిచ్చిందని తెలిపారు. వ్యవసాయానికి రూ.30 లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయిస్తామంటూ ఆ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. వాటన్నింటినీ ఇప్పుడు తుంగలో తొక్కారని విమర్శించారు. మరోవైపు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయకపోగా పెట్టుబడి వ్యయాన్ని రెట్టింపు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రైతుల ఆదాయంపై పన్నేయాలంటూ సూచించిన వివేక్ దేబ్‌రాయ్‌ను వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

'పద్మ' అవార్డులకు ఎంపికైన వారికి సీఎం శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు 'పద్మ' అవార్డులకు ఎంపిక కావటం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తాము ఎంచుకున్న రంగాల్లో అత్యంత ప్రతిభను కనబరుస్తూ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ, బాధ్యతగా వ్యవహరించటం ద్వారా వారు రేపటి తరానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్‌ను పంపండి..

అధికారులకు ఆదేశాలు

అజ్మీర్ దర్గా ఉర్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించే 'చాదర్'ను సీఎం కేసీఆర్ ఈ ఏడాది కూడా సమర్పించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముస్లిం మత పెద్దల సమక్షంలో దైవ ప్రార్థనల అనంతరం అజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పించేందుకు వీలుగా అక్కడికి దాన్ని పంపాలంటూ వక్ఫ్ బోర్డు అధికారులను ఆదేశించారు.

సొంత గ్రామానికి రాజీవ్‌సాగర్ చేయూత..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన సొంత గ్రామమైన వెలుగుపల్లికి తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ చేయూతనిచ్చారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి సన్నిధానం నిర్మాణానికి వీలుగా స్థలం కొనుగోలుకు రూ.రెండు లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుట్టిన ఊరును, కన్న తల్లిని ఎప్పటికీ మరువకూడదని తెలిపారు. అందుకే తన స్వగ్రామానికి తోచిన సాయాన్ని అందజేస్తున్నానని వివరించారు.

ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించాలి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలి
- మూసీని ప్రక్షాళన చేయాలి
- ప్రజాసమస్యలపై బీఆర్ఎస్‌తో రాజీపడబోం..: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-సూర్యాపేట

ఫిబ్రవరి ఒకటి నుంచి కేంద్ర బడ్జెట్, ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాలకు బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సంక్షేమ రంగానికి నిధులు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నాయి తప్ప ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లోనైనా గతేడాది ఖర్చు చేయని నిధులను కలిపి కొత్తగా కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టుకు జాతీయహోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మూసీని ప్రక్షాళన చేసి వెంటనే ఆధునీకరణ చేయాలన్నారు. మిర్యాలగూడెం నుంచి సూర్యాపేట మీదుగా ఖాజీపేట వరకు రైలుమార్గం ఏర్పాటు చేయాలని అనేక ఏండ్లుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రతిపాదనలు చేస్తున్నారు తప్ప సూర్యాపేటకు రైలుమార్గం ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైలు మార్గం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) రాజకీయ కర్తవ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. బీఆర్ఎస్‌తో కలిసి పని చేసినంత మాత్రాన ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలయ్యే వరకు ఉద్యమిస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, నాయకులు మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మీ, కోటగోపి, మేక అశోక్‌రెడ్డి, ఎల్గూరి గోవింద్, జె.నర్సింహారావు, మేకనబోయిన శేఖర్, మద్దెల జ్యోతి, మేకనబోయినసైదమ్మ చిన్నపంగ నర్సయ్య పాల్గొన్నారు.

30తో ముగియనున్న భారత్ జోడో యాత్ర

- 26 నుంచి ఆరు లక్షల గ్రామాల్లో రాహుల్ సందేశం : పవన్ ఖేరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30తో ముగుస్తుందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరు లక్షల గ్రామాల్లో యాత్రలు నిర్వహించటం ద్వారా పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు చేరవేస్తాయని వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ హయాంలో నిత్యావసరాల ధరలు పెరిగాయనీ, చిన్న, మధ్య తరహా వ్యాపారులు రోడ్డున పడ్డారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా 100 మంది బడా పారిశ్రామికవేత్తల వద్ద రూ.13 లక్షల కోట్ల సంపద పోగుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టటం ద్వారా ఆ పార్టీ తన పబ్బం గడుపుకుంటున్నదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చారనీ, వాస్తవంగా అది వీఆర్ఎస్ (వాలంటరీ రిటైర్మెంట్ సర్వీస్) అని ఎద్దేవా చేశారు.

119 స్థానాల్లో పోటీ

- బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 ఎమ్మెల్యే స్థానాల్లో ఎంసీపీఐ(యూ),బీఎల్పీ, బీసీపీ, ఎంబీటీలతో కలిసి పోటీ చేస్తామని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో బీఎల్ఎఫ్ ఐదో ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్ష పార్టీలు ఒకే శక్తిగా బీఎల్ఎఫ్‌లో భాగస్వాములై రాజ్యాధికారం సాధించాలని కోరారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఎదుర్కొనే శక్తి, సిద్ధాంతం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేవని చెప్పారు. సిద్ధాంతం ఉన్న కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు మాత్రమే ఎదుర్కొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె పర్వతాలు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్ సిద్ధిరాములు, హంసారెడ్డి, కన్నం వెంకన్న, పెద్దారపు రమేష్, బీసీ కులాల ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎంఎం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలు కావట్లేదనీ, కల్వకుంట్ల వారి రాజ్యాంగం అమలవుతున్నదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు అడ్డురాని కరోనా, గణతంత్ర వేడుకలకు అడ్డొచ్చిందా అని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో ప్రశ్నించారు. భారత రాజ్యాంగంపై ఏమాత్రం నమ్మకం, విశ్వాసం లేని సీఎం కేసీఆర్ దాన్ని మార్చాలని చెప్పినప్పుడే దేశద్రోహి అని అర్థమయ్యిందన్నారు. హైకోర్టు ఆదేశాలు కూడా లెక్కలేకుండా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

రాజారాంకు రాష్ట్రపతి పోలీస్ పతకం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ రాజారాంకు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ పతకం లభించింది. ఇండియన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్వీస్‌లో 1989 బ్యాచ్‌కి చెందిన ఆయన దేశంలోని విభిన్న భౌగోళిక ప్రాంతాల్లో, వివిధ జోనల్ రైల్వేల్లో పనిచేశారు.

నీరాకు ఆదరణ

- రోమ్ పర్యటనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో 'నీరా'కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని పర్యాటక, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. తమ శాఖ ఆధ్వర్యంలో సుమారు 3.75 కోట్ల ఈత, తాటి మొక్కలను నాటామన్నారు. ఈత, తాటి చెట్ల నుంచి నీరా, బెల్లం, తేనె, సిరప్‌లను తయారు చేస్తున్నామని రోమ్ నగరంలో పర్యటిస్తున్న ఆయన తెలిపారు. ఆల్కాహాల్ రహిత పానీయంగా నీరాను ఉత్పత్తి చేస్తున్నామనీ, దానితో పాటే మరిన్ని ఉప ఉత్పత్తులనూ ప్రోత్సహిస్తున్నట్టు బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.

జులై 2న గురుపూజా మహోత్సవాలు- ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గురుపూర్ణిమ సందర్భంగా జులై 2వ తేదీ హైదరాబాద్‌లో గురుపూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఎంపీ రవిచంద్ర తెలిపారు. బుధవారంనాడయన స్వగృహానికి స్వామి గురవానంద విచ్చేసి, ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. మంత్రి గంగుల కమలాకర్, లోక్‌సభ సభ్యులు బీ.బీ.పాటిల్, ఎమ్మెల్సీ సుంకరి రాజు (శంభీపూర్ రాజు), హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్తలు రవీందర్ రెడ్డి, సదా విజయ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల ఆస్తులు ఈడీ ఎటాచ్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసులో నిందితుల ఆస్తులు అటాచ్ చేసింది. వ్యాపారవేత్త సమీర్ మహేంద్రు, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన విజయ్ నాయర్ ఇళ్లను అటాచ్ చేసింది. అలాగే దినేష్ అరోరా రెస్టారెంట్‌ను, అమిత్ అరోరా ఆస్తులను కూడా అటాచ్ చేసింది. సమీర్ మహేంద్రుకు చెందిన రూ.35 కోట్ల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. అలాగే అమిత్ అరోరాకు చెందిన రూ.7.68 కోట్లు, విజయ్ నాయర్‌కు చెందిన రూ.1.77 కోట్లు, దినేష్ అరోరాకు చెందిన రూ.3.18 కోట్లు, అరుణ్ పిళ్లైకి చెందిన రూ.2.25 కోట్లు, ఇండో స్పిరిట్‌కు చెందిన రూ.14.39 కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు. కాగా ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో రూ.2,873 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇప్పటి వరకు రూ. 76.54 కోట్ల నగదును పట్టుకున్నామని ఈడీ అధికారులు వెల్లడించారు.

నిందితుల బెయిల్ పిటిషన్ల విచారణ

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితులు సమీర్ మహేంద్రుడు, విజయ్ నాయర్, అభిషేక్ బోయిన్ పల్లి, బినాయ్ బాబు, శరత్ చంద్రారెడ్డిలను బెయిల్ పిటిషన్లను సిబిఐ ప్రత్యేక కోర్టు విచారించింది. బుధవారం వాదనలు ముగిశాయి. నిందితుల బెయిల్ పై ఫిబ్రవరి 9న తీర్పు ఇవ్వనుంది.

పిల్లల కెరీర్‌పై 29న ఉచిత అవగాహన సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి, ఇంటర్మీడియెట్ తర్వాత పిల్లల కెరీర్‌పై తల్లిదండ్రులు, అధ్యాపకుల పాత్రపై ఈనెల 29న ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉన్న తమ అకాడమిలో ఈనెల 29న ఉదయం 9.30కు నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ చింత గణేష్, ప్రముఖ వ్యక్తిత్వ నిపుణులు సుధీర్ సంద్రా హాజరవుతారని వివరించారు. పిల్లల కెరీర్ ఆప్షన్లు, సాఫ్ట్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత, అధ్యాపకుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.